


ఆంధ్రసచిత్రవారపత్రిక




3-11-72

50 పైసలు


వెంకన్న కొలువు
బొమ్మలకథ: బాపు
23
ఏం పిల్లా! మా రమణంటే నీకిష్టమేనా - లేపోతే చెప్పు అంతేగానీ వూరికే చెంపలు పగలగొట్టుకు!
లేపోతే మరో అమ్మాయిని చేసుకుంటానంటాడా!
ఐతే శుభం!
నమస్కారం సార్! ఆరోజు ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి వెళ్లాను - మళ్లా రావడానికి తీరిక చిక్కలేదు - ఇవాళ మీకు ఉద్యోగం యిప్పిస్తాను పదండి!
అవసర్లేదు నాకుద్యోగం దొరికింది!
ఐతే నే శెలవు తీసుకుంటా సార్! కానీ ఈ సారి మీకుద్యోగం యిప్పించే భాగ్యం కలగజేయండి!
వెధవ లోకమండి! అందరూ అవసరానికి ఉపయోగించు కొనే వాళ్లేగాని - ఉద్యోగం యిప్పిస్తాం అని ఎవరూ అనరు. పేపర్లో పేరు పడ్డంతర్వాత జలుబు కంపెనీ వాళ్లు నాకుద్యోగం వెంటనే ఇచ్చారు-
ఆ జలుబు కంపెనీ డైరెక్టరొకాయన ఒ ఐడియా కూడా చెప్పాడు - 'మీరు తుమ్ముని వ్యాపారపరం చెయ్యండి - ఎవరైనా తుమ్మడానికి పిలిస్తే ఇంత అని రేటు చెప్పండి - అంతే - మా కంపెనీ ప్రత్యేక జలుబు మందు మీ జలుబుని ఇనుమడింప జేసి మీ వ్యాపారాన్ని వృద్ధి చేస్తుంది!' అని....
ఇతనేం - నెలకో నాలుగు తుమ్ములు తుమ్ముకుంటే చాలు డబ్బులు - మిగతా కాలం రాజ్యో నేనూ యుగళగీతాలు పాడుకుంటాం!
(ఇంకా ఉంది)



సాంప్రదాయాల పట్టింపులతో ముడిపెట్టుకునే పాతయుగం కాదు
ఇది ఆధునికం- ప్రజా యుగం- ఇది మూడుతరాల జీవితం చెప్పిన సత్యం!
రామకృష్ణా • ఎన్.ఎ.టి. కంబైన్స్ వారి
కులగౌరవం
కథా విధానము : చిత్రీకరణ పర్యవేక్షణ: యన్.టి.రామారావు. బి.ఎ.,
★ నిర్మాత: త్రివిక్రమరావు
ఆంధ్ర, సీడెడ్ విజయా పిక్చర్స్
ఛాయాగ్రహణం: మార్కస్ బార్ట్లే ★ దర్శకత్వం: పేకేటి శివరాం.బి.ఎ.
VIJAYA



ఊరిమెస్ కార్టూన్

Scheduled Castes Rights Protection Society

ANDHRA PRADESH

No. SCRPS/ 20/72

To
Smt. S. Radha Krishna
The Editor,
Andhra Sachitra Vara Patrika.
Tannavaradi St. Madras-1

Sub:- Carthoon in the Weekly Date ..7-7-1972

Sir,

A cartoom on "MARUTHUNNA KALAM" has been appeared in your weekly date...7-7-72

The idea of depicting the cartoom ie admission to Colleges is insulthing the Scheduled castes. You are well aware that the Scheduled Castes were crushed for decades and were illtreated. Inspite of 25 years of independence the caste Hindus are still jealous about the progress of Scheduled Castes. It is very sorry to note that the attitude of caste Hindus has not been changed so for towards the Scheduled Castes.

It is improper on the part of the editor to publise such cartoons insulting the scheduled castes.

Kindly intimate under what cirumstances the above cartoon has been published.

An early reply is solicited.

JAI BHEEM.

Yours in service,
(T. YADAIAH)
General Secratary.

7—7—1972 తేదీ ఆంధ్రసచిత్రవార పత్రికలో ప్రచురింప బడిన ఒక కార్టూను గురించి 'షెడ్యూల్డ్ కాస్ట్స్ రయిట్స్ ప్రొటెక్షన్ సొసయిటీ, ఆంధ్రప్రదేశ్' జనరల్ సెక్రటరీ 21—9—1972 తేదీన మాకు రాసిన ఉత్తరం, అందులో పేర్కొనబడిన కార్టూను వెంబడి ప్రచురిస్తున్నాము. 'షెడ్యూల్డ్ కాస్ట్స్ రయిట్స్ ప్రొటెక్షన్ సొసయిటీ' ఆంధ్రప్రదేశ్ జనరల్ సెక్రటరీ ఉత్తరాన్ని అనువాదం చేసి ఈ కింద ఇస్తున్నాము.

ఎవరినీ అవమాన పరిచే ఉద్దేశం మాకు ఎప్పుడూ లేదని ఈ సందర్భంలో మేము చెప్పదల్చుకుంటున్నాము.

'మారుతున్న కాలం మీద 7—7—1972 తేదీ (5వ పేజీ) కల మీ వారపత్రికలో ఒక కార్టూను కనిపించినది.

'కార్టూన్ సూచించే భావం, అంటే కాలేజీకి ఎడ్మిషనులు, షెడ్యూల్డ్ కులాల వారికి అవమానకరంగా ఉంది. షెడ్యూల్డ్ కులాలవారు దశాబ్దాలుగా చితకకొట్ట బడినారనీ, హింస పెట్ట బడినారనీ మీకు బాగా తెలుసు. 25 సంవత్సరాల స్వాతంత్ర్యం తరువాత కూడా 'సవర్ణ హిందువులు' షెడ్యూల్డు కులాల వారి ప్రగతిని చూసి అసూయ పడుతున్నారు. ఇంతదాకా షెడ్యూల్డ్ కులాలవారి పట్ల 'సవర్ణ హిందువు'ల వైఖరి మారలేదని గమనించి విచారించవలసి వస్తున్నది.

'షెడ్యూల్డ్ కులాలని అవమానించే ఇటువంటి కార్టూనులని ప్రచురించటం సంపాదకుడికి భావ్యం కాదు.

'ఏ పరిస్థితులలో పయి కార్టూను ప్రచురింప బడినదో దయచేసి తెలుపగలరు.

ఉత్తరాలు


'త్వరలో సమాధానం కోరబడుచున్నది.
'జై భీమ్.

సేవలో మీ
సంతకం.
(టి. యాదయ్య.)
జనరల్ సెక్రటరీ.

వ్యాసాలు

29—9—72 సంచికలోని కథలు ఏమంత బాగోలేదు. విద్యార్థి సీరియల్ ఇప్పుడు బాగుంటోంది.

'మా ఇంట్లో పెద్దా రెవరు?' అనే వ్యాసంలో రామలక్ష్మిగారు సెక్సుని పబ్లిక్ చెయ్యటం మంచిదనే అభిప్రాయం వెలిబుచ్చారు. మద్రాసులో సెక్సు పుస్తకాలు నిషేధించారు. కాని ఆంధ్ర రాష్ట్రంలో ఆ నిషేధంలేదు. ఆ సెక్సు పుస్తకాలే కాదు, నగ్న చిత్రాల ఆల్బమ్స్ కూడా ప్రతీ కిళ్ళీ షాపులోను, పుస్తకాల కొట్లలోను దొరుకుతూంటాయి. మద్రాసీయులకు, ఆంధ్రులకు తిండి



విషయంలో చాలా తేడా ఉంటుంది. ఆంధ్రులు కారం ఎక్కువ వాడుతారు. తొందరగా ఉద్రేకానికి లోనవుతారు. ఇక విజయవాడలాంటి పట్టణాల్లో ఎండలు కూడా ఎక్కువ. వీటికితోడు పబ్లిక్కుగా పర విహారం చేస్తున్న ఈ సెక్సు! వీటిని విద్యార్థులు, (ఇతరులు కూడా) మహా ప్రియంగా చదువుతుంటారు. ఇది వారి నాశనాల్లో ఎటువంటి నైతిక పతనానికి దిగజార్చుతుందో రామలక్ష్మిగారు ఊహించలేరా? త్రాగుడును పబ్లిక్ చేసిందానికి నిషేధం ఉంచిన దానికి తేడాలేదా?

వసుపులేటి రామారావు, (మద్రాసు)

* * *

8—9—72 వ తేదీ వారపత్రికలో డా. వెంకటేశ్వరరావుగారి వ్యాసం చాలా బాగుంది. ఆయన చెప్పినట్లుగా పుష్టికరమైన ఆహారం లేకపోవడం వల్లనే మనలో వ్యాధినిరోధక శక్తి తగ్గిపోయింది. రోగాలు ఎక్కువైపోయాయి. మందులు కూడా ఎక్కువైపోయాయి. అనుభవజ్ఞులైన డాక్టర్ల చేత 'కొన్ని జబ్బులు రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి' అనే వ్యాసములు వ్రాయించి అప్పుడప్పుడు వారపత్రికలో వేస్తూయుంటే పాఠకులకు ఉపయోగంగా వుంటుంది. ప్రజలు కూడా స్వంత వైద్యం చేసుకుని ఆరోగ్యాలు పాడు చేసుకోకుండా ఉండ గలుగుతారు.

డాక్టరు ఎం. రామమూర్తి, (విజయవాడ)

గే యా లు

శ్రీ ఎన్. శ్రీనివాసులునాయుడుగారి 'వలపురాణి, గేయం చక్కని పదజాలము, భావముతోకూడి' మళ్ళీ మళ్ళీ చదవాలనిపించే విధముగా మన్నది. నేను నా మిత్ర బృందము చాలా సంతసించితిమి.

వారణాశి రామయ్య, (తిరుపతి)

సి ని మా

నటసామ్రాట్ అక్కినేని జన్మదినోత్సవసందర్భముగా చిరంజీవి నాగేశ్వరరావు అని సంబోధించి వ్రాయడం బాగుంది. కాని అతడు దేవుణ్ణి వృత్తిలో చూస్తూ భక్తితో కొలుస్తున్నారన్నారు విలేఖరి శ్రీనివాస్‌గారు. ప్రతివారి వృత్తిలో సక్రమకర్తవ్య నిర్వహణ లేదా అధికధనార్జన యివి రెండే ముఖ్యముగా కనిపిస్తాయి. అలాంటప్పుడు ఒకరు తన డ్యూటీ సరిగా చేస్తూ నాల్గు కేసులు ఎక్కువగ పట్టినంత మాత్రాన మరొకరు క్షవరం చేయడంలో నైపుణ్యత వుండి నాల్గురాళ్ళు బాగా సంపాదించినంతమాత్రాన యికవాళ్ళు దేవుని పూజించడం అనవసరమేనా? పత్రికా లోకానికి ఎప్పటికప్పుడు వినూత్నమైన వసంతాన్ని (ఫిలిం న్యూస్‌ను) తెచ్చే ప్రతిభ వుండి పాఠకలోకంచే పొగడబడే శ్రీనివాస్‌గారే యిలా వ్రాసారంటే విచారంగాకమరేముంటుంది?

—సత్యశ్రీ, (కొత్తగూడెం)

* *

నేటి హీరో శోభన్‌బాబుగారిమీద వ్రాసిన ఉత్తరము (22—9—72) చాల సమంజసముగా ఉన్నది. నిజంగా శోభన్‌బాబు తెలుగుచిత్ర పరిశ్రమకే నాయకుడు.

ప్రతాప్, సంధ్య, (విజయవాడ)

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938 - 1972)

శుక్రవారం : 3-11-72

శ్రీపరీధావినామసం॥ఆశ్వయుజమాసం బ॥త్రయో॥

సంపుటము : *66* సంచిక : *8*

స్థాపితం : **1908**


సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

ఆంధ్రపత్రిక కార్యాలయము
7. తంబుచెట్టి వీధి, మద్రాసు-1

విడి ప్రతి వెల 50 పైసలు

విషయానుక్రమణిక

27—10—72.


జాతి వైషమ్యాలు
ప్రజల్లో అసంతృప్తి
వేరు పడిన కుటుంబం

హైదరాబాద్ నోట్ బుక్

తిరుమల రామచంద్ర

మురికి పేటల బాగు

మురికి మనను అంటిపెట్టుకొని వుండడం తప్పనిసరే. కాని దానిని ఎప్పటి కప్పుడు మనం తొలగించడానికి ప్రయత్నిస్తూనే ఉండాలి; వుంటున్నాము. కాని మన పరిసరాలు మురికయినప్పుడు సమాజం కృషి చేయవలసి ఉంటుంది, దీని కోసం. పేదు సమాజం, ప్రభుత్వం ఒక నాణెం రెండు వైపులే గనుక, ముఖ్యమంత్రి శ్రీ నరసింహారావు, గాంధీ జయంతి నాడు నగరంలో పెక్కుచోట్ల మురికి పేటల నిర్మూలనకు ప్రారంభోత్సవం చేయడం సంతోష కారణం. నగరంలోని కాలాడేరా, భోలక్‌పూర్, జగ్‌జీవన్ నగర్, దేవ నగర్ వంటి మురికిపేటలు త్వరలో మహానగరాలై జంట నగరాల సౌందర్యాన్ని ఎక్కువ చేస్తాయని, మునిసిపల్ కార్పొరేషన్, ఈ పథకాలను సవ్యంగా సమాప్తి చేస్తుందని పౌరులు ఆశిస్తున్నారు.


వన్య మృగ సప్తాహం

వివిధ పర్వాల సప్తాహాలలాగే వన్య మృగాల రక్షణ సప్తాహమూ దేశమంతా జరిగాయి. జంట నగరాలలోనూ జరిగింది. ప్రతి వక్త, 'అయ్యో అందమయిన పులి అంతరించి పోతోంది; గిర్‌నార్ సింహాలు మరుగయి పోతున్నాయి. ఇంక ఏమి గతి?' అన్నట్టుగా ప్రసంగించారు. ఏం, ఈ క్రూర మృగాలు అంతరిస్తే ఏం? పూర్వపు రాక్షసి బల్లులూ, రాక్షసి చేపలూ, రాక్షసి మొక్కలూ — జంతువులను తినివేసే మొక్కలూ — అంతరించి పోలేదా? మన మానవజాతికి పూర్వ రూపాలైన ప్రాణులూ నశించిపోలేదా? ఇవి పోతే ఏమయింది? మానవుని ఆహారానికిగాని, పశువుల గ్రాసానికిగాని వినియోగపడక పోగా, ఆహారానికి మనతో పోటీ పడుతూ, మన జీవితానికి ముప్పు కలిగించే ఈ మృగాలు పోతే ఏమి? ఇలాంటివి ఉండేవి అని, ముందు తరాల వారికి తెలుపడానికి చిత్ర వస్తు ప్రదర్శన శాలలో ఉండనే ఉంటాయి. జీవ పరిణామాన్ని నిత్య జీవితంలో పొందుపరచి నిరంతర అవతార చక్రంగా మననం చేసుకొనే మనం ఈ వన్య మృగాలకోసం వలవంత పడ నక్కరలేదు. ఇంతకూ నాగరకత పెరిగిన కొద్దీ, వనాలు తక్కువ కావడం, వ్యవసాయం విస్తరించడం తప్పవు.

శ్రీ టి. ఆర్. దాస్

చాల ఉద్యమాలకు, చాల కార్యక్రమాలకు మనదే అగ్రతాంబూల మయినట్టు, సాంకేతిక విశ్వ విద్యాలయ నిర్మాణంలోను మనదే ముందంజ. మన ప్రియతమ ప్రజానాయకుడు జవాహర్‌లాల్ పేరుతో దీనిని అలంకరించడమూ ఏంతో బాగ్యుండిం. శ్రీ టి. ఆర్. దాస్ దీనికి మొదటి ఉపాధ్యక్షుడు కావడం ఈ రంగంలో అత్యధిక సంఖ్యాకులకు ఆనందం కలిగించింది.

శ్రీ దాస్ జన్మస్థానం వెంకటగిరి. మద్రాసు గిండీ ఇంజనీరింగ్ కళాశాలలో ఉత్తమ తరగతిలో ఉత్తీర్ణు లయినప్పటి నుండీ, బాధ్యత గల పదవులు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాంకేతిక శిక్షణ శాఖ డిప్యూటీ డైరెక్టరుగాను, జాయింట్ డైరెక్టరుగాను ఉండి, 1964



గ్రామీణ విద్యుదీకరణ సంస్థ అధ్యక్షుడు శ్రీ బి. వెంకటప్పయ్య. అమెరికన్ ఛార్జి డిఎఫైర్స్‌గాలన్ విల్. స్టోన్ అమెరికా ప్రభుత్వం గ్రామీణ విద్యుదీకరణకి కేటాయించిన గ్రాంటు రు. 105కోట్ల రూపాయల్లో కొంత భాగంగా 40.8 కోట్ల రూపాయలకి చెక్కుని అందజేస్తున్న దృశ్యం.

లో సాంకేతిక విద్యాశాఖ డైరెక్టరయ్యారు. సాంకేతిక విద్యా ప్రణాళికా రచనా నిర్వహణలలో దాదాపు 20 సంవత్సరాల అనుభవం గలవారు. అమెరికా, ఇంగ్లండు, సోవియట్ యూనియన్‌లలో పర్యటించి అనుభవం గడించినవారు. సాంకేతిక విశ్వ విద్యాలయం ప్రత్యేకాధికారిగా, ఈ విశ్వ విద్యాలయ నిర్మాణ పథకం రూపొందించిన వారు. ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలలో, సాంకేతిక విద్యలలో ఎంతో వెనుకబడి ఉంది. ఈ వెనుకబడినతనం ఈ సాంకేతిక విశ్వ విద్యాలయం తగ్గించగలదనే నమ్మవచ్చు.

బతుకులో బతకమ్మ

తెలుగుసీమ పండుగలలో బతకమ్మ పండుగ, మహిళలు నూటికి నూరుపాళ్ళూ పాల్గొనేది గనుక మరీ రమణీయంగా ఉంటుంది. బతకమ్మ అంటే, మన బతుకుకు, మనుగడకు, జీవికకు, జీవానికి మూలకారకురాలయిన మంగళగౌరి, ప్రాణ దాత్రి. ఇతర ప్రాంతాలలో యిది మంగళగౌరి, శారదగౌరి అయినా, తెలంగాణా మహిళలకు బతకమ్మ. మన పండుగలలో చాలావరకు అన్నీ ఆయా ఋతువుల ఉత్సవాలయినట్లే బతకమ్మ వర్షా శరదృతువుల స్వరూపదేవత. మెరిసిపోయే పళ్లెలలో, గునుగు, గుమ్మడి, తుమ్మి, మొదలయిన ఏతదృతు పుష్పాలతో గోపురాలులాగ, నవరత్న ఖచిత కిరీటాలలాగ కనిపించే ఈ మంగళగౌరిని అర చేతులలో పెట్టుకొని, ఉయ్యాలలు పాడుతూ, హుసేన్‌సాగర్ చెరువు గట్టుమీద పెండ్లి వడకలతో వెళ్ళుతున్న వేలాది పేరంటాండ్ల సమూహం—ఆహా! ఎంత సుందర దృశ్యం! వారంతా బతకమ్మను విజయదశమి నాడు, ఓలలాడించడానికి వెళ్ళుతున్నారు — గౌరీదేవిని సాగనంపడానికి వెళ్ళుతున్నారు. ఆయా ఋతువుల పూవులతో ప్రకృతి దేవిని అలంకరించడం, ఆయా ఋతువుల ఫలాలు దేవికి నివేదించడం ఎంతటి మధుర భావన! ఎంతటి కృతజ్ఞతా ప్రకటన!

శ్రీ పెద్దిభొట్లవారి సలహా

ప్రముఖ రచయిత, శ్రీ పెద్దిభొట్ల సుబ్బరామయ్య అక్టోబర్ మొదటి వారంలో హైదరాబాద్ ప్రథమ అభ్యుదయ రచయితల మహాసభను ప్రారంభిస్తూ, సమసామయిక సాహిత్యం సామాన్య ప్రజల జీవితాన్ని ప్రతిఫలింపజేయాలన్నారు. 'సామాన్య ప్రజలు జీవితంలోని అన్ని అంశాలను చూడలేరు. రచయిత అన్ని విషయాలు పరిశీలించి, ముఖ్యంగా వెనుకబడిన వారితో సన్నిహితత్వం సంపాదించి, వారిని ముందుకు తీసుకొని వెళ్లే ప్రయోజనకరమైన సాహిత్యం సృష్టించాలి.' అన్నారు ఆయన. సుప్రసిద్ధ నవలాకారుడు శ్రీ దాశరథీ రంగాచార్యులు తమ అధ్యక్షోపన్యాసంలో రచయితలు దైనందిన రాజకీయాలకు దూరంగా ఉండాలన్నారు. శ్రీమతి పరిమళా సోమేశ్వర్, స్త్రీల కన్నీరు తుడిచివేయడం రచయితల కర్తవ్య మన్నారు. శ్రీ శ్రీనివాస చక్రవర్తి, శ్రీ యేటుకూరి ప్రసాద్ రచయితలలో సంఘటిత శక్తి అవసరమన్నారు. 'అలజడి' అనే కావ్యం ఆవిష్కరించబడింది.

ఉపశ్రుతి

'అంచు లేని సీరె గెట్లుంటది?' అడిగాడు ఎదిరె శాయన్న. తలమీద దారవు ఉండల మూట మోసుకొని నడుస్తూ. 'ఎందుకంట?' అని ఎదురు ప్రశ్న వేశాను. 'సెప్పకపోతివి?' అన్నాడు. 'చినిగిపోదూ?' అన్నాను. 'గట్లనే, సడక్ కూడ. ప్లాట్ ఫారం లేకుంటే, ఖరాబవుతది.' అన్నాడు.



మీరు గమనించారా
'టెరీన్' బట్టలు
ఎప్పుడూ ఎంత క్రొత్తగా
కనిపిస్తాయో?

అనామధేయుడి ఆత్మకథ

సీరియస్నల్ హాస్యరచన — ఆర్వీయ

14


అదేమి ప్రారబ్ధమోగాని మేము నాటకం వేస్తున్న రోజే మావూరిలో కొత్తగా కట్టిన సినిమాహాల్లోకి సరికొత్తగా రిలీజ్ అయిన 'పండగ బండొడు' రంగుల చిత్రం వచ్చింది. నాకు పెద్ద విషమాతివిషమ సమస్య వచ్చిపడింది. కొత్తగా రిలీజయిన సినిమాని మొట్టమొదటి రోజు ఫస్టుషోలో చూడడమా? లేకపోతే సినిమాప్రోగ్రాం విరమించి ఆనాటి నాటకంలో యథోచిత పాత్రని వహించడమా? ఏదీ తెగక మా ఆవిడని సలహా అడిగేను. ఎంచేతంటే— 'కరణేషు మంత్రి' కదండి!

'లక్షణంగా కొత్త సినిమాకి వెళ్లక 'పాడిందే పాడరా—ఆడిందే ఆడరా' అని ఆ పాతనాటకాన్ని పట్టుకుని ఇంకా వేలాడ్డం ఏమిటి? నాటకం ఇవాళ కాకపోతే మర్నాడు వేసుకోవచ్చు. లేకపోతే మానెయ్యొచ్చు. ఏం నాటకాలు! పుణ్యమా? పురుషార్థమా? ఇప్పటికి ఏ లక్షసార్లో ఆడివుంటాడు. ఎంతసేపూ అదేకదూ? 'బావా ఎప్పుడు వచ్చితివు?' అని ఒకడు 'ఎక్కడినుండి రాక?' అని ఇంకొకడు, 'వచ్చినవాడు ఫల్గునుడు' అని ఒకడూ, 'జెండాపై కపిరాజు' అంటూ ఇంకొకడు. సినిమాకే వెళ్లండి. భక్తి, రక్తి, ముక్తి, మీరెళ్తే నేను కూడా...'

మా మహోజ్వలనాటకాన్ని ఆవిడ ఈ విధంగా ఈసడించడం చూసి నేను స్తబ్ధ... భరించలేకపోయేను. నేను ఏమైనా భరిస్తాను, 'కళ'ని—అందులోనూ 'నాటకకళ'ని —మరీ అందులోనూ నేను వేస్తున్న నాటకాన్ని నిరసించడం 'కళాద్రోహం.' అది 'స్వామి ద్రోహం' కిందికి వస్తుందంటాధా, రాదంటాధా? ఈ నిందించడాన్ని మాత్రం నేను భరించలేక పోయేనని మీకు ఉద్ఘాటన పూర్వకంగా తెలియజేస్తున్నాను. 'ఆరు నూరైనా, నూరు ఆరైనా నేను సినిమాకి వెళ్లనే వెళ్లను. నాటకమే మన పాలిటి గమ్యస్థానం' అని నిశ్చయించుకున్న వాడినై ఆవిడకి నా దృఢనిశ్చయాన్ని ఖచ్చితంగా, కరతలామలకంగా తెలియజేశాను.

ఆవిడ కూడా తన ఉద్దేశాన్ని అతి ఖండితంగా, అరటిపండొలిచి చేతిలో పెట్టినట్లు చెప్పింది: 'ఏ మి టే మి టి?' అంటారా? 'మీ దారి మీది. నా దారి నాది!' అంది. అంటే సరేమిటి? నేను నాటకానికి...ఆవిడ సినిమాకి...! దాని మీద నాకు యింకా చాలా చాలా బోల్డు కోపం వచ్చేసింది.

'విశృంఖలాభాసనటనాధురీణ' —'అసామాన్యగార్దభగాన విద్యావిలాసభాస'—'అసంబద్ధ శుద్ధ ప్రలాప కళాచతురానన'—'నాటకరంగస్థల అఖండోద్దండపిండ పండశాసనదోర్దండ'— వగైరా వగైరా బిరుదులు రాక అనామధేయుడిగా వున్నప్పటికీ, తనకి సాక్షాత్తూ ప్రాణనాథుడనైన నేను పాత్ర ధరిస్తూన్న నాటకాన్ని పైసా డబ్బు ఖర్చులేకుండా (చందా మూలంగా నాటకానికి డబ్బు ఇచ్చేననుకోండి; అది



లేరే సంగతి. టికెట్లు కొనక్కర్లేదు కదా!) చూడడం మానుకొని, నేను లేని— నేను రాని—సినిమాని చేతి తైలం వదుల్చుకొని చూడడమా? ఎంత అపచారం!—అని చెప్పలేకేం, నేను చాలా కించపడ్డమాట నిజం!

దంపతుల సంబంధం విడదియ్యరానిది. హైందవ సాంప్రదాయం ప్రకారం—అర్ధాంగి, సహధర్మచారిణి, ప్రాణేశ్వరి—అయిన భార్య భర్తని అనుసరించడమే భావ్యం. కాని, ఈ కాలంలో ఆమాట గట్టిగా పైకి అనగూడదు. అన్నామా—ఇనుపరాతియుగంలోని ఆదిమ జాతుల వాళ్ళల్లో జమ అయిపోతాం. ఈ సంగతి నాలుగుగోడల మధ్యా అంటే నలుగురికీ తెలియదు కదా అని మా ఆవిడకి రహస్యంగా ధర్మోపదేశం చేశాను. 'అనికైన వనికైన వెనుక జనక, పతిని విడిచిన భారత సతులు గలరె?' అన్నాను. మా ఆవిడ అసాధ్యురాలండోయ్! వెనక చెప్పే ననుకుంటాను. మా ఆవిడకి చదువు మున్నా అయినా, సంస్కృతి మిన్న అని!

'అనికైనా, వనికైనా పతివెనుక నడవాలె నన్నారు. కాని ఈ సూత్రం నాటకానికి వర్తించదు సార్!' అంది.

'అన్నా, ఎంత పొరబాటు చేశాను!' అనుకొని నాలిక కరుచుకున్నాను. లాభం ఏమిటి? గతజలసేతుబంధనం. చేతులు కాలింతర్వాత ఆకులు పట్టుకోవడం. అసలు మొదట్లోనే పప్పులో కాలేశాను. కొటేషను ఉదాహరించడంలోనే పెద్ద పొరపాటు అయిపోయింది. కొటేషను ఇలా చెప్పాల్సింది:

'నాటకముకైనను సినిమ ఆటకైన
వనిత! అనికైన వనికైన వెనుక జనక
పతిని విడిచిన భారత సతులు గలరె?'

మించిపోయింది. కిమ్మన్నాస్తిగా వూరుకోక తప్పిందిగాదు.

సాధారణంగా ఇలాంటి సన్నివేశంలో ఏ నారదుడో విశ్వామిత్రుడో ప్రత్యక్షం అయి, ఇరుపక్షాలవారికీ బుద్ధిచెప్పి కథ నడిపిస్తాడు. అదృష్టం బాగుంటే వాణీ సహితుడై వాణీపతో, ఇందిరా ద్వితీయుడై ఇందిరా మానసాగ్రేసరచోరుడో, లేకపోతే రుద్రాణీ పురస్సరుడై లయకాలరుద్రుడో సాక్షాత్కరించి, సన్నివేశాన్ని స్తంభించకుండా సాగజేస్తాడు. ఇది కలికాలం—వాళ్ళవతరించడం సాధ్యం కాదు. కాని, ఇప్పుడు దేవుడు ప్రత్యక్షమైతేనే తప్ప మరి ముందుకథ నడవదు. అలాంటప్పుడు దేవుడు సాక్షాత్కరించక తప్పుతుందా? దిగేడు...దేవుడు కాకపోయినా, దేవుడిలాగ మా తాత ఇంతలో దిగేడు.

మా తాత అంటే—మా అసలు తాతకి వరసకి తమ్ముడు. పెద్దల్లో పెద్ద. చిన్నల్లో చిన్న. మంచి కలుపుగోరుమనిషి. అతడు ఏతన్మాత్రుడు గాడు. 'అతడనేక రంగముల నారియు తేరిన ఆకతాయి!' నాటకాలాడి, ఆడించి, సినిమాలు చూసి, వేషాలువేసి, వేయించినవాడు. పట్టపగలు అత్తరు పన్నీరు దీపాలు వెలిగించి, అర్ధరాత్రి గొడుగుపట్టమని, మిట్టమధ్యాహ్నం దివిటీ పట్టమని—పాతికనేలరూపాయల అప్పు హారతి కర్పూరంలా హరించి, ఆ హారతిని కళ్ళకద్దుకొని 'పునీతుడనైనా' ననుకొన్న రసైకజీవి! ఇట్టి రసవద్ఘట్టంలో అట్టి రసైకజీవి సాక్షాత్కరించడం—'శుభోదర్కం' అని నా అంతరాత్మ ఘోషించింది.

'ఏమిట్రా మీ గోల?' అంటూనే లోపలికి ప్రవేశించాడు. తండ్రిదగ్గర పిర్యాదు చేసే పిల్లకాయల్లా, గురువుగారి వద్ద మొరపెట్టే విద్యార్థుల్లా, జడ్జిగారి దగ్గర కంప్లెయింట్ చేసే వాది ప్రతివాదుల్లా—మా వాదనల్ని, సహేతుకంగా, సవిమర్శంగా, సమంజసంగా, సాకారణంగా, సమర్థంగా నొక్కి చెప్పుకొన్నాము. సానుభూతితో పరిష్కరించమని ప్రాధేయపడ్డాము.

అంతా సావకాశంగా విన్నాడు. నావేపు చూస్తూ 'ఆంధ్రనాటక పితామహులెవరు? వారిని గూర్చి సంగ్రహముగా వివరించుడి?' అన్నాడు.

'ధర్మవరం కృష్ణమాచార్యులవారు. వీరు సుప్రసిద్ధ గ్రంథకర్తలేగాక, ప్రఖ్యాత నట శిఖామణులు. రాజరాజు, నలుడు పాత్రల పోషణలో సిద్ధహస్తులు.' అన్నాను.

'నాటకములలో నటించి రాజకీయ రంగమున ధ్రువతారలవలె వెలిగిన నలుగురు మహనీయులను పేర్కొనుము.'

'దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు గారు, దేశభక్త కొండా వెంకటప్పయ్య గారు, ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశంగారూ!' అన్నాను నేను గుక్క యినా తిప్పుకోకుండా.

ఇక మా తాత మా ఆవిడవేపు తిరిగేడు. 'సినిమా పితామహు లెవరన్నా?' అన్నాడు.

'ఫాల్కే మహాశయుడు.

తాత కాసేపు ఆలోచనలో పడ్డాడు.

'రాష్ట్రపతి రజతపతకం పొందిన మొట్టమొదటి తెలుగు చిత్రమేది?'

'పెద్దమనుషులు' అంది మా ఆవిడ.

పరీక్షలయిపోయేయి. అప్పుడు మా తాత అన్నాడు: 'నేను మీ యిద్దరినీ ఎందుకు పరీక్షించేనంటే—ఎవరికి ఎందులో ఎంత జ్ఞానం పరిపూర్ణంగా వుందో పరీక్షించి, తారతమ్య పరిశీలనచేసి, ఎక్కువ మార్కులు వచ్చినవారి మాట—తక్కువ మార్కులు వచ్చినవారు వినాలి అని తీర్మానిద్దామనుకున్నాను. కాని ఒకరు నాటకరంగంలో పండితులు. మరొకరు సినిమారంగంలో విద్వాంసులు. సరిసమాన పోటీ. అందుచేత ఒకరి మాటకి మరొకరు విలువివ్వవలసిన అవసరం ఏమాత్రం లేదనే నా నిశ్చితాభిప్రాయం. కనక, ఎవరిదారిన వారు పొండి!'

కథ మళ్ళా మొదటికే వచ్చిందనుకున్నాను. 'జడ్జి' నిష్పక్షికంగా ఇచ్చిన తీర్మానాన్ని ఎదిరించడానికి వీలులేదు. అది కోర్టు ధిక్కారనేరం కిందికి వస్తుంది. 'సరే కర్మ' అనుకొని మా తాతని అడిగేను: 'నువ్వు నాతో నాటకానికి వస్తావా ఆవిడతో సినిమాకి వెళ్తావా?' అని.

మారుమాటాడకుండా మా తాత తన జేబులోంచి ఒక కరపత్రం తీసి నా చేతికి యిచ్చేడు. అది...

* * *

పాండవోద్యోగనాటకము

అపూర్వ నటీనట సమ్మేళనం!

ఆలసించిన ఆశాభంగం!

మంచి తరుణం మించిన దొరకదు!

కృష్ణుడు : 'గానఘంటాకర్ణ భూషిత' 'అభినవ కృష్ణ'—శ్రీ శాండిల్య.

ధర్మరాజు : 'అజాత నటశిఖాయమాన' 'కలియుగ ధర్మరాజు' శ్రీ విశ్వామిత్ర.

భీముడు : 'ప్రతిపక్షపక్షీంద్ర గండ భేరుండ' 'అర్వాచీన భీమ'—శ్రీ శౌనక్.

అర్జునుడు : 'గానగర్వాంధకారశూర' 'నవ్యార్జున'—శ్రీ భరద్వాజ.

దుర్యోధనుడు : 'నాటకరంగలోక భీకర' 'నవీన దుర్యోధన'—శ్రీ ఆత్రేయ.

భీష్ముడు : 'ప్రేక్షకరంగ బీభత్స' 'కలికాలభీష్మ'—శ్రీ ఆర్వీయ.

ద్రోణుడు : 'రంగస్థల కోలాహల' 'నవ్య ద్రోణ'—శ్రీ జాబాలి.

కర్ణుడు : 'నాటక బూటకకళావిశారద' 'అప్రాచీన కర్ణ'—శ్రీ మార్కండేయ.

అశ్వద్ధామ : 'రంగప్రదేశ కుప్పిగెంతుల' 'నవాశ్వద్ధామ'—శ్రీ వసిష్ఠ.

ద్రౌపది : 'రంగస్థల దీపస్తంభ' 'కలియుగ ద్రౌపది'—శ్రీమతి అనూరాధ.

...మిగిలిన నటులు జగమెరిగిన జంధ్యము లేని బ్రాహ్మణులే! రెండు... రెండు...ఆనందాబ్ధినోలలాడుడు!

నాటకము వేయు స్థలము : అక్కడే.

తారీఖు : అందరికీ తెలిసినదే. రేట్లు : మామూలే.

—'ఇది మా నాటకప్రకటనే!' అన్నాను నేను.

'అదే నా కర్మం కాకుండా వుందిరా అబ్బాయ్' అన్నాడు తాత.

అనామధేయుండి...

'ఏమిటర్థం కాలేదు ?'

'ఇది మీ నాటకమే అయితే ఇందులో మీపేర్లు లేవే ?'

'ఛంపేశావు. ఈ పేర్లన్నీ మావే !'

'ఇవి మీ పేర్లేనా ? మరి నీపేరిందులో లేదే ?'

'లేకపోకడమేం ? లక్షణంగా వుంది'

'ఎక్కడ ?'

'భీష్ముడికి ఎదురుగా వున్న పేరు చూడు.'

'ఔను. 'ఆర్వీయ' అని వుంది.'

'అదే నా పేరు.'

'ఏమిటీ ? ఆర్వీయా ? నీ పేరు లక్షింపతి కాదురా ? నాకు మతిపోయిందా, నీకు మతిపోయిందా ?'

'ఎవరిదీ పోలేదు. అందరివి భద్రంగానే వున్నాయి. నాపేరు లక్షింపతేగాని, ఆ పేరుతో నాటకం వేస్తే విలువ లేదని పేరు మార్చుకున్నాను.'

'పేరు మారిస్తే విలువ పెరుగుతుందీః మరీ చోద్యంగా చెబుతున్నావు. పెద్దవాళ్ళు లక్షణంగా పెట్టిన పేరు మార్చుకోవడం ఏమిటిరా, నాయనా ?'

'అదికాదు తాతా ! నీకేం తెలీదు. ఈ కాలంలో అసలుపేరుకి విలువలేదు. నగిషీ పేరుకే విలువ. ఈ పేర్లకి—కలం పేరు, వెండితెరపేరు, రంగస్థల నామధేయం—రూపాంతరాలు. నాటకంబట్టి నటునికి, సినిమాబట్టి సినిమా తారలకి, గ్రంథాలను బట్టి గ్రంథకర్తలకి పేరు వచ్చే రోజులు పోయేయి. 'పేరు'నిబట్టి పేరు వస్తుందిప్పుడు...'

'భేష్...భేష్...చాలా బాగుంది !'

'నా పేరేనా ?'

'అన్ని విషయాలున్నూ. ఇంతకీ ఈ పేరు నీకు ఎలా తట్టింది ?' అన్నాడు మా తాత.

'నా పేరు 'ఆర్. వీ. లక్షింపతి' కదూ ? కొందరు 'ఆర్. వీ. యల్. పతి' అని కూడా అంటూండేవారు. క్రమస్య ఆ 'ఆర్. వీ. యల్'లో వున్న 'ల్'ని నీటుగా కత్తిరించేను. 'ఆర్' 'వీ'ని మిన్నితంగా అతికేను. దాంతో సాన పట్టిన వజ్రంలా 'ఆర్వీయ' తయారయింది.'

'మిగిలినవాళ్ళు కూడా ఇలాగ మారు పేర్లు పెట్టుకున్నవాళ్ళే !'

'అందుకు సందేహమా ? కృష్ణుడు వేస్తున్నవాడి అసలుపేరు సత్తిరాజు. ఇప్పుడు పెట్టుకున్న నిసలుపేరు : 'శాండిల్య'. సత్తిరాజు సత్తిరాజు పేరుతో 'కృష్ణుడు' వేస్తే—'ఏడా ? సత్తిరాజు గాడా ? సత్తివెధవ, ఏడిసినట్టేవుంటుంది నాటకం !' అనేస్తారు ప్రజలు. అంచేత అందరమూ యిలాగే పేర్లు మార్చుకున్నాము. ఈ పేర్లు మార్చుకోక ముందైతే 'ఈ బురదకంపెనీ నాటకం చూసేదేమిటిరా ?' అని చాలామంది అన్నారు. అంచేత అమాంతంగా రంగు ఫిరాయించేం. తెలిసినవాళ్ళు మా నాటకం పొలిమేరలికి రాకపోయినా, తెలీనివాళ్ళు అయినా తండోపతండాలుగా వస్తారేమోనని మా బాధ !' అన్నాను.

'నన్ను రక్షించేవు. నేనూ అలాగే అనుకున్నాను—ఇదేదో క్రొత్త కంపెనీ కామోసు, మళ్ళా ఇన్నాళ్ళకి కళ్ళ కరువు దీరా, చెవుల తుప్పు వదిలిపోయేటట్టు చక్కని నాటకం చూడొచ్చు—అనుకొని ఇంటిదగ్గర బోలెడంతపని వదులుకొని ఏకాయెకీ బయలుదేరి వచ్చేను. ఇదా సంగతి ? చూడు బాబూ, మావూరి బస్సెప్పుడు ?'

'అదేమిటి ?— నాటకం చూడకుండానే !?'

'నీ మాటల్తో నా కడుపు నిండిపోయింది. మరి చూడలేనురా, నాయనా !'

'చంపావే. నేరకపోయి, బుద్ధి గడ్డితిని ఈ పరమరహస్యాన్ని నీ చెవిలో వేశాను. అదింత కొంప ముంచుతుంది అనుకోలేదు. అయినా పొరపాటేదో అయింది. నీకు చెప్పకూడని పని. నన్ను క్షమించి ఈ నాటకానికి మాత్రం నువ్వు రావాలి !'

'లేదురా' బాబూ ! మరోలా అనుకోకురా అబ్బి. ఇంటిదగ్గర అర్జెంటు పనుంది. పొలానికి గట్టు వేయించాలి. మీ అవ్వకి ఒంట్లో బాగులేదు. జమాబందికి

దొరలు వచ్చే రోజులు. నేను వూళ్లో లేకపోతే క్షణంవేగదు.'

'సరేలే. ఇష్టం లేకపోతే బోలెడన్ని కాంట్రాక్టులు దొరుకుతాయి.'

'మనస్సులో ఏమీ పెట్టుకోకు. మరో నాటకానికి వస్తాలే. అప్పుడు కబురు చెయ్యి. నేను కొంచెం బజారుపని చూసుకొని—అలా బస్సెక్కి వెళ్లిపోతాను. నా కోసం కనిపెట్టుకుని వుండకండి. వస్తానమ్మా.'

'భోజనం ?'

'ఇంటికెళ్లి చేస్తాలే !' అని చెప్పేసి వెళ్లిపోయేడు.

నేను దిగాలుమని వుండిపోయేను. నిస్పృహా, నిరుత్సాహం నన్ను ఆవరించేయి. 'ఇంతకీ తాత తప్పేమిటి? ఇంట గెల్చి రచ్చ గెలవాలి. ఇంటావిడే నాటకానికి రానని మురిపిస్తుంటే, బైటి తాత సంగతి చెప్పేదేముంది !' అలా నాలో నేనే కుమిలిపోతూ ఎంతసేపున్నానో తెలీదు. అలా నిరుత్సాహపడితే ముందు కథ ఎలా ?' అన్న మా ఆవిడ మాటలో మళ్లీ ఈ లోకంలో పడ్డాను.

'ఇనివాళ మరి నాటకం వెయ్యలేను. ఉత్సాహం చచ్చిపోయింది' అన్నాను.


'సరి సరి. ఈమాత్రం దానికే అధైర్య పడితే నాటకాలెలా వేస్తారు? కొందరు దూషిస్తారు. మరి కొందరు భూషిస్తారు. దూషణ భూషణలు శరీరానికేగాని, 'కళ'కి అంటవు. అలా బెంబేలు పడితే ఎలా ?' అని మా ఆవిడ ధైర్యం చెప్పింది. దాంతో కొండంత ధైర్యం వచ్చింది.

ఇన్ని కబుర్లూ చెప్పి ఆవిడ సినిమాకే వెళ్లిపోతానంది. నేను చేసేదేమీలేక షికారుకి వెళ్లి, అక్కడినించి తిన్నగా నాటకానికి వెళ్లిపోయేను.

మా నాటకం సంగతి ఇక మీకు చెప్పేదేముంది ? ఈ పాటికి మా నాటకాల సంగతి నాకంటే మీకే బాగా అవగాహన అయిపోయి వుంటుంది. ఏదో—నాటకం అయింది !

(ఇంకా వుంది)

నేడు ఫ్యాషన్ ప్రపంచాన్ని ఏలుతున్నాయి మఫత్‌లాల్ వారి పాలియెస్టర్ మిశ్రిత బట్టలు!



ఆలోచించవలసిన విషమ ఘడియ

1956 నవంబర్ 1 ఆంధ్రుల రాజకీయ చరిత్రలో అతి విషాద ప్రకరణానికి ప్రారంభ దినం. అవిభక్త మద్రాసు రాష్ట్రం నుంచి విడిపోయిన పదకొండు జిల్లాల తెలుగుమాట్లాడే ప్రజలు 1953 అక్టోబరు 1 న స్వరాష్ట్రం సంపాదించుకున్న కొద్ది నెలలలో 'పరాయి రాష్ట్రం'లో తిరిగి బ్రతకవలసి వచ్చింది.

రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ ద్వారా 'ఒక భాషకు ఒక రాష్ట్రం' అనే సూత్రం అమలులోకి వచ్చి ఆంధ్రప్రదేశ్ అనే కృత్రిమ రాష్ట్రం ఏర్పడింది. తెలుగువారు గల తొమ్మిది జిల్లాలు, మహారాష్ట్రులు



కాసు బ్రహ్మానందరెడ్డి

గల ఐదు జిల్లాలు, కన్నడిగులు గల రెండు జిల్లాలు మొత్తం పదహారు జిల్లాల హైదరాబాద్ రాష్ట్రము విభజింపబడింది. మహారాష్ట్ర కన్నడ ప్రాంతాలు బొంబాయి, మైసూర్‌లతో చడీ చప్పుడు లేకుండా కలసిపోయాయి. తెలంగాణా ప్రాంతము ఆంధ్ర రాష్ట్రంలో కలవడానికి తెలంగాణా నాయకులు ఏ మాత్రమూ ఇష్టపడలేదు, అంటారు. ఆంధ్ర ప్రాంతానికి చెందిన నాయకులుమటుకు విశాలాంధ్ర విశాలాంధ్ర అంటూ పలవరించి పోయారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. ఆంధ్రునికి లాభం కలగలేదు. తెలంగాణా ప్రాంతీయుడికీ తృప్తి కలగలేదు.

దిక్కు లేదు

స్వరాష్ట్రంలోనే ఆంధ్రుడు పరాయివాడయి పోయాడు. తన రాజధానిలోనే ఆంధ్రుడికి దిక్కులేదు. 1956 నవంబర్ 1 నుంచీ ఇరవయి జిల్లాల ప్రజలకు అన్ని రంగాలలోనూ ఒకే నిబంధనలు వర్తించడానికి బదులు, తెలంగాణా ప్రాంతీయుల ప్రత్యేక హక్కుల కొరకు పెద్ద మనుషుల ఒప్పందము జరిగింది. ఆంధ్రులు కొరివితో తల గోక్కున్న సమయం ఇది.

ఇంతకంటె విచిత్రమయిన విషయం ముల్కీ నిబంధనలు. 1919 లో నిజాం తన రాష్ట్రంలో రాష్ట్రేతరులకి ఉద్యోగాలు ఇవ్వకూడదనే ఒక ఉత్తరువు జారీ చేశాడు. 'ముల్క్' అంటే దేశం. 'ముల్కీ' అంటే దేశస్థుడు. 1919 ప్రాంతములో నిజాం రాష్ట్రంలోకి ఉత్తర భారతదేశం నుంచి ప్రజలు ఉద్యోగాలకు వచ్చి స్థానికులతో పోటీ పడడం ప్రారంభించారు. స్థానికులు లేవదీసిన ఆందోళనవలన నిజాం నాన్–ముల్కీలకు ఉద్యోగాలు లేకుండా చేశాడు. 1948 లో హైదరాబాద్ భారత యూనియన్‌లో విలీనం అయిన వెంటనే ముల్కీ నిబంధనల విలువ తగ్గవలసింది. కాని 1956 లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన పిదప ఈ ముల్కీ నిబంధనల విలువ కాపాడబడడము విచారించ వలసిన విషయం. ఒక రోజున నిజాం రాష్ట్రంలోని ప్రజల ఉద్యోగాల పరిరక్షణకి ఉపయోగపడిన ముల్కీ రూల్ ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణా ప్రాంతీయుల చేతిలో వజ్రాయుధం అయిపోయింది.

భారతదేశంలో ఏ రాష్ట్రంలోనూ ముల్కీరూల్‌వంటి రూల్స్ అమలులోలేవు. ఏ రాష్ట్రంలోనయినా ఆ రాష్ట్రంలోని ప్రజలందరికీ ఒకేవిధమయిన నిబంధనలు వర్తిస్తాయి. ఒక ప్రాంతములోనివారు ఇంకొక ప్రాంతములోని విద్యాసంస్థలలో చేరవచ్చు. ఒక ప్రాంతములోనివారు ఇంకొక ప్రాంతములో ఉద్యోగాలు చేసుకోవచ్చు.

కాని ఆంధ్రప్రదేశ్‌లో ముల్కీరూల్ పర్యవసానం రాష్ట్రరాజధానిలోనే ఆంధ్రులకి ప్రభుత్వ ఉద్యోగాలే కరువయిపోతాయి. రాష్ట్రరాజధానిలో ఆంధ్రులకి విద్యాసంస్థలలో ప్రవేశార్హత వుండదు. తెలంగాణా ప్రాంతీయులు ఆంధ్రప్రాంతములో చదవకూడదనిగాని, ఉద్యోగాలు చేయకూడదనిగాని నిబంధనలు లేవు.

తప్పులేదు

1956 లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన వెంటనే ముల్కీ రూల్‌ని మూసీలో ముంచవలసినదిపోగా పాలుపోసి పెంచారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆంధ్రుడిని అధోగతిలో పడవేశారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన పిదప అన్ని ప్రాంతీయులకి ఉద్యోగ విషయాలలో ఒకేవిధమయిన నిబంధనలు అమలులోకి రాక తెలంగాణా ప్రాంతీయులకు విస్తృతావకాశాలు కల్పించబడ్డాయి. ఇందులో తెలంగాణా ప్రాంతీయులది ఏమాత్రమూ తప్పు లేదు. తమ ప్రాంతీయుల భవిష్యత్ నికటి



పి. వి. నరసింహారావు

చేసుకున్న ఆంధ్రనాయకులదే తప్పు. మాకు విశాలాంధ్ర వద్దు, తెలంగాణా ప్రత్యేక రాష్ట్రంగా వుంటుందని కొండా వెంకట రంగారెడ్డి మొదలగు ప్రముఖ నాయకులు వాదించినా ఆంధ్రనాయకులు అర్థం లేకుండా తమకి ఏదో అన్యాయం జరిగిపోతుందని భావించారు.

అనేక వివాదాలకు లోనయి ముల్కీ నిబంధనలు ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పువలన కొత్త బలాన్ని సంతరించుకున్నాయి. దీనివలన ఆంధ్రులకు తమ రాజధానిలో ఉద్యోగ, విద్యావకాశాలు బొత్తిగా వుండవు. నాన్‌గెజిటెడ్ స్థాయినుంచి చీఫ్ సెక్రటరీ పదవి వరకు హైదరాబాద్‌లో ప్రభుత్వ ఉద్యోగాలలో పదివేల ఆంధ్రులవరకూ వున్నట్లు అంచనా. ఇక వీరందరూ తిరుగు ప్రయాణానికి మూటా ముల్లె సర్దుకోవాలి.

[64వ పేజీ చూడండి]

కాలచక్రం

చిట్టూరు కాశీనాథ్



చిన్నపిల్లలతో కలిసిపోయి కేకలు వేస్తున్నాడు గంగయ్యతాత. అప్పుడే ఆట బెల్లయింది. ఘొల్లుమంటూ అరుస్తూ ఉప్పెన తండులా ఊడిపడ్డారు పిల్లలు. డబ్బులున్నవారు మసాలా, ఐస్‌క్రీం, పకోడీలను కొనుక్కు తింటున్నారు. డబ్బులు లేనివారు తినేవాళ్ళ వంకా, అమ్మేవాళ్ళవంక ఆశగా నోరూరించుకొంటూ చూస్తూ నిలబడ్డారు.

గంగయ్యతాత ప్రతిదినము స్కూలు విడుట మసాలాబుంగతో హాజరుగా ఉంటాడు. ఇతరచోట్ల అమ్మడానికి ఇతని కెందుకో మనసొప్పదు. విద్యార్థులుకూడా గంగయ్యతాతపై పంచప్రాణాలిడుస్తారు. అతనిదగ్గరే కొంటారు. పాపం వారినే నమ్ముకున్న గంగయ్యతాతకు స్కూలుకు సెలవున్నరోజున పిచ్చిపట్టినట్లుంటుంది. అది వ్యాపారదృష్టికాదు కాని అదో తెలియని సానుభూతి, అనుబంధం.

డబ్బులున్న పిల్లలంతా కొని ఆనందాన్ని జుర్రుతున్నారు. గోపికలతో కృష్ణుడు లీలను జరిపి ఆనందాబ్ధిలో మునిగినట్లు తాతకూడా ఆ విద్యార్థుల బాలలీలనుచూసి మురిసిపోతున్నాడు. అతని దృష్టి అప్రయత్నంగా గేటుదగ్గర ఆగిపోయింది.

తనదగ్గర ప్రతిదినమూ కొనుక్కుతినే ఒక బుడుతడు క్రింద కూర్చుని మోకాళ్ళ మీద తలపెట్టి అమాయకంగా చూస్తున్నాడు. గంగయ్యతాతకు ఎందుకో తన మనవడైన రాముడు గుర్తుకొచ్చాడు.

పాపం తినాలని ఆశ ఉన్నా డబ్బులు మాత్రం లేవేమో! చేత్తో పిలిచాడు తాత.

పిల్లవాడు అమాయకంగా చూశాడు.

'ఇటు రా బాబూ' తాత మళ్ళీ పిలిచాడు. దోషివలె మెల్లిగా నడచి వచ్చాడా కుర్రవాడు. 'ఏం బాబూ అలా కూర్చున్నావేం? ఈరోజు మసాలా కొనలేదేం?' బుజ్జగించుతు అడిగాడు తాత.

తాత కళ్ళల్లోకి చూశాడా కుర్రాడు దీనంగా. 'మరే డబ్బులేదుగా' అన్నాడు.

'అమ్మను అడగలేదా బాబూ?' మెల్లిగా ఓదార్చుతూ అడిగాడు తాత.

'అడిగాను. కాని మరే లేదంది' అన్నాడు.

తాతకు కుర్రవాడి భుజంమీద కుట్లు కన్పించింది. పరీక్షగా చూస్తే రెండు మూడు కుట్లు కన్పించాయి. నేర్పుగా కుట్టారు. బహుశా 'గుట్టుగా బతికే తనలాంటి పేద కుటుంబ మన్నమాట' తాత మనస్సు చల్లని నవనీతంలా కరిగిపోయింది.


ఆ చక్కని,
పరిశుభ్రమైన తెల్లదనానికి
ఓ ఓ బి
నీలి
OOB
BLUE
BEST ULTRAMARINE
MADE IN INDIA BY
ULTRAMARINE & PIGMENTS LTD.
AMBATTUR MADRAS-53
ఓ.ఓ.బి నీలి నీటిలో అతి సులభంగా, పూర్తిగా కరుగుతుంది. తెల్లటి దుస్తులకి సమమైన మంచులాంటి తెల్లదనాన్నిస్తుంది. మీ చొక్కాలకు, చీరలకు, దుప్పట్లకు మరియు ఇతర బట్టలకు అధికమైన తెల్లదనాన్నివ్వడానికి ఇదే అతి పొదుపైన పద్ధతి. నీలపు మరకలుండవు. పసుపు రంగుగా మారదు
ఓ.ఓ.బి నీలి భారతదేశంలోకెల్లా పెద్దదైన, ఆధునికమైన ఫ్యాక్టరీలో పశ్చిమ జర్మనీవారి సహకారంతో తయారుచేయబడుతున్నది.
తయారుచేయువారు:
అల్ట్రామెరైన్ పిగ్మెంట్స్ లిమిటెడ్ అంబత్తూరు, మద్రాసు-53
UPL/6346

'సరేలే బాబూ రేపిద్దువులే' అంటూ తాత పొట్లమును కట్టియిచ్చాడు. క్షుర వాడి కళ్ళలో కెంపులు మెరిశాయి. స్వర్గ మునే తిలకించినట్లైనాడు. అది అమాయ కంగా తెలిపే కృతజ్ఞతో ఆనందమో తాత కర్థం కాలేదుకాని ఒక రకమైన మధురానుభూతిని మాత్రం పొందగల్గాడు. లోపల బెల్లయింది. పిల్లలంతా తిన్న కాగి తాలనన్నీ పారవేసి మూతులు తుడుచుకొని లోపలికి పరిగెత్తారు. 'రేపిస్తాలే తాతా' అంటూ చిన్న తడబడుల అడుగులతో వెళ్ళాడా అబ్బాయి.

అయస్కాంత ఆకర్షణలాగా ఏదో ఆక ర్షణ లాగుతున్నట్లు అతడి వంకే చూస్తూ నిలబడ్డాడు తాత. తాత అక్కడే కూర్చు న్నాడు. ఎందుకంటే యింటిబెల్లుకు కూడా కొందరు కొనేవారుంటారు. డబ్బు లింటికి తీసుకుపోయే అంత నిగ్రహశక్తి పిల్లల కుండదని గంగయ్య తాత అనుభవం. యింటిబెల్లుకు కొందరు కొన్నారు. తాత దృష్టి ఆ కుర్రవాణ్ణి వెదికింది. చిరు నవ్వు నవ్వాడతను. తాత తెల్లని క్రొర మీసాలమధ్య వెలలేని ఆణిముత్యాల చిరు నవ్వు వెలిగింది. యిన్నాళ్ళకు గంగయ్య తాతకు బ్రహ్మానందం లభించినట్లయింది ఆ వేళ.

మర్నాటికి కావలసిన వస్తువులు కొను క్కొని బుజాన తగిలించుకున్న గంపలో వేసుకుని యింటి ముఖం పట్టాడు తాత. పట్టణం మున్సిపాలిటీ చూపుకందని కార్మిక

కాలచక్రం

వీధిలో కప్పుకూడా సరిగాలేని ఒక చిన్న యిల్లుఅది. ఏదో బంధువులెవరూ రాకున్నా, పల్కరించ కున్నా యింటి కప్పులోంచి వచ్చే టప్పుడూనూ పోయేటప్పుడూనూ తొంగి చూసి పల్కరించి పోతుంటారు భాస్కర, సుధాకరులు.

తాత బుంగదింపి, తడికకు వేసిన చిన్న తాళం తీస్తూ 'రాముడూ' అని పిలి చాడు ప్రక్కింటి వైపుచూస్తూ. సమా ధానం రాలేదూ.

'ఎక్కడకు పొయాడబ్బా' అంటూ యివతలకు వచ్చాడు. మనవడు లేనిదే అసలు యింట్లోకి వెళ్ళ బుద్ధికాదు తాతకి.

'లచ్చమ్మా' మళ్ళీ పిలిచాడు. లోపల పనిచేసుకుంటున్నది బయటకు వచ్చింది. 'ఏందన్నా' అంటూ. 'పిల్లడేడమ్మా?' అడిగాడు తాత.

'బడినుండి యిప్పుడే వచ్చినాడన్నా పేప చెట్టుకాడ ఆడుకోను పోయినాడేమో పిల్చు కొస్తానుండు' అంటూ చిరిగిన పయట కోకను సర్దుకొంటూ వెళ్ళింది లచ్చమ్మ.

తాత లచ్చమ్మవంక కృతజ్ఞత నిండిన కళ్ళతో చూస్తూ నిలబడ్డాడు. ఆమె తాతకేమీకాదు అయినా స్వంత చెల్లికంటె మిన్నగా ఆడ దిక్కులేని తాతకు సహాయం చేస్తున్నది. ఇంతేకాదు తన కొడుకు రంగ డితోబాటు రాముణ్ణికూడా అతిప్రేమతో సాకుతున్నది.

'తాతా' అంటూ పరుగెత్తుకొచ్చాడు రాముడు. లచ్చమ్మ తన కొడుకును కూడా వెంటబెట్టుకొచ్చింది.

'ఎక్కడకు పోయినావు నాయనా'అంటూ రాముడి భుజంమీదతట్టి, రంగడికి దోసెడు నిండా మరమరాలు పోశాడు తాత. మనవడు నడవలేడేమోనని ఎత్తుకొని యింట్లోకి వెళ్ళాడు. దీపం వెలిగించి రాముడి మొఖం చూశాడు. ప్రొద్దుట తాను వండు కున్న కూడు రాముడికింతపెట్టి, తాను తిన్నాడు.

'హే రామచంద్రా' అంటూ మేను వాల్చాడు తాత. పక్కనే జేరాడు రాముడు. 'రాముడూ' ప్రేమతో పిల్చాడు తాత.

'ఊఁ' రాముడు నాపమీద కూర్చుని అక్షరాలు వ్రాస్తున్నాడు.

'శుభ్రంగా వ్రాసుకుంటున్నావా?',

'ఆఅక్షరాలు వచ్చేశాయిగా. పుస్తకాలు కావాలి తాతా. పెన్నుకూడా.'

తాత రాముడి వీపు నిమిరాడు. 'తప్పు కుండా తెస్తారా. చదువు' అన్నాడు.

ప్రగుడ్డికాంతిలో తాత కళ్ళల్లో వజ్ర కాంతులవలె తారలు మెరవడం రాముడికి తెలియదు. ముద్రలుపడని అక్షరాలు వ్రాస్తున్న రాముడు ఆగాడు. 'తాతా' పిలిచాడు.

'ఏమిటి బాబూ!'


'మరే ఈవేళ నాకు పంతులమ్మ మాటలు నేర్పించింది'.

'ఏం మాటలురా బాబూ' తాత ఉత్సా హంగా అడిగాడు.

'మరే అమ్మా, నాన్నా, తాతయ్యా' అని. రాముడి పసిహృదయములో ఏదో సందేహం రేగుతున్నదని తాత గ్రహించాడు. మనస్సేదో శంకించింది. ఆత్మ ఏదో జ్ఞప్తి చేసింది. గుండెగతుక్కుమంది. నిబ్రదొక్కుకుని

'ఆఁ! నీకు వచ్చాయా?' అన్నాడు.

'అదికాదు తాతా. రంగడికి అమ్మా, నాన్నా ఉన్నారుగా. మరినాకు' పసి హృద యానికది స్పష్టం కాలేదు. హృదయం నకు వేసిన కళ్ళెం సడలింది. గట్టుదెగిన సముద్ర నీటి ప్రవాహములాగా వురికాయి కన్నీళ్ళు. హృదయంలో దాచుకున్న బడ బాగ్ని రగిలింది. అగ్ని భూకంపం బయ ల్దేరుతుంది. లావా వెదజల్లుతోంది. ఆ వేడిని భరించుకోలేకుండా సతవహొతు



న్నాడు. పైనా నిగ్రహంతో కళ్ళు తుడుచుకున్నాడు. తన కన్నీళ్లతో ఆశాజ్యోతి ఆరిపోకూడదు. అందుకని 'నీకులేరు బాబూ' అని బుజ్జగిస్తూ చెప్పాడు. రాముడికో సమాధానము సంపూర్ణ సంతృప్తి నీయులేదు. కాని 'మరి పంతులమ్మ అందరికీ ఉంటారని చెప్పిందే?' అన్నాడు. తాత మనసు భారమైంది. 'ఎవరో అదృష్టవంతులకుగాని అమ్మా, నాన్నలతో ఉండే అదృష్టం లభించదు బాబూ. నీ దురదృష్టం ఘనమైంధకారరూపంలో వచ్చింది' అన్నాడు. తాత ఏదో లోకంలో ఉన్నట్లు మాట్లాడుతున్నాడు. రాముడికి మాటలు అర్థంకాలేదు. సందేహం తీరలేదు. ఆలోచించాడు చివరకు 'తాత చెప్పినట్లు కొందరికి అమ్మా నాన్నా ఉండరేమో' అని సమాధాన పరచుకొని నిద్రపోయాడు. తాతమనసు రాయిపడిన తటాకంలా ఉంది. కొంతసేపటికి తేరుకొని, చూరుకుకట్టిన బట్టలమూట దింపాడు. ఆరోజు మిగిలిన డబ్బులు అందులో ఉన్న ముంతలో వేసి మళ్ళీ కట్టేశాడు. రాముడి పెద్దచదువులకి ఇప్పట్నుంచే జాగ్రత్త పడుతున్నాడు. దాచే విషయం ఆ పోరనుడికే తెలియనీయలేదు. మనవడి ముఖంవంక చూశాడు, నిద్రలో కూడా ఆలోచిస్తున్నట్లు కనబడ్డాడు. వాడి సందేహం తీరలేదు. మరి భయంకరమైన గతాన్ని చెప్పి బాధనెరుగని ఆ నిర్మలమైన వెన్నలాంటి హృదయంలో మచ్చలు పెట్టడం తాత కిష్టంలేక పోయింది. గంగయ్య తాత మళ్లీ మేను వాలుస్తూ భారంగా నిట్టూర్చాడు. తెల్లని చిరునవ్వుతో, తీరినవయసు తెచ్చిన వింపుతనంతో శాంతంగా కనబడే తాత, తన నుదుటి ముడుతలలో ఎన్నో లెక్కలేనన్ని బాధలను—అతి ఓర్పుతో యిముడ్చుకున్నాడు. రాముడు తన ఆశాజ్యోతి. పంచప్రాణాల్లో ఒకటి. వాడు అభివృద్ధికి వచ్చినతర్వాత 'వాణ్ణి—ఆ రఘునాధరావు గాణ్ణి.'

అప్రయత్నంగా తాత పిడికిలి బిగిసింది. పండ్లనుంచి ఎందుకో ప్రతీకారం అనే మాటలను 'పటపట' అను శబ్దాలతో మారు మోగిస్తూ జ్ఞప్తికి తెస్తున్నాయి. లోతుకుపోయిన కళ్ళల్లో దీపపు గుడ్డి కాంతితో కలిసి ఎర్ర జీర మెరసింది. మరు క్షణం కళ్ళు చెమ్మగిల్లాయి. మసక తెర

(38వ పేజీ చూడండి)



జరిగిన కథ

రామ్మూర్తికి ఇద్దరు కొడుకులూ, ఒక కుమార్తె. పెద్దవాడు ప్రసాద్ ఉద్యోగం చేస్తున్నాడు. రెండవ వాడు కొంచెం అల్లరిచిల్లరగా తిరుగుతుంటాడు. కుమార్తె లక్ష్మి పెళ్ళికి ఎదిగి వుంది. భార్య శాంతమ్మ రోగిష్ఠిది. కాంచన ప్రసాద్ ఆఫీసులోనే పని చేస్తున్నది. ప్రసాద్ కాంచనా ప్రేమలో పడ్డారు. అందుచేత తండ్రి తెచ్చిన సంబంధానికి ప్రసాద్ ఇష్టపడలేదు. ప్రసాద్, కాంచనలు మరింత దగ్గరయ్యారు, పెళ్ళి చేసేసుకున్నారు. ప్రసాద్‌కి పిల్లనివ్వాలనుకున్న సత్యనారాయణకిది చాలా బాధ కలిగింది. రామ్మూర్తిని అపార్థం చేసుకున్నాడు.

5

మర్నాడు ఉదయం రామ్మూర్తి కొట్టు దగ్గరకు వెళ్ళాడు, ప్రతిరోజూ ఉదయం యెనిమిదిన్నరకే కొట్టు తెరుస్తారు, కాని రామ్మూర్తి మాత్రం తొమ్మిది గంటలకు కొట్టుదగ్గరకు వెళ్ళడం అలవాటు. సాయంత్రంపూట కొట్టు మూసివేయడం యెంత ఆలస్యమైనప్పటికీ రామ్మూర్తి ఉంటాడు. కాబట్టి అతను ఉదయం పూట అరగంట ఆలస్యం చెయ్యడాన్ని సత్యనారాయణ యెప్పుడూ పట్టించుకోలేదు.

రామ్మూర్తి మామూలుగా తొమ్మిది గంటలకే కొట్టుదగ్గరకు వెళ్ళాడు. ప్రతిరోజూ ఉదయం తొమ్మిదిన్నరకుగాని, కొట్టువద్దకురాని సత్యనారాయణ ఆవేళ రామ్మూర్తి వెళ్ళేసరికే కొట్లో ఉన్నాడు.

రామ్మూర్తి కొట్లో అడుగు పెట్టగానే, 'టైము యెంత అయింది ?' అని అతన్ని ప్రశ్నించాడు సత్యనారాయణ.

ఎదురుగుండా గోడమీద పెద్దగడియారం ఉండగా, సత్యనారాయణ తనను యెందుకు ఆ విధంగా ప్రశ్నించాడో రామ్మూర్తికి బోధపడలేదు. అయినా అతను గడియారం చూసి 'తొమ్మిది అయిందండి' అన్నాడు.

'రోజూ యెన్నిగంటలకు కొట్టు తెరుస్తారో మీకు తెలుసా ?' అని కర్కశంగా ప్రశ్నించాడు సత్యనారాయణ.

'ఎనిమిదిన్నరకే తెరుస్తారు కాని' అని రామ్మూర్తి యేదో అనబోతున్నాడు. అంతలో—

'వేళకు కొట్టువద్దకు రాలేని వాళ్ళు యిక్కడ పనిచెయ్యవలసిన అవసరంలేదు' అన్నాడు సత్యనారాయణ ఖచ్చితంగా.

దానితో రామ్మూర్తిమీద పిడుగుపడినట్లు అయింది. అతను ప్రతిమాలుతున్నట్లుగా 'బాబూ' అన్నాడు.

'ఇక మీరు చెప్పవలసినది యేమీలేదు. మీకు యీరోజు వరకి రావలసిన డబ్బు యిదిగో' అంటూ సత్యనారాయణ అంతకు ముందే ఒక కవరులో ఉంచిన డబ్బు అలాగే రామ్మూర్తి చేతికి అందించాడు.

'నిజంగా తను ఆలస్యంగా కొట్టు వద్దకు రావడంవలన సత్యనారాయణగారు తనను పనిలోనుంచి తీసివేయడంలేదు' అనే సంగతి రామ్మూర్తికి తెలుసును. అంతే కాదు, తనను యేకారణంవలన సత్యనారాయణగారు పనిలోనుంచి తీసివేస్తున్నది కూడా అతనికి తెలుసును. ఆ విషయంలో తను నిస్సహాయుడు. అందుచేత తన ఆలస్యంగురించి సత్యనారాయణగారిని యెంత ప్రతిమాలినా ప్రయోజనంలేదు. కాబట్టి రామ్మూర్తి తరువాత యేమీ మాట్లాడకుండా ఆ కవరు తీసుకొన్నాడు.

'ఇక మీరు వెళ్ళవచ్చును' అన్నాడు సత్యనారాయణ కఠినంగా.

'మీ దయ' అని అంటూ రామ్మూర్తి బయటకు వచ్చివేశాడు. అతను బయటకు వస్తున్నప్పుడు, వెనుకనుండి 'కృతఘ్నుడు' అనేమాట వినిపించింది.

'అకస్మాత్తుగా యేదో పెనుగాలి వచ్చి తనను నడిసముద్రంలోనికి విసిరివేసినట్లు' అన్పించింది రామ్మూర్తికి. ఇకముందు తను యేం చెయ్యాలో రామ్మూర్తికి తెలియలేదు. సుమారు పాతిక సంవత్సరాల నుంచి తాను పనిచేస్తున్న కొట్టుకు, తనకు ఆవేళతో రుణం తీరిపోయింది.

'తనను సత్యనారాయణగారు పనిలో నుంచి తీసివేయడానికి తాను యెంతవరకు కారణం ? నిజంగానే తాను కృతఘ్నుడా?' అని ఆలోచించుకొంటూ రామ్మూర్తి యింటికి తిరిగి వచ్చాడు.

కొట్టు వద్దకు వెళ్ళిన రామ్మూర్తి వెంటనే తిరిగి వచ్చివెయ్యడం శాంతకు ఆశ్చర్యాన్ని కలిగించింది.

రామ్మూర్తిని చూడగానే యెదురుగా వచ్చిన శాంత 'అప్పుడే తిరిగి వచ్చేశారు.

ఒంట్లో బాగాలేదా ?' అని రామ్మూర్తిని ప్రశ్నించింది.

'బాగానే ఉంది' అన్నాడు రామ్మూర్తి ముభావంగా.

'ఏమండీ! అలాగ ఉన్నారు యేమిటి ?'

'సత్యనారాయణగారు నన్ను పనిలో నుంచి తీసివేశారు.'

'ఎందుకు తీసివేశారండీ ?' అని ఆత్రుతగా తిరిగి ప్రశ్నించింది శాంత.

'సత్యనారాయణగారు యీ సమయంలో యెందుచేత నన్ను పనిలోనుంచి తీసివేస్తారో ఆ మాత్రం తెలుసుకోలేవా శాంతా ?' అన్నాడు రామ్మూర్తి మందలింపు, విసుగు విచారాలతో కూడిన కంఠంతో.

'వాడు చేసిన పనికి మిమ్మల్ని పనిలో నుంచి తీసివేశారా ?'

'వాడే చేశాడో, మనమే చేయించామో యితరులకు యెలాగ తెలుస్తుంది? వాడు చేసినదానికి ఫలితం మనం అనుభవించక తప్పదు. ఈ పరిస్థితిలో సత్యనారాయణ గారు యిలాగ చెయ్యడమే మంచిది అని నాకు అనిపిస్తున్నది' అన్నాడు రామ్మూర్తి.

'ఏమిటండీ అది ?' అన్నట్లుగా శాంత రామ్మూర్తి ముఖంలోనికి చూసింది.

'ఈ సంబంధం తప్పిపోవడం సత్యనారాయణగారికి చాలా అవమానం. ఇంకా నేను అక్కడ పని చేసినట్లయితే, నన్ను చూసినప్పుడల్లా ఆయనకు యీ అవమానం జ్ఞాపకానికి వస్తుంది. ఆయన బాధ పడతాడు. 'నావల్ల వీరికి అవమానం కలిగింది కదా!' అని నేను కూడా బాధ పడవలసి ఉంటుంది. ఇరువురకూ ఆ బాధ లేకుండా ఆయన నన్ను పనిలోనుంచి తీసివేశారు. ఇదీ ఒక మేలే.'

'మీరేమో, శ్రమపడి వెళ్ళి, వాడికి ఉద్యోగం వచ్చే విధంగా చేశారు. వాడేమో, వాడి యిష్టం వచ్చినట్లుగా ప్రవర్తించి మీ పని పోయేలాగ చేశాడు.'

'జరిగిపోయిన దానిని గురించి యేమి అనుకొంటే మాత్రం ప్రయోజనం యేమిటి ఉంది ? ముందు జరగబోయేదానిని గురించి ఆలోచించాలి.'

'ముందు జరగవలసింది యేమిటండీ?'


'వెంటనే నేను యింకో పని వెతుక్కోవాలి.'

'ఇంకో పనా?'

'అవును శాంతా! లేకపోతే, కుటుంబం యెలాగ గడుస్తుంది ?'

దానికి శాంత యేమీ మాట్లాడలేదు. కొంచెంసేపు అయిన తరువాత ఆమె 'ఏమండీ! వీడు పెళ్ళి చేసుకున్న అమ్మాయి యెక్కడ ఉన్నదండీ?' అని అడిగింది.

'పెళ్లి చేసికొనకముందు యెక్కడ



ఉండి ఉంటుందా యిప్పుడు కూడా అక్కడే ఉండి ఉంటుంది. బహుశా వాళ్ళ పుట్టింటి దగ్గరనే ఉండవచ్చును.'

'అయితే నీదు ఈ మధ్యను రాత్రి పూట కూడా ఆఫీసులో పని ఉందని అంటూ వెళ్ళింది అక్కడకే అయి ఉంటుం దండి!'

'అంతే కావచ్చును. పెళ్ళి అయ్యాక కూడా ఆ అమ్మాయిని అక్కడే ఉంచడం యెందుకు ? ఇంటికి తీసికొని రమ్మంటే సరిపోతుంది.'

'అవును లెండి. పెళ్ళి అయ్యాక ఆ అమ్మాయిని చాలా రోజులు అక్కడే ఉంచి నట్లయితే నలుగురూ, నాలుగు విధాలుగా అనుకొంటారు. మనతో చెప్పకుండా పెళ్ళి చేసికొన్నంత మాత్రాన, వాళ్ళ మంచి చెడ్డలను గురించి మనం ఉపేక్షించగలమా? మన బాధ్యతను మనం నిర్వర్తించాలి.'

✦ ✦ ✦

'బావగారూ! నమస్కారం' అని అంటూ ఒక వ్యక్తి రామ్మూర్తి యింటిలోనికి వచ్చాడు.

రామ్మూర్తి అతన్ని యెప్పుడూ చూసి ఉండలేదు. అయినా 'పాటివ్యక్తి నమస్కారం చేస్తున్నాడు గదా' అనే ఉద్దేశంతో రామ్మూర్తి కూడా లేచి 'నమస్కారం' అన్నాడు.

'తోకచుక్కలా ఆకస్మికంగా వచ్చిన ఈ వ్యక్తి యెవరా? అని మీరు ఆలోచిస్తున్నారు, అవునా? నేను మీ కోడలు కాంచన పినతండ్రిని. నా పేరు పాపయ్య' అని తనను తానే పరిచయం చేసికొన్నాడు పాపయ్య.

'చాలా సంతోషం అలాగ కూర్చోండి' అని అంటూ రామ్మూర్తి పాపయ్యకు ఒక కుర్చీ చూపించాడు.

పాపయ్య కూర్చున్నాడు.

'శాంతా! ఒకసారి యిలాగ రా!' అని రామ్మూర్తి పిలవగానే శాంత అక్కడకు వచ్చింది.

'వీరు పాపయ్యగారు. మన అబ్బాయికి పినమామగారు' అని రామ్మూర్తి శాంతకు చెప్పాడు.

'నమస్కారమండి అన్నయ్యగారూ!' అని నమస్కారం చేసింది శాంత.

'నమస్కారం. అమ్మా, శాంతా! బావగారూ! మీకు నా గురించి తెలియక

అనగనగా...

పోవచ్చునుగాని మీ గురించి నేను చాలా తెల్సుకొన్నాను. ఎక్కడ అడిగినా, ఒకే మాట. ఎవరిని అడిగినా, ఒకేమాట. మీవంటి ఆదర్శదంపతులు యెక్కడో కోటి మందిలో ఒకరు ఉంటారు అని. నిజంగా మా కాంచన అదృష్టంవల్లనే మీ కోడలు అయింది.'

'దానికేముంది లెండి!' అని అంటూ రామ్మూర్తి పాపయ్య మాటలకు అడ్డు వచ్చాడు.

'లక్ష్మీ!' అని పిలుస్తూ శాంత లోపలకు వెళ్ళిపోబోయింది కాని అంతలో తమ యింటి గుమ్మంవద్ద ఒక సైకిలురిక్షా ఆగడంవలన ఆమె గుమ్మంవైపు చూస్తూ ఉండిపోయింది.

ప్రసాద్, కాంచన సైకిలురిక్షా దిగి లోనికి వచ్చారు. ప్రసాద్ యెవరినీ పలకరించకుండా తన గదిలోనికి వెళ్ళిపోయాడు. కాంచనకూడా ప్రసాద్ వెనుకనే గదిలోనికి వెళ్ళిపోయింది.

'అమ్మాయ్!' అని పాపయ్య వెంటనే పిలవడంవలన కాంచన తిరిగి బయటకు వచ్చింది.

'అమ్మా! శాంతా! నువ్వు అలాగ బావగారి పక్కను నిలబడు!' అన్నాడు పాపయ్య.

శాంతను రామ్మూర్తి పక్కను నిలబడమని పాపయ్య యెందుకు అన్నాడో, యెవరికీ అర్థం కాలేదు. అయినా పాపయ్య చెప్పినట్లుగానే శాంత వచ్చి రామ్మూర్తి పక్కను నిలబడింది.

'అమ్మాయ్! వీరు నీ మామగారు రామ్మూర్తిగారు. అత్తగారు శాంతమ్మ గారు. నమస్కారం చెయ్.'

'నమస్కారం' అన్నది కాంచన.

'అలాగకాదు పాదాలకు నమస్కారం చెయ్'

కాంచన అయిష్టంగానే వంగి, రామ్మూర్తికి, శాంతకు నమస్కారం చేసింది. వారు ఆమెను దీవించారు.

'సీతారాములవంటి అత్త మామలు దొరకడం నిజంగా నీ అదృష్టం' అని పాపయ్య యేదో అనబోతుండగానే కాంచన తిరిగి తమ గదిలోనికి వెళ్ళిపోయింది.

'మళ్ళా యిప్పుడే వస్తా' అని అంటూ ప్రసాద్ గదిలోనుంచి బయటకు వచ్చి యెక్కడకో వెళ్ళాడు.

తరువాత పాపయ్య శాంత యిచ్చిన కాఫీ తాగాడు.

'బావగారూ! పిల్లలు చిన్నతనంవలన తొందరపడి మీతో చెప్పకుండానే పెళ్ళి చేసేసుకొన్నారు. ఆ సంగతి తెలిసిన తరువాత నేను అమ్మాయిని చాలా కోప్పడ్డాను. జరిగినదానిని గురించి మీరు యేమీ బాధపడవద్దు'

'జరిగిపోయిన దానిని గురించి బాధ పడడం యెందుకు లెండి'

'మా వదిన రమణమ్మగారు కూడా యిప్పుడు యిక్కడకు వద్దామని అనుకొంది కాని ఒంట్లో బాగా లేనందువలన రాలేక పోయింది. రెండుమూడు రోజుల్లో యెప్పుడో వస్తుంది. అన్నట్లు నేను యిప్పుడు అర్జంటుగా లాయరువద్దకు వెళ్ళవలసి ఉంది' అని రామ్మూర్తితో చెప్పి పాపయ్య 'అమ్మాయ్' అని పిలుస్తూ కాంచన ఉన్న గదిలోనికి వెళ్ళాడు

'ఏమిటి బాబాయ్! ఇంట్లోకి రాగానే, 'నమస్కారాలు' అంటూ ప్రారంభించావు. నీ మాట కాదనలేక వాళ్ళకు నమస్కారం చెయ్యవలసి వచ్చింది' అన్నది కాంచన నిష్ఠూరంగా.

'పిచ్చి పిల్లా! ఇలాగ అయితే సంసారం యెలాగ దిద్దుకొంటావు ? తరువాత యెలాగ ఉన్నప్పటికీ ప్రారంభంలో మాత్రం అణకువగానే ఉండాలి. అసలు మీ ఆయనకు కూడా తెలియకుండా వాళ్ళు యేమైనా డబ్బు దాచారేమో? ఆ విషయం తెల్సుకోవడానికైనా, కొన్నాళ్ళపాటు వినయ విధేయలతో ఉండడం అవసరం' అన్నాడు పాపయ్య నెమ్మదిగా.

'ఏమిటో బాబాయ్! నీ యిష్టం.'

'అవతల పని ఉంది. నేను వెడుతున్నాను.'

'సరే, బాబాయ్! అప్పుడప్పుడు వస్తూ ఉండు.'

'ఆ విషయం నువ్వు నాకు నేడే చెప్పాలా ?' అని అంటూ పాపయ్య గది బయటకు వచ్చాడు.

'బావగారూ! సెలవు తీసికొంటాను'అని రామ్మూర్తితో చెప్పి పాపయ్య వెళ్ళి

పోయాడు.

* * *

సాయంత్రం యేడుగంటలు అయింది. రామ్మూర్తి నీరసంగా కుంటుకుంటూ యింటికి వచ్చాడు.

రామ్మూర్తిని వీధి గుమ్మంవద్ద చూడగానే 'నాన్నా! నీకు పనికుదిరిందా?' అని ప్రశ్నిస్తూ లక్ష్మి పరుగెత్తుకొని యెదురుగుండా వచ్చింది.

'ఏమిటి ఆ తొందర? అసలు మీ నాన్నగారిని యింట్లోకి రానియ్యి!' అని లక్ష్మిని కసిరింది శాంత.

'మధ్యను దాన్ని కసరడం యెందుకు? మొగపిల్లలకు యెలాగా నా మీద శ్రద్ధలేదు. పోనీ ఆడపిల్లకైనా నా మీద శ్రద్ధ ఉంది. అదే సంతోషం' అని అంటూ రామ్మూర్తి లక్ష్మి భుజం మీద చెయ్యి వేసికొని లోపలకు వచ్చి తన మామూలు కుర్చీలో కూర్చున్నాడు

'నాన్నా! నీకు పని కుదిరిందా?' అని లక్ష్మి మళ్లా అడిగింది.

'కుదిరిందమ్మా! కుదిరింది' అన్నాడు రామ్మూర్తి.

'ఎక్కడ కుదిరింది నాన్నా?'

'చిట్‌ఫండు కంపెనీలో'

'చిట్‌ఫండు కంపెనీలోనా?' అని ఆశ్చర్యపడింది శాంత.

'అవును చిట్‌ఫండు కంపెనీలోనే' అన్నాడు రామ్మూర్తి.

'చిట్‌ఫండు కంపెనీలో పనియేమిటి ఉంటుందండీ?'

'ఏముంది? మెంబర్లవద్దకు వెళ్లి డబ్బు వసూలు చెయ్యడం, ఆ డబ్బు బ్యాంకులో చెల్లించడం అవసరమైనప్పుడు మళ్లా బ్యాంకునుంచి డబ్బు తేవడం ఇదేపని!'

'అయితే యిలాగ మీరు కుంటుకుంటూ రోజు అంతా తిరుగుతూనే ఉండాలన్న మాట.'

'అవును.'

'వద్దండీ! మీకు ఈ ఉద్యోగం వద్దు. ఇంకోపని చూడండి!'

'ఈ ఉద్యోగం వద్దు' అని నువ్వు చాలా తేలికగా అన్నావు. కాని ఈ ఉద్యోగం మాత్రం సులభంగా దొరికిందా? దీనికే యెంతోమందిచేత సిఫార్సు చేయించవలసి వచ్చింది. ఈ ఉద్యోగానికే యింకొకరు అయితే వెయ్యిరూపాయలు ధరావతు కట్టవలసి ఉంది. పెద్ద మనుష్యులు చాలా మంది నా గురించి చెప్పారు కాబట్టి ధరావతు కట్టకుండానే నాకు ఈ ఉద్యోగం యివ్వడానికి ఆ కంపెనీవారు అంగీకరించారు అయినా, బి.యేలు, యం. యేలు ప్యాసు అయినవాళ్ళకే ఉద్యోగాలు దొరకని ఈరోజుల్లో నాలాంటివాడికి ఈ ఉద్యోగం దొరకడమే అదృష్టం' అన్నాడు రామ్మూర్తి.

దానికి శాంత యేమీ సమాధానం చెప్పలేదు.

అనగనగా...

'ప్రసాదూ, కోడలూ యింకా ఆఫీసు నుంచి రాలేదా?' అని ప్రశ్నించాడు రామ్మూర్తి.

'ఆఫీసు మూసి వేయగానే వాళ్ళు యిద్దరూ అలాగే సినిమాకు వెళ్ళారట. వచ్చేసరికి కాఫీనీళ్ళు పెట్టి ఉంచమని కబురు పంపించారు. ఆఫీసు బంట్రోతు యిప్పుడేవచ్చి చెప్పాడు.'

ఇంతలో వీధి గుమ్మం దగ్గరనుంచే, 'అమ్మా! అన్నం పెట్టు' అని కేకవేస్తూ రాజా యింటిలోనికి వచ్చాడు.

'ఏమిటి రాజా! వీధిలోనుంచే కేక వెయ్యడం? ఏదో ఆఫీసుకువేళ అయిపోయి నట్లు' అన్నది శాంత.

ఆమె ఆ మాట అప్రయత్నంగానే అన్నది కాని ఆమాట అనగానే ఆమెకు ఒక ఆలోచన మెరుపులాగ వచ్చింది.

'నేను మళ్ళా వెంటనే వెళ్ళిపోవాలి' అన్నాడు రాజా కంగారుగా బట్టలు మార్చుకొంటూ.

'లక్ష్మీ! అన్నయ్యకు అన్నం పెట్టు'

లక్ష్మి వంటింటిలోనికివెళ్ళి రాజాకు భోజనం పెట్టింది. రాజా అడావుడిగానే, భోజనం చేసివచ్చి మళ్ళా బట్టలు తొడుగుకొంటున్నాడు.

'నీ పరీక్షా ఫలితాలు యెప్పుడు వస్తాయి?' అని ప్రశ్నించింది శాంత.

'ఈవేళ తేదీ ముప్పై కదా! ఈనెల కాక పై నెల పదిహేనవతేదీనాటికి రావచ్చును' అని రాజా మళ్ళా బయటకు వెళ్ళిపోబోయాడు.

'వెళ్ళిపోవడం కాదు... నీతో ఒకమాట చెప్పాలి. అలాగ కూర్చో!' అన్నది శాంత.

'ఊ!' అని అంటూ అయిష్టంగానే అక్కడ బల్లమీద కూర్చున్నాడు రాజా.

'ఈసారి అయినా, తప్పకుండా ప్యాసు కాగలవా?' అని ప్రశ్నించాడు రామ్మూర్తి.

'ప్రశ్నలు ఈసారి చాలా కష్టంగా ఉన్నాయి. అందుచేత అంతబాగా రాయలేక పోయాను కాని ప్యాసు అవడం మాత్రం ఖాయం' అన్నాడు రాజా ధీమాగా.

'తరువాత యేం చేద్దామని అనుకొంటున్నావు?' అని ప్రశ్నించింది శాంత.

'వచ్చేసంవత్సరం కాలేజి తెరచిన తరువాత, బియేలో చేరతాను'

'అంతవరకు ఖాళీగా ఉండడం యెందుకు? ఈ లోపున టైపు, షార్టు హేండు నేర్చుకో!' అన్నాడు రామ్మూర్తి.

'టైపూ, షార్టుహేండూ నేర్చుకోవడమేనా? గుమస్తాపని కూడా చేయాలా?' అని వెటకారంగా ప్రశ్నించాడు రాజా.

'గుమస్తాపని చేస్తేమాత్రం తప్పేమిటి బాబూ?' అన్నది శాంత బతిమాలుతున్నట్లుగా.

దానికి రాజా యేమీ మాట్లాడలేదు.

'చూడు, రాజా! మీ నాన్నగారికి ఒక చిట్‌ఫండు కంపెనీలో ఉద్యోగం దొరికింది. మెంబర్లవద్దకు వెళ్లి డబ్బు వసూలు చేయడం, ఆ డబ్బు బ్యాంకులో కట్టడమే ఆ ఉద్యోగం. మీ నాన్నగారు అలాగ కుంటుకుంటూ ప్రతి మెంబరు

మైనస్ యింటు మైనస్

ఛలోక్తుల కత్తులు
నా కుత్తుకను కోస్తున్నప్పుడు
ఎగాదిగా చూస్తున్నవి
ఎదుటి వానిని
నా కన్నులు.

నరాల్లో ఎర్ర సిరా
నటేశు నాట్యం చేస్తున్నది
కను పాపల నడుమ
కనకదుర్గ
పీఠం వేసి కూర్చున్నది.
వదనంలో చంద్ర నిప్పులు
తొంగి తొంగి చూస్తున్నవి
కన్నుల్లో అగ్నిశిఖలు
ప్రళయ తాండవం చేస్తున్నవి.

శంకరుని భయంకర భంగిమ
నాలో చూచుకొని
వీరభద్రుని భీకర భంగిమ
నాలో చూచుకొని
ఎదుటి వాని గుండె
వెనక్కు జారినప్పుడు—
శాంతి శీతల శీకరాలు
నా శిరస్సుపై కురిసాయి
మానవత మకరందాల మందారాలు
నా హృదిలో విరిశాయి.

— రత్నశ్రీ

నద్దకు యెలాగ వెళ్లగలరు ? నువ్వే ఆలోచించు. ఆ ఉద్యోగం నువ్వుచేస్తే బాగా ఉంటుంది,' అన్నది శాంత రాజును మరింత బ్రతిమాలుతూ.

'అన్నయును యేమో బి. యు. వరకు చదివించారు. ఆఫీసరును చేశారు. నేను మాత్రం పియూసీతో చదువు మానెయ్యాలి. ముష్టివాడిలాగ ప్రతికొట్టుకు వెళ్లి డబ్బు వసూలు చేసే గుమాస్తాపని చెయ్యాలి. అదేనా మీరు చెబుతున్నది ?' అన్నాడు రాజు నిష్ఠూరంగా.

'నువ్వు అలాగ అంటే యెలాగ రాజూ ? మీ నాన్నగారు యిదివరకు చేస్తున్నపని పోవడంవలన యింకోపని చూసుకోవలసి వచ్చింది. ఇప్పుడు కుదిరిన యీ ఉద్యోగం చెయ్యడానికి మీ నాన్నగారికి ఓపిక లేనందు వలన నిన్ను యీ ఉద్యోగం చేయమన్నాను. అంతేకాని అన్నయ్య యెక్కువాలేదు. నీ తక్కువాలేదు'. అన్నది శాంత రాజుకు నచ్చచెబుతున్న ధోరణిలో.

'నాన్నగారి పని పోవడానికి నేనా కారణం ? ఆ షావుకారుగారి అమ్మాయిని అన్నయ్య పెళ్లి చేసుకోనక పోవడం వలన నాన్నగారి పనిపోయింది. అందుచేత యీ మాటలన్నీ అన్నయ్యతోనే చెప్పండి. అన్నయ్యనే యెక్కువడబ్బు యిమ్మనమని అడగండి !'

'అన్నయ్య యెక్కువడబ్బు యిస్తే మాత్రం యీ సంసారానికి సరిపోతుందా? రోజురోజుకు ధరలు అన్నీ పెరిగిపోతున్నాయి' అన్నాడు రామ్మూర్తి నిస్పృహాయంగా.

'ఏమైనా సరే, నేనుకూడా బి. యే. పాసయ్యేవరకూ యే ఉద్యోగమూ చెయ్యను' అన్నాడు రాజు ఖచ్చితంగా.

'రాజూ ! అలాంటి పట్టుదలలు మంచివి కావు. మన సంసార పరిస్థితిని గురించి, మీ నాన్నగారి ఆరోగ్యంగురించి ఆలోచించు. నువ్వు యింకా మొండి పట్టుదల పట్టినట్లయితే మీ నాన్నగారు అలాగ కుంటుకుంటూనే తిరుగుతూ, ఆ చిట్‌ఫండు కంపెనీ ఉద్యోగం చేయవలసి ఉంటుంది. ఆతరువాత నీ యిష్టం' అన్నది శాంత యెంతో భారంతో.

'నాన్నగారు ఆ ఉద్యోగం చేస్తారో, మానతారో అది 'మీ యిష్టం. దానితో నాకు యేమీ సంబంధంలేదు' అని చెప్పి వేసి రాజు చివ్వున వీదిలోనికి వెళ్లి పోయాడు.

ఆ తరువాత రామ్మూర్తి, శాంతా ఒకరిముఖంలోనికి ఒకరు నిస్పృహాయంగా చూడడం తప్ప యింకేమీ చేయలేక పోయారు.

(ఇంకా ఉంది)

వారఫలం

3-11-1972 శుక్రవారం మొదలు
9-11-1972 గురువారం వరకు

మేషం : వృత్తిలో శ్రమమీద అనుకూలత లభిస్తుంది. రాజకీయ వ్యవహారాల్లో చికాకులు కలుగుతాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. మీ ఆలోచనలు ఫలిస్తాయి. వారం ఆఖరులో ప్రయోజనంలేని శ్రమ కలుగుతుంది. ఆందోళన కలుగుతుంది.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. దైవ కార్యాలు నెరవేరతాయి.

వృషభం : వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. ప్రయాణాలు ఫలిస్తాయి. ఇతరులనిమిత్తం శ్రమకు గురి కాగలరు. పోటీవారితో మాట పట్టింపులు తగవు. భాగస్వాములతో కలిసిచేసే వ్యాపారాలు లాభిస్తాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది.

స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. విలాస వస్తువులు కొంటారు.

మిధునం : మీ మంచితనమే మీకు ఇబ్బందిని కలిగిస్తుంది. పోటీవారిలో గౌరవం లభిస్తుంది. వారం మధ్యలో వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. విద్యా వైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. వారం ఆఖరులో మీరు అనుకొనేది ఒకటి, జరిగేది మరొకటి కావచ్చును.

స్త్రీలకు—పుణ్యకార్యాలు చేస్తారు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

కర్కాటకం : మీ కార్యక్రమాలు చురుకుగా సాగుతాయి. మిత్రులకు సహాయం చేస్తారు. స్థిరాస్తి వ్యవహారాలు బాగుంటాయి. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. వారం ఆఖరులో వ్యాపారంలో ఆదాయం బాగుంటుంది. నూతన వ్యవహారాలు లాభిస్తాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.

సింహం : మీ శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. నూతన వ్యవహారాలు బాగుంటాయి, సాహసంతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది. వారం ఆఖరులో సామాన్యమైన పనులకు కూడా మీరు ఎంతో కృషి చేయవలసి వస్తుంది.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. బంధు మిత్రులను కల్సుకొంటారు.

కన్య : వృత్తి వ్యాపారాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. మీ ఆలోచనలు లాభదాయకంగా ఉంటాయి. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరతాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. సంతోషకరమైన వార్తలను వింటారు.

తుల : అనవసరమైన శ్రమ కలుగుతుంది. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. వారం మధ్యలో అనుకూల పరిస్థితి యేర్పడుతుంది. వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి. ప్రయాణాలు ఫలిస్తాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. పుణ్యకార్యాలు చేస్తారు.

వృశ్చికం : వృత్తిలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. వారం మధ్యలో ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. విద్యా, వైజ్ఞానిక రంగాల్లో మీ కృషికి ఆటంకాలు వస్తాయి. వారం ఆఖరులో అన్ని వ్యవహారాలు తిరిగి బాగుంటాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగుండదు. విలాస వస్తువులు కొంటారు.

ధనుస్సు : అన్ని వ్యవహారాల్లోను గౌరవం లభిస్తుంది. ప్రయాణాలు ఫలిస్తాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు బాగుంటాయి. మీ ప్రయత్నాలు నిరాటంకంగా నెరవేరతాయి. వారం ఆఖరులో చేజిక్కిన అవకాశాలు కూడా జారిపోవచ్చును.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. బంధు మిత్రులను కల్సుకొంటారు.

మకరం : వ్యాపారంలో అనుకూల వార్తలను వింటారు. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. స్థిరాస్తి వ్యవహారాలు బాగుంటాయి. మీ ఆలోచనలు ప్రయోజనకరంగా ఉంటాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. పోటీవారిలో గౌరవం లభిస్తుంది.


కుంభం : మీ కార్యక్రమాల్లో ఆందోళన కలుగుతుంది. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వారం మధ్యలో వృత్తి వ్యాపారాలు బాగుంటాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. ప్రయోజనంగల పరిచయాలు ఏర్పడతాయి.

స్త్రీలకు—అనవసరమైన వ్యయం జరుగుతుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

మీనం : మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. సాంఘిక కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. వారం మధ్యలో చికాకులు యేర్పడతాయి. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. వారం ఆఖరులో అన్ని వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగుండదు. విలాస వస్తువులు కొంటారు.

—మహేష్





సినిమా

హీరో చేస్తున్న మానవసేవ

జయప్రద పిక్చర్స్‌వారి 'పండంటి కాపురం' కని, విని, ఎరుగని విజయాన్ని సాధించింది. 21 కేంద్రాల్లో వంద రోజుల పండుగను అక్టోబరు 28 న జరుపుకోబోతూంది. హీరో కృష్ణ స్వస్థలమైన తెనాలిలో యీ శత దినోత్సవ సంరంభం జరుగుతుంది. ఈ సభకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖామాత్యులు కాకాని వెంకటరత్నం అధ్యక్షత వహించడానికి, ప్రముఖనటుడు ఎన్టీ రామారావు బహుమతులు పంచడానికి అంగీకరించినట్టు తెలుస్తూంది.

నాలుగుచోట్ల స్టార్ నైట్ రాలీలు

పై సందర్భాన్ని మరొక మంచి కార్యానికి వినియోగించదలిచారు కృష్ణ. కరువు, కాటకాలకు గురి అయిన బాధిత ప్రజలకు సహాయం చెయ్యదలిచారు. అందుకే తాము కొంత డబ్బునిస్తూ, తమ నిర్మాతల చేత కొంత యిప్పిస్తూ, మరికొంత తాము వినోద ప్రదర్శనల ద్వారా, స్టార్‌నైట్‌రాలీస్ ద్వారా ప్రోగు చెయ్యడానికి నిశ్చయించారు. విజయవాడ, తెనాలి, రాజమండ్రి, హైదరాబాదు కేంద్రాల్లో కృష్ణ తమ ట్రూపుతో రెండున్నర గంటలు సాగే ప్రోగ్రాము యివ్వడానికి నిర్ణయించారు.

కృష్ణ తలపెట్టిన యీ మంచికార్యానికి, ప్రజల ఆదరణ లభిస్తుంది. సంపాయించేదాంట్లో కొంతయినా యిలాంటి సమయాల్లో యివ్వడం ముదావహం.

అక్టోబరు 15న ప్రేమ పక్షులు

'మానవుడు— దానవుడు' శతదినోత్సవ వేడుకలో పాల్గొని, మద్రాసుకు వచ్చిన ఉషశ్రీ అధినేత చిన్నపరెడ్డిని, వారి ఆఫీసులో కలిశాను. ఆయన స్క్రిప్టువర్క్‌లో లీనమై వున్నట్టు తెలుసుకున్నాను. తమ నాలగవ చిత్రం అక్టోబరు 15న సెట్స్‌కి వెళ్ళబోతున్నట్టు చెప్పారు. 'ప్రేమ పక్షులు' హీరో ప్రకాష్‌కి ఒక ప్రక్క ట్రయినింగ్‌నిస్తూ, మరొక ప్రక్క షాట్ డివిజన్ను పరిశీలిస్తూ, వేషం కోసం వచ్చేవాళ్లకి సమాధానం చెప్తూ వున్న చిన్నపరెడ్డి వోపికను మెచ్చుకోవాలి.

కొత్త హీరో ప్రకాష్ 'ప్రేమ పక్షులు'చిత్రంతో ధరిస్తున్న పాత్ర సినిమా నిర్మాతపాత్ర. ఆయన సరసన చంద్రకళ, విజయలలిత నటిస్తున్నారు. 'చిలకా— గోరింకా' జంట యీ చిత్రంలోని మరొక జంటగా కనిపిస్తారు. మరికొన్ని ముఖ్యపాత్రలను రేలంగి, సత్యనారాయణ, ముక్కామల, రాజబాబు చేత వేయిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకుడు తప్ప మిగతా సాంకేతికవర్గమంతా మీకు తెలిసిన వాళ్లే. విడుదల: అనిల్ ప్రభాస్.

అయిదవ చిత్రానికి కథ రెడీ

ఉషశ్రీ బ్యానర్‌లో నిర్మితమయ్యే అయిదవ చిత్రంలో శోభన్‌బాబు నాయకపాత్రను పోషిస్తారు. ఆ చిత్రానికి కూడా కథ రెడీగా వుందని చిన్నపరెడ్డి చెప్పారు.

ఉషశ్రీని తమ అగ్రజుని కుమార్తె పేరిట నెలకొలిపారు చిన్నపరెడ్డి.

మీకు తెలియని నిజం !

నేను విన్న ఒక నిజాన్ని మీకు చెపుతాను. ఇది కల్పితం కాదు. యదార్థంగా జరిగిన సంఘటన. అదేమిటో తెలుసా?

అవి 'బుద్ధిమంతుడు' షూటింగు జరుగుతున్న రోజులు. రాజమండ్రి సమీపాన అవుట్‌డోర్ జరిగేటప్పుడు, ఉషశ్రీ సోదరులు మారిరెడ్డి, చిన్నపరెడ్డి, భక్తపోతన నిర్మాత విశ్వేశ్వరరావు, నటసామ్రాట్‌ను కలిసి, మానవుడు— దానవుడు కథను ఆయనకు వినిపించి, నటించమని కోరారు. అక్కినేనికి కథ నచ్చింది. అప్పటికే తను 'బుద్ధిమంతుడు, ధర్మదాత' చిత్రాల్లో ద్విపాత్రాభినయానికి ఒప్పుకున్నట్టు, కొంతకాలం ఆగితే తప్పక చేస్తానని చెప్పినట్టు నాకు తెలిసింది. ఈ వార్త నిజమేనా అని చిన్నపరెడ్డిని, వారి అన్నయ్యను అడిగాను. అక్షరాలా నిజం, అన్నారు వాళ్ళు. ఈ సందర్భంలో మీకు మరొక మాటను గుర్తు చేస్తున్నాను. 'విచిత్ర దాంపత్యం' షూటింగు జరుగుతున్న సమయంలో చిన్నపరెడ్డి ఆంధ్ర సచిత్రవార పత్రిక పాఠకులకు చెప్పిన మాటే అది. ఏమిటది? 'అక్కినేని నాగేశ్వరరావుగారితో సినిమా తీస్తే, అది రజతోత్సవ చిత్రంగా వుండాలి' — ఇవి చిన్నపరెడ్డి మాటలు. ఆ కోరిక యీడేరు రోజు ఎప్పుడో మరి?

మైనరుబాబుగా శోభన్ బాబు

'ఆత్మీయులు' నిర్మాతలు, అఖిలభారత ఖ్యాతినార్జించిన తాతినేని ప్రకాశరావు కలిసి స్థాపించిన సంస్థయే సారథి అండ్ టి.పి.ఆర్ కంబైన్స్, ఈ సంస్థ నిర్మించే చిత్రానికి 'మైనరు బాబు' అని పేరు పెట్టారు. టైటిల్ పాత్రను శోభన్‌బాబు పోషిస్తున్నారు. ఆయనకు జంట వాణిశ్రీ. పల్లెపిల్ల వేషం ధరిస్తూంది. ఇప్పటికి రెండు షెడ్యూల్స్ పని జరిగింది.

'కాలం చాలా విలువైనది. ఆ కాలాన్ని సద్వినియోగం చెయ్యడం మన ధర్మం. ఎవరికాళ్లపై వాళ్ళు నిలబడి బ్రతకాలి. అప్పుడు ప్రతి జీవికి సుఖ, శాంతులు లభిస్తాయి' అనెడి నిత్యసత్యాన్ని చాటిచెప్పే చిత్రం యిది. కథను తాతినేనిప్రకాశరావు వ్రాశారు. మాటలను ఆచార్యఆత్రేయ రచించారు. సంగీతాన్ని చలపతిరావు, ఛాయను కె.ఎస్. ప్రసాద్ నిర్వహిస్తున్నారు.

ముఖ్యపాత్రలను ఎస్వీరంగారావు, గుమ్మడి, అంజలీదేవి, రాజబాబు, అల్లురామలింగయ్య పోషిస్తున్నారు.

లీలారాణి, చంద్ర

'మైనరు బాబు' చిత్రంలో కనిపించే రెండవ జంట యిది. ఈ జంటకు కూడా ప్రజల్లో మంచి పేరు వుంది. ఈ చిత్రం నవయుగ ద్వారా విడుదలవుతుంది.



'మరపురానితల్లి'లో లక్ష్మి, వాణిశ్రీ.

సినిమా

హిందీ, తమిళంలలో

పాపం పసివాడు

ఆంధ్రప్రదేష్‌లో విజయాన్ని సాధించిన శ్రీలక్ష్మి ప్రొడక్షన్స్ వారి 'పాపం పసివాడు' చిత్రం తమిళ హిందీ భాషల్లో నిర్మించబడుతుంది. ఏ. పూర్ణ చంద్రరావు నిర్వహణలో తయారైన యీ చిత్రం, సాహసంతో చేసిన రెండవ కార్యం అని చెప్పక తప్పదు.

ఆయన నిర్మించిన 'రవుడీరాణి', యిప్పుడు విజయవిహారం చేస్తున్న 'పాపం పసివాడు' చిత్రాలను, మరొకరయితే తలపెట్టేవారేనా అనిపిస్తుంది. ఆయన గుండె ధైర్యానికి దేముడు తోడుగా వుండడం, ప్రజల ఆదరణ నీడగా లభించడం, మరింత వుత్సాహాన్ని యేర్పరచి, మరిన్ని కొత్త ప్రయోగాలకు దారితీస్తుంది.

ప్రజల వీక్షణాదృష్టిలో సముచితమైన మార్పు వచ్చింది అనడానికి 'పాపం పసివాడు' విజయం చక్కటి నిదర్శనం. స్టార్‌వేల్యూ వుంటేనే చిత్రాలు విజయవంతం అవుతాయి అన్నమాట నిజం కాదని తేలింది

* * *

అర్థం, పర్థం లేకుండా ఆర్టిస్టులు రేట్లు పెంచుతున్నారు సరే యిస్తామంటూ నిర్మాతలు యెగబడుతున్నారు. కానీ, కొన్ని చిత్రాలు వారం తిరగకముందే తిరుగుముఖం పడ్తున్నాయి. అయినా నిర్మాతలు ఎక్కువవుతున్నారు

పాత చిత్రాలకి

ఎక్కువ వసూళ్లు

గతవారం తిరుపతి, విజయవాడ, గుంటూరులకు వెళ్లవలసి వచ్చింది. నేను వున్న నాల్గయిదు రోజుల్లో అనేక మందిని కలిశాను విడుదలయిన చిత్రాల పైన ప్రేక్షకుల అభిప్రాయాన్ని అడిగాను.

గత నాలుగు మాసాల్లో ప్రజలకు నచ్చిన చిత్రాలు అయిదేనని తేలింది.

'సంపూర్ణ రామాయణం' — no

'పండంటికాపురం
మానవుడు—దానవుడు
పాపం పసివాడు
వింతదంపతులు-
ఇన్‌స్పెక్టర్ భార్య'

చిత్రాలు ప్రజలను ఆకర్షించాయి. వాళ్లు చెప్పిన మరొక మాటను చెప్పడం నా ధర్మం. ఇప్పుడు వచ్చే చిత్రాలకన్నా, అప్పుడు నాగేశ్వరరావు, రామారావు నటించిన చిత్రాలు ఎక్కువ వసూళ్లను యిస్తున్నాయట. ప్రేక్షకుల మాట నిజమేనని కలెక్షన్ చార్టు ఋజువు చేసింది.

'మాకు వెరైటీ కథలు కావాలి. చక్కటి కుటుంబ యితివృత్తం అయితే మినిమమ్ గ్యారంటీకి యిబ్బంది వుండదు. కొత్త తారలు కావాలి. కథలో బలం వుంటే, మాకు ఎవరయినా ఒక్కటే' అంటున్నారు ప్రజలు. ఇకనైనా, కనీసం పెద్ద నిర్మాతలయినా కొత్తరక్తం ప్రవహించడానికి యేర్పాట్లు చెయ్యడం మంచిది.

సంక్రాంతికి

దేవుడమ్మ వస్తాడు

శ్రీ రమణచిత్ర ఇంటర్నేషనల్ నిర్మించే 'దేవుడమ్మ' సంక్రాంతి నెలలో, మొదటి వారంలోని ఆరవరోజున ప్రేక్షకులకు దర్శనమిస్తాడు. టైటిల్ పాత్రను చలం పోషించారు. ఈ చిత్రానికి రాజశ్రీ రచన్ను, సత్యం సంగీతాన్ని, మధు ఛాయను నిర్వహించగా కె.వి.నందనరావు దర్శకత్వాన్ని చేపట్టారు.

జయలలిత, లక్ష్మి

'దేవుడమ్మ' కథానాయిక వేషాన్ని జయలలిత ధరించగా, చెల్లెలి పాత్రను లక్ష్మి పోషించింది. మరొక జంటగా రామకృష్ణ, గీతాంజలిని చూస్తారు. ఒక ముఖ్యపాత్రను రాజబాబు ధరించారు. శ్రీఫిలింస్ విడుదల చేస్తారు.

మంచినీళ్ళ మంగయ్య

ఈ పాత్రను పోషించేది ఎవరో తెలుసా? దేవుడమ్మ నాయకుడే. అంటే చలం అన్నమాట. కథను టూకీగా చెపుతాను.



'పెద్దకొడుకు'లో కాంచన, జయ.

దేశంలో గడ్డు సమస్యగా పరిణమించిన మంచి నీటి కొరతను యితివృత్తంగా తీసుకుని, ఆ కొరతను తీర్చడం ఎలా అన్న పరిష్కారాన్ని చూపించే కథయే మంచినీళ్ల మంగయ్య జీవిత కథ.

ముప్పయి రోజుల్లో మొత్తం షూటింగును అవుట్‌డోర్‌లో చిత్రీకరించాలన్న సంకల్పం తమకున్నట్టు చలం చెప్పారు.

మోహన్ బ్రదర్స్ !

ఈ సోదరులు చిత్ర పరిశ్రమలో పదేండ్ల అనుభవాన్ని సంపాదించి యున్నారు. రామవిజేత, అమృతా ఫిలింస్, ఫల్గుణా, ప్రతాప్ ఆర్ట్ ప్రొడక్షన్స్, ఎస్.ఆర్. కంబైన్స్ వారి చిత్రాలకు స్టిల్సు తీసి పెట్టేది వీరిద్దరే. వీళ్లకి సినిమా తీయాలన్న వుద్దేశ్యం కలిగింది. ఇటీవల మోహన్‌బ్రదర్స్ పేరిట సంస్థను రిజిస్టరు చేశారు. ప్రథమ ప్రయత్నంగా ఒక సముజ్జ్వల సాంఘిక కథను ఎన్నుకున్నారు. కథ పేరు 'లక్ష్మి—సరస్వతి'.

పై కథను జి. వి.జి. కృష్ణ వ్రాశారు. దర్శకత్వాన్ని రవి చూస్తారు. జమున ద్విపాత్రాభినయం చేస్తుంది. డిశంబరులో షూటింగు ప్రారంభమవుతుంది.

కృష్ణ కొత్త చిత్రం

శ్రీవాణీ కంబైన్స్ పేరిట ఒక సంస్థ వెలసింది. ఈ సంస్థకు ఎన్.వి. సుబ్బరాజు అధినేత. వీరు లోగడ ఫల్గుణాలోనూ, ఎస్.ఆర్. కంబైన్స్‌లోనూ భాగస్వామిగా వుండేవారు. ఇప్పుడు యీ సంస్థను నెలకొల్పారు. హీరోగా కృష్ణనటిస్తారు. షూటింగు డిశంబరులో ప్రారంభమవుతుంది.

బంగారుబాబు ప్రత్యేకత

జగపతి ఆర్ట్ పిక్చర్స్ ఈస్ట్‌మన్‌కలర్‌లో నిర్మిస్తున్న 'బంగారుబాబు' చిత్రం గూర్చి ప్రేక్షకులు ఎన్నో మధుర స్వప్నాలు కంటున్నారు. కల నిజమయ్యే చందాన దర్శక, నిర్మాత వి. బి. రాజేంద్రప్రసాద్ తమ చిత్రంలో అనేక ఆకర్షణలను జొప్పించారు.

ఏడువందల అడుగుల ఎత్తున ఎగిరే హెలికాప్టర్ పై హీరో నాగేశ్వరరావు ఫైటింగు ఒకహైలైటు. ఇలాంటి దృశ్యం తెలుగు చిత్రరంగంలో ప్రవేశ పెడుతున్న క్రెడిట్ రాజేంద్రప్రసాద్‌కు చెందుతుంది. హీరో నాగేశ్వరరావు, హీరోయిన్ వాణిశ్రీ, మరో 50 మంది అందగత్తెలు పాల్గొన్న మధురమైన పాట దృశ్యం మరొక హైలైటుగా వుంటుంది. ఈ రెండింటికీ మాత్రమే రెండున్నర 'ల' కారాలు దాటాయి.

రాజేష్ కనిపించడం

హిందీనిర్మాతలకు కూడా సాధ్యపడని కార్యాన్ని మన జగపతి అధినేతకు సులువైంది. మ్యాటనీ అయిడల్ రాజేష్‌ఖన్నా 'బంగారు బాబు'లో కనిపించడం మూడవ ప్రత్యేకత. తమిళ నటరాజు



అందాల మోడల్ అమ్మాయిలు జెన్నీక్లేడ్, ఆండ్రియా లాయిడ్.

శివాజీ నటించడం నాలగవ ప్రత్యేకత. ఇన్ని ప్రత్యేకతలు వున్న యీ చిత్రానికి చక్కటి కథ దొరకడం అయిదవ ప్రత్యేకత. అసాధారణ ప్రజ్ఞావంతుడు ఎస్. వెంకటరత్నం వుండే ఈ చిత్రంలో ఛాయా గ్రహణం గూర్చి వేరే వ్రాయాలా? మీరే చూస్తారుగా సంక్రాంతి పర్వదినాన. అన్నపూర్ణా విడుదల.

విఠలాచార్య జానపదం

'చిక్కడు—దొరకడు', 'కదలడు—వదలడు'— చిత్రాలు యిప్పటికీ మంచి వసూళ్లను తెచ్చి పెడుతూనే వున్నాయి. ఆ చిత్రాలను సీతారామస్వామికి కాలం కలిసిరాక 'రైతేరాజు' ఆర్థిక అపజయాన్ని అందించింది. టైము బాగులేదని తెలుసుకున్న ఆ నిర్మాత కొంతకాలం అజ్ఞాతంలో వుండవలసి వచ్చింది. ఆ నిర్మాత యీ నెల మద్రాసుకేతెంచారు.

ఒక జానపద గాథను వీటూరిచేత వ్రాయిస్తున్నట్టు, ఎన్టీరామారావు నాయకపాత్రధారణకు అంగీకరించినట్టు చెప్పారు. దర్శకుడు విఠలాచార్య అట.

* * *

జానపదాలకు మంచిరోజులు వస్తాయి అన్న భావం చాలా మందికి జనించింది. కారణం—పెద్ద గ్యాప్ యేర్పడడమే అంటున్నారు. గత మూడేండ్లుగా జానపదం జోలికి ఎవరూ వెళ్ళలేదు గాబట్టి సీతారామస్వామి తలపెట్టిన యజ్ఞం నిర్విఘ్నం కావచ్చు. ఎన్టీఆర్— విఠలాచార్య కాంబినేషన్‌లో విడుదలైన జానపదాలకు విపరీతమైన క్రేజు వుండేది.

* * *

డి.వి.ఎస్., విఠల్ కంబైన్స్ కూడా జానపదాలనే నిర్మిస్తారట. మరి కొందరు కూడా కాశీమజిలీ కథలపై మోజు పడుతున్నారు.

సినిమా

ఒక్కగా నొక్క కోరిక !

పూర్ణామూవీస్‌వారి చిత్రంలో చంద్రకళ చేత తల్లి, కూతురు పాత్రలను వేయించడానికి సిద్ధపడిన వేళ, ప్రముఖ దర్శకుడు ప్రత్యగాత్మను నిరుత్సాహ పరచిన వ్యక్తులు, చిత్రం రషన్ చూసి, ఆమె అద్భుత నటన్ను వీక్షించి విస్తుపోయారు. దర్శకుని వేనోళ్ల అభినందించారు. చంద్రకళను ప్రశంసించి, దీవించారు. నిర్మాతలు పూర్ణచంద్రరావు, చంద్రశేఖర్లను మెచ్చుకున్నారు. హీరోగా కృష్ణంరాజుకు భవిష్యత్తు వుంటుంది అని పొగిడారు.

చంద్రకళకు ఒక్కగానొక్క కోరిక, తీరకుండానే మిగిలివుంది అని తెలుసుకున్నాను. అదేమిటంటే, హీరో నాగేశ్వరరావుతో రొమాంటిక్ నాయకిగా నటించక పోవడమే. దక్షిణభారత హీరోలందరి ప్రక్కన నాయికగా నటించిన చంద్రకళకి త్వరలోనే నాగేశ్వరరావు ప్రేయసిగా కనిపించే అవకాశం కలగబోతూ వుంది.

మాధవీ కంబైన్స్‌లో అక్కినేని

'బందిపోటుదొంగలు, సుపుత్రుడు' చిత్రాలను అందించిన మాధవీకంబైన్స్ త్వరలో చిత్ర నిర్మాణానికి సిద్ధపడుతున్నారు. వచ్చే సంవత్సరం మార్చినుండి నాగేశ్వరరావు కాల్‌షీట్లు యిచ్చారట. తాతినేని రామారావు దర్శకుడు.

శివాజీ పాత్రలో చలం

నడిగర్‌తిలగం శివాజీగణేశన్ నటించి, శతదినోత్సవం జరిగిన 'జ్ఞానఒళి' చిత్రాన్ని తెలుగులో తయారు చేసే హక్కులను చలం కొన్నారట. శివాజీ ధరించిన పాత్రను ఆయన నిర్వహిస్తారట. తమ గావి, తనకు సంబంధించిన నిర్మాతగాని 'జ్ఞానఒళి'ని తీస్తారట. ఈ కథకి 'లే మిసరబుల్స్' నవల ఆధారం.

మీకు తెలుసా?

పంజాబ్ నేషనల్‌బ్యాంకు చిత్రనిర్మాణానికి పెట్టుబడి పెడుతుందట.

కిశోర్‌కుమార్‌తో లతకు మనస్పర్థలన్న మాటలు అబద్ధం అని యిద్దరూ చెపుతున్నారు. ఎవరు పుట్టించిన పుకారో యిది?

మనోజ్‌కుమార్ పెట్టుకున్న టైటిలు 'ధర్మాత్మ' ను, ఫిరోజ్ తనకు కావాలని కోరడం, మనోజ్ యివ్వడం జరిగింది. మరి తెలుగులో యిలాంటి మంచి పనులు. . . . !

సంజీవ్‌కుమార్ నటించే చిత్రాన్ని షమ్మీకపూర్ డైరెక్ట్ చేస్తారు.

నటి చంద్రకళ త్వరలోనే గాయనిగా కూడా పరిచయం అవుతుందట.

విజయనిర్మల సాధన

తెలుగునటి విజయనిర్మల, మలయాళంలో ఒక చిత్రాన్ని డైరెక్టు చేస్తున్నట్టు పాఠకులకు తెలిపాను. ఆ చిత్రంపేరు 'కవిత', నాయిక కూడా ఆవిడే. పదిరోజుల్లో పదివేల అడుగుల చిత్రం తయారైంది. చిత్రం రషన్‌ని పరిశ్రమ ప్రముఖులనేకులు చూశారట. చూసి అన్నారట. ఏమని? 'మీ దర్శకత్వం అద్భుతం. ఇంత టాలెంటు మీతో వున్నందుకు గర్వపడుతున్నాము. అవార్డు వచ్చే తీరున మీ టేకింగ్ వుంది' అని ప్రశంసించారట. మన తెలుగు వనితకి, వచ్చే ప్రశంసలను చూచి మనం ఆనందించాలి.

త్వరలోనే తెలుగులో కూడా విజయనిర్మల దర్శకత్వాన్ని చేపడుతుంది. వేచి చూడండి.

రామవిజేతావారి రామరాజ్యం

'న్యాయం, ధర్మం, సత్యం—ఆచరణలో పెట్టగలిగిననాడు రామరాజ్యం కనిపిస్తుంది' అన్న యితివృత్తమే రామవిజేతా సోదరుల నాలగవ చిత్ర సృష్టి. ఈ కథను ప్రేక్షకులకు నచ్చే విధంగా దర్శకుడు బాబురావు చక్కటి, చిక్కటి సన్నివేశాలను మాలగా కూర్చారు. ఫామిలీ ఆడియన్స్‌కు మాత్రమేగాక అన్నిరకాల టేస్టులువున్న ప్రేక్షకులకు సరిపడే



'విచిత్రబంధం'లో వాణిశ్రీ, మాస్టర్ రమేష్.



BD. 5121A

పూల డిజైనులు, వివిధ మనోహరమైన రంగులు, సొగసైన అద్దకముల దుస్తులను ధరించి వనలక్ష్మిలా పట్టణమును చుట్టిరండి. బొంబే డైయింగ్‌లో కళ్లు మిరిగే కాటన్ పాప్లిన్లు, కాటన్ సాటిన్లు, కేంబ్రిక్, రుబియా మరియు 'టెరీన్'/కాటన్ రకములు మరియు స్ట్రాబెరీ పింక్, లైట్ బ్లూ, డార్క్ గ్రే, నేవీబ్లూ, మరూన్ మరియు రస్ట్ ఆరు సరిక్రొత్త రంగుల డెనిమ్స్ లభిస్తున్నాయి

బొంబే డైయింగ్

మావలె మరెవ్వరూ ఆడపిల్ల అభీష్టమును గ్రహింపజాలరు.



'కాలంమారింది'లో శారద.

అంశాలను జొప్పించారు. సంగీతప్రియులకు మంచి పాటలను, సాహితీ ప్రియులకు చక్కటి మాటలను, కళాప్రియులకు నవరస పోషణను 'రామరాజ్యం'లో చూడవచ్చు. అంత పకడ్బందీగా బాబురావు శ్రద్ధ తీసుకున్నారు. తమ్ముడుకి కావలసిన సకల సౌకర్యాలను అందించడంలో—అన్నయ్య వెనుకాడనందు వల్ల చిత్రం అపురూపంగా వస్తూ వుంది.

'రామరాజ్యం' చిత్రాన్ని భమిడిపాటి, ఘంటసాల, బుల్‌బులే వరుసగా రచన, సంగీతం, ఛాయాగ్రహణం నిర్వహించారు. ముఖ్యపాత్రలను జగ్గయ్య, ఎస్వీరంగారావు, గుమ్మడి, రాజబాబు, ప్రభాకరరెడ్డి, అల్లురామలింగయ్య, చంద్రమోహన్, శరత్‌బాబు,

సినిమా

సావిత్రి, చంద్రకళ, లీలారాణి, రోజారమణి పోషించారు. లక్ష్మి విడుదల చేస్తారు. నిర్మాత: కె. వి. ప్రభాకర్.

విచిత్రబంధంలో అక్కినేని పాట

సంధ్యకు పుట్టిన బిడ్డ, ఫాదర్ దయానంద్ వద్ద పెరుగుతున్నాడని మాధవ్‌కి తెలుస్తుంది. తెలిసిన మరుక్షణమే మాధవ్, జ్యోతిని తీసుకుని ఫాదర్ దగ్గరికి వెడతాడు. అతని సంరక్షణలో పెరుగుతున్న కుర్రవాడు తన తనయుడేనని ఫాదర్‌కి నచ్చచెప్పి, బాబును తన వెంటబెట్టుకుని వస్తాడు మాధవ్.

ఒకరోజు తన బాబును 'జూ' కి తీసికెడతాడు మాధవ్. అక్కడి జంతువులను చూపిస్తాడు. తన వాడి మోమును చూచి, ఆనందపారవశ్యంతో మాధవ్ పాడసాగాడు. ఏమని?

'చల్లనిబాబూ! నా అల్లరిబాబూ
నా కంటిపాపవు నీవే, మా ఇంటిదీపం నీవే'

అంటూ సంతోషసాగరంలో తేలిపోయాడు. ఈ పాటను అన్నపూర్ణా ఆర్ట్ పిక్చర్స్ వారి కలర్‌చిత్రం 'విచిత్రబంధం' కోసం దాశరధి వ్రాయగా ఘంటసాల చేత, సంగీత సారధి మహదేవన్ పాడించగా ప్రముఖ దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు అద్భుతంగా చిత్రీకరించారు. మాధవ్‌గా నాగేశ్వరరావు, బాబుగా మాస్టర్ రమేష్ నటించారు.

ప్రముఖ నవలారచయిత్రి సులోచనారాణి 'విజేత' యొక్క తెరరూపమే 'విచిత్రబంధం' చిత్రం విజయవంతమైన చిత్రాల సృష్టికర్త దుక్కిపాటి మధుసూదనరావు నిర్మించిన మరొక మణిహారమే యీ 'విచిత్రబంధం'. అన్నపూర్ణా విడుదల.

కాలం మారింది పూర్తయింది

పత్రికారచయిత వాశిరాజు ప్రకాశం మమతా ప్రొడక్షన్స్ పేరిట నిర్మించిన సందేశాత్మక చిత్రం 'కాలం మారింది' షూటింగు ఘట్టం పూర్తయింది.

పూజ్య బాపూజీకి అంకితం అయే యీ చిత్రానికి బొల్లిముంత, రాజేశ్వరరావు, అశోక్‌కుమార్ వరుసగా రచన్ను, సంగీతాన్ని, ఛాయను నిర్వహింప, దర్శకత్వాన్ని కాశీనాధుని విశ్వనాథ్ చేపట్టారు. ఈ చిత్రం యొక్క హీరోగా దర్శకుని పేర్కొనడం వుచితం. మరొకరి చేతిలో అయితే, యీ కథ ఎలా వుండేదో?

చిత్రంలోని ముఖ్యపాత్రలను శోభన్, గుమ్మడి, చంద్రమోహన్, సాక్షి రంగారావు, ప్రసాద్, రావుగోపాలరావు, శారద, అంజలీదేవి, సూర్యకాంతం, గీతాంజలి, పుష్పకుమారి పోషించారు. ఎం.ఎల్.ఏ. ఏకాంబరంగా అల్లురామలింగయ్య పాత్రపోషణ ప్రత్యేక ప్రశంసలకి పాత్రమవుతుంది.

అసభ్యత, అశ్లీలత కానరాదు యీ చిత్రంలో. సందేశాన్ని, సమాజ వికాసాన్ని కోరే చక్కటి కథ యిది లక్ష్మి విడుదల చేసే మరొక మంచి చిత్రం యిది

-శ్రీనివాస్ ●



'రామరాజ్యం' సాతనూర్ అవుట్‌డోర్‌లో చంద్రకళ, శరత్, బాబూరావు.

కాలచక్రం

(21వ పేజీ తరువాయి)

జతో నాటి సంఘటన ఒక దుస్స్వప్నంలా తోచింది తాతకు.

* * *

వేటపాలెంలో ఏ చిన్న దొంగతనం జరిగినా 'అది నరిసిగాడి పనే' అనేవారు. దొంగగా వాడికున్న పేరటువంటిది. కొబ్బరికాయలు దింపేటప్పుడు రెండుసార్లు పట్టుబడ్డాడు. చితకబాదిచి గంగయ్య మొహం చూసి వదిలేశారు. తలలో నాలుకలా మెలిగే గంగయ్య్య కడుపున చెడబుట్టాడని తెగ తిట్టేవారు. మానవ జీవనబాటలో అనేక మలుపులుండవచ్చు. ఒకో మలుపులో అంతవరకూ అంధకార బంధురమైన బాటపై వెలుగు కిరణాలు ప్రసరించవచ్చు. నరిశిగాడి జీవితంలో ఆ మలుపు వచ్చింది.

సోములు కౌలుకుచేసే తోటలోని మామిడికాయలు మాయంచేసి పట్నంలో అమ్ముకుని కులాసా చేశాడు నరిశిగాడు. అయితే దాని ఫలితం అతణ్ని దిగ్భ్రాంతున్ని చేసింది. సోములే వంక పెడుతున్నాడని యజమాని తోట లాగేసుకున్నాడు. దిక్కులేని సోములు కుటుంబం ఘొల్లుమంది. నానాకష్టాలపాలయింది. అంతవరకు ఆలోచించడమెరుగని నరిసిగాడి హృదయం కళింగయుద్ధానంతరం మారిన అశోకునిలాగా కరిగిపోయింది. 'యిక దొంగతనం చేయను' అని ఒట్టు పెట్టుకున్నాడు. కష్టించి పని చేయడం నేర్చుకున్నాడు. అందరూ సంతోషించారు. రామయ్య హృదయం సంబరపడిపోయింది. దాదాపు అందరూ నరిసిగాడి గత జీవిత దృశ్యాన్ని మర్చిపోయారు.

రఘునాథరావుగారి కుమార్తె పెళ్ళి పాలేరు గంగయ్యకు తలకుమించిన పనైంది. కొడుకును సహాయంగా పిలిచాడు ఇంటి పనులకు. రఘునాథరావు అయిష్టంగానే ఒప్పుకున్నాడు, తన యింట్లో నరిశిగాడు పనిచేయడానికి. వాడు పనికిలోకి ప్రవేశించిన మర్నాడే పెళ్ళి నగలు పోయాయని అందరూ గాభరాపడ్డారు. అందరి అనుమానమూ నరిశిగాడిమీదే. వాడు 'నేను తీయలేదు దొరా' అని మొత్తుకున్నాడు. ఐనా లాభం లేకపోయింది. చెట్టుకు కట్టేసి కొట్టారు. గంగయ్య పరుగున వచ్చాడు. పరిస్థితి చూసి నీళ్లు కారిపోయాడు. 'నాకేం తెలవదయ్యా' నరిశిగాడి గొంతు బాధతో పూడుకుపోయింది. 'నిజం చెప్పరా' అంటూ తలో దెబ్బ వేశారు. గంగయ్య చూడలేకపోయాడు.

'మిరాగండిబాబా' అన్నాడు. కొడుకు కళ్ళల్లోకి ఆనునయంగా చూశాడు. 'చెప్పరా నిజం చెప్పు. నిన్నేం చెయ్యరు. నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డము.'

నరిసిగాడు అసహాయంగా చూశాడు. 'నాకేం తెల్దు' అన్నాడు.

చెంప 'చెళ్ చెళ్' మని నాల్గుసార్లు మ్రోగింది.

'నిజంగానయ్యా రాముడితోడు' నరిశిగాడన్నాడు. కళ్ల నీళ్ళు ఏకధారగా ధారలు కట్టాయి. గంగయ్య హృదయ సాగరం ఉప్పొంగింది. నిజమేనేమో! ఒకప్పుడు దొంగ కాబట్టి అనుమానించడం అన్యాయం.

అదే పైకి అన్నాడు. మరుక్షణం వీధిలో పడ్డాడు. మూడురోజులు ఆ కుటుంబానికి కూడూ, నీళ్ళు లేవు. మూడవరోజు రాత్రి నలుగురు నరిశిగాణ్ని చేతులమీద తీసుకొచ్చి కుక్కిమంచంలో పడేసి పోయారు. సోదమ్మ హృదయం బద్దలయింది. రక్తం ముద్దగావున్న కన్న కడుపును చూడగానే ఆమె పై ప్రాణాలు పైనే పోయాయి. తెలిసిన మందులేవో వాడారు. రెండురోజులు నరకయాతననుభవించి నరిశిగాడు కన్నుమూశాడు.

గుండెజబ్బుతోవున్న సోదెమ్మకూడా బెంగతోడైనందున కొద్దిరోజుల్లోనే కొడుకు ననుసరించింది. గంగయ్య లేచాడు. అతని లోపల ప్రతి అణువూ ప్రతీకారాన్ని కలవరిస్తున్నాయి. దళారి రంగయ్య గంగయ్యను కలుసుకున్నాడు. 'ఏం చేద్దామనుకుంటున్నావ్?' అన్నాడు సానుభూతిని చూపి. 'పేదవాడికి ధైర్యం, సానుభూతి, దైవం, ప్రభుత్వం లేవా' అన్నాడు గంగయ్య ధైర్యంగా. రంగయ్య పెద్దగా నవ్వాడు. అది అనుభవంతో నిండింది.

'పిచ్చివాడా, పోలీసులొచ్చి వాళ్ళింట్లో విందుగుడుస్తారు. [illegible]తూమంత్రం చదువుతారు. అంతే; అందుచేత ...' రంగయ్య ఆగాడు.

'నామాట విని ఈ రెండువందలు తీసుకొని జరిగింది మర్చిపో' అన్నాడు. నిజమే ఆ పరిస్థితుల్లో తాను చేయగల్గిందేమీ లేదు. కాని ప్రతీకారం...? తానూ వాళ్ళంత స్థితిలోకి రావాలి. తన మనవడు రాముణ్ణి చదివించి అభివృద్ధిలోకి తేవాలి. అప్పుడు 'నా ఆయుధం రాముడౌతాడు.'

అర్ధరాత్రి గంగయ్యా, రాముడూ, కోడలూ ఆ గ్రామం వదిలారు. కాని స్మృతులు హృదయంలో ముద్రలే. తర్వాత కోడలు ఆ రెండువందలు పట్టుకొని ఎవరితోనో లేచిపోయింది. తాత విచారించలేదు. తాత దృష్టి రాముడిమీదే.

ఎక్కడో కాపలాకుక్క మొరిగింది. గుడ్లగూబ వికృతంగా అరచింది. ఠంగ్ ఠంగ్ మని కచేరిలో పన్నెండు గంటలు మ్రోగాయి. తాత మళ్ళీ మగతగా మేను వాల్చాడు.

* * *

'ఆ గరం గరం మసాలా'— కేకలు వేస్తున్న తాత దృష్టి ఆ కుర్రాణ్ని అన్వేషిస్తూనే ఉంది. ఆ కుర్రవాడి జాడ కనుపించలేదు.

'ఏం రంగులచొక్కా బాబూ, నీ ప్రక్కనుండే బుడతడేడీ ?' అన్నాడు తాత. 'ఓ వాడు రవి. కాని లేదని బళ్లో కూర్చున్నాడు' అన్నాడతను.

'పిల్చుకురా బాబూ' అన్నాడు తాత. కుర్రవాడు వెళ్ళి రవిని వెంటబెట్టుకొచ్చాడు. తాత రవి మొహంలోకి చూశాడు.

'తాతా, డబ్బులేదు. రేపిస్తాలే' భయపడుతూ చెప్పాడు. రవి తాత చిన్నగా నవ్వాడు.

'డబ్బు సరేలేబాబూ, మసాలా తీసుకో' అన్నాడు.

అనుబంధమేదో పెనవేసుకున్నట్టుంది యిద్దరినీ. రవి భయం భయంగా అన్నాడు 'వద్దు' అని. పొట్లం కట్టబోతున్న తాత ఆగాడు ఆశ్చర్యంగా 'ఏం బాబూ?' అన్నాడు.

'మరే పూరికే తీసుకోవద్దని అమ్మ కొట్టింది.'

తాత ఆ తల్లి అభిమానాన్ని మెచ్చుకున్నాడు. 'చెప్పకు బాబూ' అంటూ బలవంతంగా పొట్లం చేతుల్లో పెట్టాడు. రోజురోజుకి తాత, రవిల స్నేహం అభివృద్ధి

పొందుతున్నది. రవి ముద్దు పలుకులతో అగాధమైన తన గతాన్ని మర్చిపోతున్నాడు తాత. తాతకు రాముడు ఆశాజ్యోతి ఐతే రవి ఆనందఃహరి. ఆరోజు తాత మసాలా అమ్మి యింటికి వచ్చాడు. 'రాముడూ' అని పిల్చాడు. జవాబు రాలేదు. మళ్ళీపిల్చాడు. ప్రక్కింటి లచ్చమ్మ వచ్చింది. 'అన్నా' అంది కళ్ళంబడి నీరు కారుస్తూనే. తాత ఖంగారు పడ్డాడు. "ఏమిటమ్మా!" అన్నాడు. లచ్చమ్మ మాట్లాడలేదు. తనింట్లోకి వెళ్ళింది. తాత కూడా ఆదుర్దాగా వెళ్ళాడు. రాముడు స్మారకం లేకుండా మంచంమీద పడున్నాడు. శరీరం లింగాగ్ని జ్వాలలవలె కాలిపోతు న్నది. కాలికి పెద్దకట్టు—తాత గుండె ప్రయ్యలయ్యింది. తన ఆశాజ్యోతికి విషవాయువు సోకింది. 'ఏమిటమ్మా ?' అన్నాడు. లచ్చమ్మ వెక్కి వెక్కి

కాలచక్రం

ఏడ్చింది. 'కోతి కొమ్మచ్చి' ఆడుకుంటూ చెట్టు మీదనుంచి పడ్డాడంట. అసలే దాని మీద గాలి వుందంటాడు.' తాత రాముణ్ణి బుజాన వేసుకొని డాక్టరు వద్దకు తీసుకెళ్లాడు. అయినా కూడ ప్రయోజనం శూన్యం. పదిహేనురోజులకు కూడా మెరుగులేదు. రాముడు బాగా నీర సించిపోయాడు. తాతకన్నంలేదు. నీళ్ళు లేవు. పిచ్చివాడులా ఉన్నాడు. ఒకరోజున రాముడు కన్ను విప్పాడు. తాత హృదయములో ఆనందమయూరం నృత్యం చేసింది. జీవిత బీజం అంకురించింది. అయితే అది క్షణికం. రాముడికి మళ్ళీ స్పృహ తప్పింది. అంతే మరి కన్ను విప్పలేదు రాముడు. తాత గుండెలు బాదుకున్నాడు. పూడ్చిపెట్టి వచ్చి తాను కూడా మరో లోకంలో ఉన్నట్లు ప్రవర్తించసాగాడు. మూడురోజులకు కూడా నీళ్ళు లేవు. నాల్గవనాడు పట్టె బుంగ బుజాన్న వేసుకొని స్కూలుకు వచ్చాడు. అందులో తినుబండారాలేమీ లేవు. పిల్లలంతా మరొకడి దగ్గర కొంటున్నారు.

'తాతా' ముద్దు పలుకు విని ఉలిక్కి పడ్డాడు తాత.

రవి! తాత కళ్ళకు రవి రాముడులాగే కన్పించాడు. 'రాముడూ' అంటూ అరచి ఎత్తుకున్నాడు. రవి చిన్నబుచ్చుకొన్నాడు. 'నా పేరు మర్చిపోయావా తాతా నేను రవిని.' అన్నాడు. గతం ఒక పీడకలగా తోచింది తాతకు. కన్నీళ్ళు తుడుచుకున్నాడు.

'అవును బాబూ, నీ పేరు రవే నా రాముడివి' హృదయానిక్కి హత్తుకున్నాడు.

'తాతా మరి నీవు రావడంలేదే ఆయో చ్చిందా?' అన్నాడు.

తాత కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. నిజంగా వీడు తన రాముడే.

మర్నాడు రవిని యింటికి తీసుకు వెళ్ళాడు. మిఠాయి కొని తినిపించాడు. మరొనాడు రవి రానన్నాడు. 'అమ్మ వెళ్ళ వద్దని కొట్టింది' అన్నాడు.

తాత హృదయం నీరసపడిపోయింది. తప్పేముంది తమ బిడ్డను జాగ్రత్త చేసుకుంటున్నారు! ఐనా తనకు రాముడైన రవి లేనిదే బ్రతకలేడు, బ్రతకబోడు. రవిని తాను పెంచుకోవడానికి తల్లి దండ్రులు ఎంతటి పేదవారైనా అంగీకరించరు.

జీతంలేని నౌకరుగానైన చేరాలి.

రవిని చూస్తూ తన శేషజీవితం గడపాలి.

'బాబూ మీ యిల్లెక్కడ?' అడిగాడు తాత.

'రా తాతా' అన్నాడు రవి.

అతి తక్కువదూరంలో లభించే చిన్న యిల్లది.

'అమ్మోయ్ నేను చెప్పానే ఆ తాతొచ్చాడేన్' రవి అరచాడు.

'ఎవరూ?' అంటూ ఓ పెద్దపెళ్ళ మనిషి బైటకొచ్చాడు.

'తాతయ్యా' అంటూ రవేదో చెప్తున్నాడు.

అతన్ని చూడగానే తాత వంటిమీద తేళ్ళూ, జెర్రెలూ ప్రాకాయి. వేగంగా బైటపడ్డాడు.

తన కొడుకు చేసిన అపరాధానికి, మరొకరిని అనుమానించి చంపిన పాపానికి, ఆ కుటుంబ శాపానికీ గుర్తై ఆధారం లేక అలమటిస్తున్న రఘునాధరావు క్షణంలో తేరుకున్నాడు.

'గంగయ్యా' అంటూ బైటకు వచ్చాడు. కన్పించలేదు. రవి అర్ధంకాక చూస్తున్నాడు.

బ్రతుకుతెరువుకోసం రోజూ వ్యర్థ విచారంచేస్తూ కూర్చున్న రఘునాధరావు 'మణియార్డర్' సార్' అన్నమాట విని ఆనందంతో లేచాడు.

నాల్గువందల రూపాయలు! తనకు పంపిందెవరు?


'రవి చదువుకు నా స్వార్జితం' గంగయ్య.

గంగయ్య హృదయం చదివి రఘునాధరావు వింతపడ్డాడు. పశ్చాత్తాపం హృదయాన్ని పిండివేసింది.

రవి తాతకోసం చాలాకాలమెదురు చూశాడు కాని తాత మరెప్పుడూ కన్పించలేదు.


పార్లే గ్లూకో-
బిస్కట్లు
ఎక్కువ రుచిగలవి-
ఎక్కువ శక్తితో
నిండినవి
విటమిన్లు,
ప్రోటీన్లు,కాల్షియమ్‌వున్న
పాలు,గోధుమ,పంచదార,
గ్లూకోసల శ్రేష్ఠత
ఎల్లప్పుడూ వీటిలో
వుంటాయి.
PARLE
BISCUITS
Gluco
everest/306/PP tel
పిల్లలు పార్లే బిస్కట్లు తినాలి
పెరిగి ఆనందంతో వుండాలి
భారతదేశంలో అత్యధికమైన అమ్మకం కలిగిన బిస్కట్లు పార్లే గ్లూకో

చీకటి



మోపిదేవి దుర్గాప్రసాదరావు

Raghu

ఆగుమ్మంలోకి రాగానే ఆలస్యం చెయ్యకుండా అడిగాడు సూర్యనారాయణ.

'శాస్త్రిగారిని కలిశావా? ఏవన్నారు?'

'మామూలే! తప్పకుండా ప్రయత్నిస్తామన్నారు.' నిర్లిప్తంగా సమాదానం చెప్పి బాత్రూంవేపు నడిచాను.

'ఆ మాత్రం భరోసా ఇచ్చాడంటే తప్పకుండా పనిచేస్తాడు. నీకిహ ఉద్యోగం ఖాయంరా! దిగులేం పెట్టుకోకు!' నా వెనకాలే వస్తూ ధైర్యం చెప్పసాగాడు సూర్యనారాయణ; అక్కడికి నేనేదో ఉద్యోగం రాలేదని బెంగపెట్టుకొని కృశించి పోతున్నట్టు.

వీడి మాటలకేమీ సమాధానమివ్వకుండా బాత్రూం తలుపులు వేసేశాను. మద్రాసు ఎండ పట్టించిన చెమటంతా వదిలించుకుంటూ షవర్‌కింద నిలబడితే హాయిగా వుంది. ఒంటికి పట్టిన మకిలీ, మశానం వదిలించుకొని బైటపడేసరికి, అరగంట పైగానే దాటింది. అప్పటికే సూర్యనారాయణ, సరోజ షోగ్గ బట్టలు వేసుకొని తయారయి పోయారు.

'సరోజ ఏదో నెక్లెసు కొనాలంటోంది. ఆపని అయినతర్వాత అటు నించి ఏదైనా సినిమాకు వెళ్దామనుకుంటున్నాం...... త్వరగా బట్టలు వేసుకొని నువ్వుకూడా రాకూడదూ?' హడావుడిగా బూటులేసులు బిగుంచుకుంటూ అన్నాడు సూర్యనారాయణ.

'సారీ! మీరిద్దరూ వెళ్లిరండి' అన్నాను. ఏదో మొహమాటపు ఆహ్వానంలా వుంది వాడి పిలుపు.

'సరే, అయితే వెళ్తున్నాం! మా కోసం ఎదురు చూడకుండా భోంచేసెయ్యి!' అంటూ భార్య నడుంచుట్టూ చెయ్యివేసి అతిసుకుమారంగా నడిపించుకుంటూ తీసుకెళ్లాడు.

అటువేపే చూస్తున్నాను. కాళ్లల్లో బలంలేక నడవలేకపోతున్న రోగిని పట్టుకొని నడిపించి నట్లుగా, సూర్యనారాయణ అలా ఎందుకు చేస్తున్నాడో నాకర్థం కాలేదు. అంత దగ్గరగా వుండటం మూలంగా ననుకుంటాను, ఒకరి కొకరు అడ్డం పడుతూ అప్పుడప్పుడూ తూలుతున్నారు.

నవ్వు బిగపట్టు కొందామన్నా చేత కాలేదు. పెద్దగా వినిపించిన నా నవ్వుకు చేస్తున్న వంట ఆపి ఆరుముగం పరుగెత్తుకుంటూ వచ్చి చూసి, వెళ్లిపోయాడు.

మెల్లిగా రోడ్డుమీదకు నడిచాను. వీధి చివరనున్న తంగచ్చన్ కొట్లో పనామా సిగరెట్టుపెట్టె, అగ్గిపెట్టె కొనుక్కొని వరండాలో వున్న ఈజీచైర్‌లో కూలబడ్డాను.

వేసూ, సూర్యనారాయణ కాలేజీలో

నాలుగేళ్ళు, యూనివర్సిటీలో రెండేళ్ళు కలిసి చదువుకున్నాం. వీడు బి.కాం. పాసవగానే వీడినాన్న కాళ్ళు తేలేసి, 'అబ్బాయి నిన్ను చదివించడం ఇహ నావల్లకాదు.' అన్నాడు. సరిగ్గా ఆ సమయంలో ఆప ద్బాంధవుడిలా అడ్డుపడ్డాడు సూర్య నారాయణ మేనమామ. మేనల్లుడికి తనే పై చదువులు చెప్పిస్తానన్నాడు. చదువుకయ్యే ఖర్చు ఇవ్వడానికి ముందు, బహానగా తన కూతురు సరోజ నిస్తానన్నాడు. ఇహ వెనకా ముందూ చూడకుండా తలకాయ గట్టిగా వూపాడు సూర్యనారాయణ. అంతే, ఉభామ్మని పెళ్లి జరగడం, వీడు ఎం.కాం.లో చేరడం క్షణాల్లో జరిగిపోయాయి.

అదుగో, అప్పటినించే సూర్యనారాయణ మేనమామ, ప్రస్తుతం పిల్లనిచ్చిన మామ అయిన బ్రహ్మానందాన్ని చూస్తే నాకు మంట. తన కూతురికి తక్కువ ఖర్చులో పెళ్లి చేయడానికి సూర్యనారాయణకు చేసింది సహాయం అనడం హాస్యాస్పదంగా కనిపించింది నాకు. పోనీ, ఏ ఉద్దేశ్యంతో చేసినా మంచిపని, మంచిదే ననుకుందాం. అయినా, అంత మంచిపని చేయడానికి, సూర్యనారాయణకంటే బోలెడు అర్హతలు ఎక్కువగా వున్నవాళ్లను లక్షమందిని చూపగలను. ఇప్పటికైనా, తన రెండో కూతుర్ని అటువంటి వాళ్లలోని ఒక్కడికైనా ఇచ్చి, అలా వచ్చిన అల్లుడికి చదువు చెప్పించవొద్దు, వో చిన్న వుద్యోగం (అంటే నెలకో అయిదువందలు తెచ్చేది) ఇప్పించ డానికి ఒప్పుకుంటాడా?...అలా ఒప్పుకొనే పక్షంలో నాకేనాడో ఉద్యోగం దొరికుండేది.

ఎం. కాం. పాసయిన వెంటనే అల్లుడికో వుద్యోగం మద్రాసులో వేయించి, అక్కడ టి. నగర్‌లోవున్న తన స్వంతయింట్లో మకాం పెట్టించాడు బ్రహ్మానందం. ప్రస్తుతం సూర్యనారాయణ పని మూడు పువ్వులు, ఆరుకాయలుగా వుంది ... అంద మైన భార్య (ఏమాట కామాటే చెప్పు కోవాలి సరోజ చాలా, చాలా అందంగా వుంటుంది), అందమైన ఉద్యోగం, అందమైన ఇల్లు ... ఇంతకీ, సూర్య నారాయణ అదృష్టవంతుడు.

దీర్ఘంగా నిట్టూర్చాను. గాడితప్పిన ఆలోచనలను సరైన దారిలో పెట్టడానికి ప్రయత్నించాను.

'కొవ్వు. ఇంకొకడి అదృష్టం? అందుకోమా ప్రాణస్నేహితుడి అదృష్టానికి అసూయ పడకూడదు. వాడిపెళ్ళాం అందం గురించి ఆలోచించకూడదు,' అంటూ మనసును మందలించాను. అంతేకాకుండా, చిన్నప్పుడు ఎలిమెంటరీ స్కూల్లో నేర్చుకొన్న నీతిపద్యాలు గుర్తు తెచ్చుకొని వల్లించడం మొదలుపెట్టాను. 'అపకారికి నుపకారము నెపమెన్నక సేయువాడు...' మొట్టమొదటగా ఈ పద్యమే ఎందుకు గుర్తుకొచ్చిందో నాకు తెలియదు.'

రోడ్డువేపు దృష్టి సారించాను. బంయ్, బంయ్‌మంటూ మోటారు సైకిళ్ళూ, స్కూటర్లూ వెళ్ళిపోతున్నాయి. వెనక పెళ్ళాల్ని కూర్చోపెట్టుకొని అతి వేగంగా పోతున్నారు. పడిపోతామేమోనన్న భయంతో కాబోలు, మొగుడి నడుంచుట్టూ చేతులువేసి, బరువంతా అతగాడి మీద ఆన్చి, పైటలు జార్చి ఆడాళ్ళు కూర్చున్నారు. ఆ దృశ్యం మాడముచ్చటగా వుంది.

'ఆ ఆడాళ్ళ పైటలు అలా ఎందుకు జారిపోయాయి? ... గాలి మూలంగానా?' నాకు నమ్మ బుద్ధికావడంలేదు. ముందు కూర్చున్న మొగుడు చూడలేడు కదాని ధైర్యం.' అంతే.

నాకు ఉద్యోగం దొరికి, మోటారు సైకిల్ కొనే తాహతు వచ్చినా, నా పెళ్ళాన్ని మాత్రం ఎప్పుడూ ఎక్కించుకోను..అయినా అలా ఒక ఆడది వళ్ళంతా మొగాడిమీద ఆనించి కూర్చుంటే, ఆ మొగవెధవకు రోడ్డుమీద, డ్రైవింగ్ మీద ధ్యాస వుంటుందా? అందుకే కాబోలు, మద్రాసు పట్టణంలో స్కూటర్ల ఆక్సిడెంట్స్ మహా ఎక్కువగా జరుగుతున్నాయి!

బద్ధకంగా వళ్ళు విరుచుకుంటూ గడియారం చూసుకున్నాను. తొమ్మిదవొస్తుంది. ఆకాశంలో చంద్రుడు బ్రహ్మాండంగా వెలుగుతున్నాడు. కుర్చీలోనుంచి లేచాను.

భోజనం ముగించుకొని వచ్చేసరికి రోడ్డుమీద జనం గుంపులు, గుంపులుగా వెళ్ళిపోతున్నారు. రాజకుమారి థియేటర్‌లో మొదటి ఆట అయిపోయి నట్టుంది. నడుస్తున్న కొంతమంది ఏదో పాట ఈల వేస్తున్నారు. మరి కొంతమంది అప్పుడే

చీకటి

చూసిన సినిమా హీరోలా నడుస్తూ, అనుకరణలో తమకున్న ప్రావీణ్యం చూపించేస్తున్నారు.

మళ్ళీ కుర్చీలో జారగిలబడి సిగరెట్టు ముట్టించాను. ఏవేవో బస్సులు వస్తున్నాయి, వెళ్తున్నాయి. బస్సు వచ్చినప్పుడల్లా నిలబడ్డ మనుష్యుల సంఖ్య కొద్ది కొద్దిగా తరుగుతోంది. మరొక్క ముగ్గురు ఆడాళ్ళు నిలబడి వున్నారు...పాపం! వాళ్ళ బస్సు ఎప్పుడొస్తుందో? అసలొస్తుందో, రాదో?...రాకపోతే?...వాళ్ళను పిలిచి ఈ రాత్రికి ఇక్కడ పడుకోమంటే సరిపోతుంది. సూర్యనారాయణ అడ్డు చెప్పడనుకుంటాను. కానీ వాడి భార్య?...

ఉద్యోగం లేకపోవడంవల్ల జీవితంలో నేనెంత పోగొట్టు కొంటున్నానో అర్థమవుతోంది. నా కిష్టమయిన వాళ్లను పిలవడానికి కూడా స్వతంత్రం లేదు.

ఎం. కాం. పాసయి రెండు సంవత్సరాలయినా, ఇంతవరకూ ఉద్యోగం రాలేదు, ఏవేవో ఇంటర్వ్యూలకు వెళ్ళడం, రావడం సరిపోతోంది. వారంరోజుల క్రితం మద్రాసు వచ్చాను, డి. సి. యం. వారి ఇంటర్వ్యూకోసం. అది అయిపోగానే సూర్యనారాయణను కలుసుకుంటే, వాడు 'నాకు తెలిసిన వారిద్వారా ప్రయత్నం చేద్దాం, నువ్విక్కడే వుండిపో!' అన్నాడు. ఈవారం నుంచి సూర్యనారాయణ చెప్పిన ప్రతివాడి దగ్గరకెళ్లి కలుసుకొంటున్నాను.

ఈరోజు ప్రొద్దున్నే శాస్త్రిగారిని కలుసుకున్నాను. ఆయన పి. డబ్ల్యు.డి.లో పెద్ద హోదాలో వున్నాడు. ఫలానా సూర్యనారాయణ ద్వారా వచ్చానని చెప్పగానే ఎంతో ఆప్యాయంగా పలకరించాడు. ఉద్యోగం సంగతి తప్పకుండా చూస్తానని, ఉద్యోగం ఇవ్వడానికి మరి కొన్నిరోజులు పడుతుంది కాబట్టి, ముందుగా ఇది తీసుకో అంటూ కోకాకోలా ఇచ్చాడు.

శాస్త్రిగారి దయవల్ల ఉద్యోగం వచ్చేస్తే బాగుండును. మంచివాడిలా కనిపించాడు. పెద్ద హోదాలో వున్నప్పటికీ మంచీ మర్యాదా తెలిసిన మనిషి. అవతల వాడి కష్టసుఖాల గురించి ఆలోచిస్తాడు. నా కెందుకో సాయంకాలం నుంచీ ఉద్యోగం వచ్చేస్తుందన్న ధీమా ఏర్పడింది.

ఉద్యోగం వచ్చేస్తే, శాస్త్రిగారి పేరు చెప్పుకొని బస్సు దొరక్క ఇలా రోడ్లమీద ఒంటరిగా నిలబడిపోయే ఆడాళ్ళకు ఆశ్రయం ఇవ్వొచ్చు. 'ఆడదాని మానాన్ని కాపాడగలిగిన మనిషే మనిషి; వాడే ఉత్తమ మానవుడు. వాడే ఉత్తమ రాజు' అని వేదాలు ఘోషిస్తున్నాయి.

'ఈరోజుల్లో ఎవర్నీ నమ్మలేం!... ఒంటరిగావున్న ఆడది కనిపిస్తే ఏ అఘాయిత్యమయినా చేయడానికి వెనకాడరు'... తతిమ్మావారి నీచబుద్ధిని గర్హించడంతో నాలో సంతోషం పెల్లుబికింది. గబ గబ ప్రహరీగోడ గేటు దాకా వెళ్ళాను, వాళ్లను పిలుద్దామని. ఇంతలో నల్లటి అంబాసిడర్ కారు వారిముందు ఆగింది. పిలవడానికి తెరిచిన నోరు వెంటనే మూసేశాను.

అయితే వాళ్ళు నిలబడింది బస్సుకోసం కాదన్నమాట...కారులోనుంచి దిగిన మనిషిని పరీక్షగా చూశాను. శాస్త్రిగారు...ఆయన ఏదో మాట్లాడాడు. అందులో ఒకమ్మాయి తల అడ్డంగా వూపి పెదాలు కదిపింది. శాస్త్రిగారు ఏదో మాట్లాడి, కారు డోరు తెరవగానే ఆ అమ్మాయి అందులో ఎక్కింది. కారు వేగంగా కదిలి వెళ్ళిపోయింది, మిగిలిన ఇద్దర్నీ అక్కడే వదిలి.

నాకేం అర్థంకాలేదు. కారులో వెళ్ళిన అమ్మాయి శాస్త్రిగారి భార్య అవడానికి వీలులేదు. ఆయన భార్య చనిపోయి రెండేళ్ళయిందట...'మరి కూతురా?' అదీ అసంభవంగానే కనిపించింది. శాస్త్రిగారి వయస్సు ముప్ఫైఅయిదు దాటదు...పోనీ, ఆ అమ్మాయికి 'లిఫ్టు' ఇచ్చాడేమో అనుకోవడానికి తతిమ్మా యిద్దర్నీ ఎందుకు వదిలేసినట్టు? ...

ఇంతలో ఆర్ముగం వచ్చి, నా పక్కగా నిలబడి 'ఏమిటి - అలా చూస్తున్నావు' అన్నట్టుగా నా వైపు చూశాడు. తలొంచుకొని వరండాలో కొచ్చేశాను.

'అయ్యకి ఇంకా పెళ్లి కాలేదేంటి? అటే చూస్తున్నారు!' వెకిలిగా నవ్వుతూ, నా వెనకే వచ్చాడు ఆర్ముగం.

'సిగ్గెందుకు సార్? కావాలంటే చెప్పండి! ధరకూడా తక్కువే!' చేతులు నులుముకుంటూ అమ్మాయిల అందచందాలు వర్ణించడం మొదలు పెట్టాడు.

'నువ్వు చెప్పేది ఆ అమ్మాయిల గురించేనా? వాళ్ళు... వాళ్ళు బజారు..' నమ్మలేకపోతున్నాను.

'వాళ్ళు ఈ వీధిలో వారందరికీ తెలుసు సార్! అమ్మగారు వూర్లో లేనప్పుడు అప్పుడప్పుడూ అయ్యగారి దగ్గరకు కూడా వస్తారు.'

చూడటానికి విద్యావంతుల్లా వున్న వాళ్ళు అలా ఎందుకు మారిపోవాల్సి వచ్చిందో తెలుసుకోవాలనిపించింది. ఆర్ముగం మొదలు పెట్టాడు.

'ఆ ముగ్గురూ అక్కాచెల్లెళ్ళు సార్! పెద్ద అమ్మణ్ణి స్కూల్ ఫైనల్ చదువుతుండగా అప్పా, అమ్మా బస్సు ఆక్సిడెంట్‌లో చచ్చిపోయారు. బంధువులు, స్నేహితులు ఎవ్వరూ లేరు. చెల్లెళ్ళ సాకటుకు, వాళ్ళ చదువులకు ఇంకో దారిలేక, పెద్ద అమ్మణ్ణి ఈ వ్యాపారంలోకి దిగింది...ఆ తరవాత, స్కూలులోని పిల్లలు 'మీ అక్క భోగంది' అంటూ ఎగతాళి చేసి, ఏడిపిస్తుంటే తతిమా ఇద్దరూ కూడా చదువు మానేసి, కొన్నాళ్ళకు ఇదే వృత్తిలోకి దిగారు.'

ఇక ఆపమన్నట్టుగా చేయి వూపి, కుర్చీలో జారగిలబడి కళ్ళు మూసుకున్నాను. పగలు ఎండలో మర్యాదగా కనిపించే శాస్త్రి రాత్రిళ్ళు చేసేపని ఇదా? ... ఎలాటి

చీకటి

మొగాడినయినా ఈ ఆడాళ్ళు ఊబిలోకి దింపేయగలరు గదా!... డబ్బుకోసం శీలం అమ్ముకొనే ఇలాటి బజారుముండల్ని ఏం చేసినా పాపంలేదు. పెళ్ళాంపోయి, ఒంటరిగా కాలం గడుపుతున్న శాస్త్రిగారిని ఇదే అదనుకదాని వలలో వేసుకున్నారు...'

నా ఆలోచనలకు నామీద నాకే అసహ్యం వేసింది. ఉద్యోగం ఇప్పిస్తానన్నాడు గదాని శాస్త్రిచేసే తప్పుడుపని సమర్థించడం ఛండాలంగా అనిపించింది. శాస్త్రి సంగతి అలావుంచి, సూర్యనారాయణ చేసే పనేమిటి? చక్కటి పెళ్ళాం వుండగా ఇలాంటి అడ్డదారులు తొక్కడం...

కళ్ళు తెరచి రోడ్డువంక చూశాను ఆ యిద్దరూ ఇంకా అక్కడే వున్నారా అని. కిళ్ళీకొట్టు తంగచ్చన్ ఏదో మాట్లాడుతున్నాడు. వీడేదో బేరం తెచ్చాడనుకున్నాను ... అనుకున్నట్టుగానే అయింది. మిగిలింది ఒకతే అమ్మాయి. గడియారం చూసుకున్నాను. లాభంలేదు... సూర్యనారాయణ ఏ క్షణంలోనన్నా రావచ్చు.

'పాపం! ఈవిడను తీసుకెళ్ళే అనాథ రక్షకుడెవరో?'

నిజంగానే అనాథరక్షకుడు ఆ చివరినుండి వస్తున్నాడు, లాఠీ వూపుకుంటూ. పోలీసును చూడగానే ఆ చిన్నది అక్కడనుంచి వెళ్ళిపోవడానికి ప్రయత్నించింది. కానీ; అతగాడు కేకవేయడంతో ఆగిపోవాల్సి వచ్చింది. దగ్గరగావచ్చి ఏదో అగవంలో అడుగుతున్నాడు. ఆవిడ సమాధానం చెప్తోంది. వణుకుతున్న కంఠంతో గబగబ మనవి చేసుకొంటోంది. బహుశా దయ చూపమని ప్రార్థించిందనుకుంటాను. కానిస్టేబుల్ అదేవీ పట్టించుకోకుండా పదమన్నట్టుగా జబ్బపుచ్చుకు ముందుకు తోశాడు. ఇహ విధిలేక అతగాడి వెనక బయల్దేరింది.

పాపం! ఇప్పుడు స్టేషన్‌కు తీసుకెళ్తారు. రేపు కోర్టులో నిలబడి, నవ్వటానికేవున్న ఆ కళ్ళలోనుంచి నీరు కారుతుంటే దయ చూపమని ప్రార్థిస్తుంది.


'చూస్తిరా స్వామీ! మీ ఛాన్సుపోయే! త్వరగా తేల్చమంటే నానుస్తూ కూర్చుంటిరి' నొచ్చుకుంటూ అన్నాడు ఆర్ముగం.

'ఆర్ముగం! పోలీస్‌స్టేషన్‌లో ఆ అమ్మాయిని కొడతారా?' అన్నాను, సాధ్యమైనంత నిచారం ధ్వనింపచేస్తూ.

'పోలీస్‌స్టేషనుకు కాదుసార్ ఇప్పుడెళ్ళింది; ఇన్‌స్పెక్టర్‌గారింటికి. ఎవరినన్నా బాగున్న పిల్లను తీసుకురమ్మన్నాడట ఆయన, ఇది కనిపించింది. 'రేపు సాయంకాలంలోగా మూడునెలల ఇంటద్దె కట్టకపోతే, సామాను వీధిలో పారేస్తానన్నాడు, బాబ్బాబు రేపిస్తాను. ఈవేళ్టికి వదలండి' అంటే వినిపించుకోకుండా లాక్కుపోయాడు...ఏదైనా, మంచి ఛాన్సు పోగొట్టిరి సార్!' అంటూ లోపలికెళ్ళిపోయాడు ఆర్ముగం.

తలంతా దిమ్ముగా వుంది. పొట్టకూటికోసం ఎన్నిబాధలు! ... హఠాత్తుగా నిన్న చూసిన విషయం గుర్తుకొచ్చింది.

నిన్నరాత్రి ఇలాగే వరండాలో కూర్చున్నాను. రెండుకాళ్ళకూ కట్లు కట్టుకొన్న మొగాడ్ని తోపుడబండిలో కూర్చోపెట్టుకొని ఒక ఆడది తోసుకొస్తోంది సరిగ్గా ఆ లాంతరు స్తంభం దగ్గరకు రాగానే ఆ కుంటివాడు గబగబ తన కట్లన్నీ విప్పదీసుకొని నడుస్తూ వెళ్ళి పేవుమెంటుకు ఓ వారగా నిలబడ్డాడు, వళ్ళు విరచుకుంటూ. కుంటివాడిగా వేషంవేసి ముష్టియెత్తి తెచ్చిన డబ్బు పంచుకోవడంలో తగాదా వచ్చినట్టుంది, ఆ యిద్దరూ చాలా



సేపు పోట్లాడుకొని, ఆ సేపు మెంటుమీదనే ఓమూలగా పడుకొని నిద్రపోయారు.

గేటువేసిన చప్పుడుకు ఉలిక్కిపడి చూశాను. సూర్యనారాయణ, సరోజ వచ్చారు.

'సారీ బ్రదర్! సినిమానుంచి అలా హోటల్‌కువెళ్లి భోజనం చేయడంతో ఆలస్యమయిందీ ... నీ భోజనం అయి పోయిందా ?' అయిందన్నట్లుగా తల వూపాను.

'పడుకొండు కావస్తోంది; పడుకో రాదూ?' అంటూ లోపలి కెళ్లిపోయాడు. అలాగే ఎంతసేపు కూర్చున్నానో నాకే తెలియదు.

లోపలినుంచి మాటలు వినిపిస్తున్నాయి.

'నగదాల నెక్లెస్సు కొనాలని చాలా రోజులనుంచీ అనుకుంటుంటే, అది ఇప్ప టికి తేలింది... అన్నట్లు మొన్న డబ్బడిగితే లేదన్నారు. రెండురోజుల్లో పదివేను వందలరూపాయలు ఎక్కడినుంచి వచ్చా యండి?' నిగ్గదీసి అడుగుతోంది సరోజ.

'మా కంపెనీ వస్తువుల ఏజన్సీ శాస్త్రి తమ్ముడికి ఇప్పించాను. పాడిచ్చాడీ డబ్బు. అబ్బబ్బ! ఆ రాస్కెల్ పట్టి పిసినారి అనుకో! దర్టీస్కౌండ్రల్! ఈ పదివేను వందలివ్వడానికి ఏడ్చి చచ్చాడు.' అంత పిసినిగొట్టు దగ్గరనుంచీ డబ్బు లాగ గలిగానన్న సంతోషం ధ్వనించింది సూర్య నారాయణ గొంతులో.

* * *

త్రిక్కూరు కంపార్టుమెంటులో నా బెర్తు నంబరు చూసుకొని కూర్చున్నాను. ఉద్యోగం వస్తుందన్న ఆశ వదులుకొని తిరిగి బెజవాడ వెళ్లిపోతున్నాను.

నా ముందు బెర్తుమీద ఓ యిద్దరు కూర్చున్నారు. 'ఇక్కడైతే హాయిగా



వుంటుంది. అర్ధరూపాయి పారేస్తే హాయిగా కూర్చుని పోవచ్చు!' అంటున్నాడు ఇరవై ఏళ్ల కుర్రవాడు పక్కనున్న నలభై ఏళ్ల పెద్దమనిషితో.

తెలియక ఈ పెట్టె ఎక్కారనుకున్నాను.

'చూడండి! ఇది త్రిటైరు పెట్టె. ఇక్కడ కూర్చోనివ్వరు. బెర్తులు మాత్రం వుంటాయి ఒక్కోదానికి నాలుగున్నర రూపాయలు వసూలు చేస్తారు.' అన్నాను.

ఆ ఇద్దరూ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. 'ఇంకో పెట్టిలో ఎక్కుదామా?' అనుకున్నారు కాసేపు. ఇంతలో బండి కదలడంతో, ఇరవై ఏళ్ల కుర్రాడు 'ఇప్పుడే వస్తాను, వుండు బాబాయి!' అంటూ వెళ్లాడు. మరో పది నిముషాల్లో తిరిగి వచ్చాడు నవ్వుతూ.

'కండెక్టరుతో మాట్లాడాను. అయిదు రూపాయిలిస్తే మనిద్దరికీ బెర్తిస్తానన్నాడు. హాయిగా పడుకొని వెళ్లిపోవచ్చు' అంటూ గబుక్కున ఆగిపోయి ఆలోచనలో పడ్డాడు. కాసేపటికి తేరుకొని జేబులోనుంచి మూడురూపాయలు తీసి బాబాయి చేతిలో పెట్టాడు.

'కండెక్టరు రాగానే ఈ డబ్బులియ్యి బాబాయి! 'మావాడు తెలియక అయిదు రూపాయలన్నాడు. మూడుకంటే ఎక్కువివ్వను.' అను, సరిపోతుంది' అన్నాడు. బాబాయి సరే నన్నట్టుగా తలాడించి,

చీకటి

కండెక్టరు రాగానే అలాగే చేశాడు. కండెక్టరు ఏమీ మాట్లాడకుండా ఆ ఇద్దరికీ బెర్తులిచ్చేసి వెళ్లాడు.

ఇదంతా చూస్తున్న నాకు ఏమిటోగా వుంది. ఎక్కడచూస్తే అక్కడ మోసం. ఉద్యోగం యిప్పిస్తానన్న శాస్త్రి, ఎవడో వెయ్యిరూపాయలివ్వగానే తనాఫీసులోని ఉద్యోగం వాడికిచ్చి నాకు మొండిచెయ్యి చూపించాడు...భార్యకు నగలు చేయించడానికి, డాబుగా బ్రతకడానికి లంచాలు తీసుకొని పెద్దమనిషిగా చలామణి అవుతున్న సూర్యనారాయణ ... ఆఖరకు రైలుబండిలో కండెక్టరు కూడా...

ఈ ఆలోచనలతో సరిగ్గా నిద్రపట్టలేదు. సర్కారు ఎక్స్‌ప్రెస్ గుంటూరులో ఆగినప్పుడు రాత్రంతా మనస్సులో దిగులుగా వున్నదెందుకో అర్ధమయింది. నాబాధంతా కండెక్టరు లంచం పుచ్చుకున్నాడని కాదు; నేను వెర్రి వెధవలా బెర్తుకోసం నాలుగున్నర తగలేశాను కదాని.

దాహంగా వుండే మంచినీళ్లు తాగుదామని రైలుదిగి పంపువేపు నడిచాను. నలుగురైదుగురు పంపుచుట్టూ మూగారు. వెనకగా నిలబడి దిక్కులు చూస్తున్నాను. సరిగ్గా పంపు కెదురుగా ఫస్టుక్లాసు పెట్టె వుంది. కిటికీలోనుంచి ఒక అందమైన మొహం పంపుదగ్గర నీళ్లు తాగుతున్న వారిని పరీక్షగా చూస్తోంది. ఆ మొహంలో ఏదో కుతూహలం కనిపిస్తోంది. నాకిహ ఆ పంపుదగ్గర నీళ్లు తాగాలనిపించలేదు.


ఈ రైలు డ్రైవరుకు బుర్ర వున్నట్టు లేదు. ఈ మొదటి తరగతిపెట్టె కొంచెం ముందుగానో, వెనగ్గానో తీసుకెళ్లకూడదూ?...ఆ అందాలభరిణ, పంపుదగ్గర నీళ్లు తాగుతున్నవాళ్లను వింతజంతువుల్ని చూసినట్టుగా చూస్తుంటే, ఎలా తాగేది ?

ఎదురుగా కనిపిస్తున్న నీళ్లను తాగకూడదనుకొనేసరికి, దాహం మరి కాస్త ఎక్కువయింది. తల సవరించుకుంటూ, కంపార్టుమెంటు దగ్గరగావచ్చి సిగరెట్టు వెలిగించాను. ఒకచేయి చెంపమీద ఆన్చి, కళ్లు విప్పార్చుకొని గమనిస్తున్న అందాల పసిడిబొమ్మను చూస్తుంటే మనసంతా అదోలా వుంది. ఇంతలో, నా కల చెదరగొట్టడానికేనన్నట్టు, రెండు చేతులూ లేని ముష్టివాడు ఆవిడను ఓ పదిపైసలు పడెయ్యమని అడుగుతున్నాడు. ఆవిడ వాడిని కసిరికొట్టింది. ఆ అందమైన మొహంలో కనిపించిన కోపం చూసి కాస్త బెరుకు పట్టింది నాకు. ఆ ముష్టివాడు అక్కడనుంచి సరాసరి నా దగ్గరకు వచ్చాడు. జేబులో చెయ్యిపెట్టి వెంటనే తీసేశాను. ఆవిడ నావేపే చూస్తోంది. ఆవిడగారు ముష్టివేయనప్పుడు నేనేస్తే, నా గురించి ఏమనుకుంటుందో? ... చెడుగా అనుకుంటే సహించలేను. వాడిని కాస్త గట్టిగా కసురుకొని పంపించేశాను.

గార్డు పచ్చజెండా వూపగానే బండి కదిలింది. వెంటనే బండెక్కాను.

మళ్లీ సూర్యనారాయణ, శాస్త్రి, కండెక్టరు, ఆ రాత్రి చూసిన ముగ్గురమ్మాయిలు, నా బుర్రలో మెదలడం ప్రారంభించారు. పొట్టకూటికి ఒకరు తప్పుడు పనులుచేస్తుంటే, దర్జాలకోసం, విలాసాల కోసం మరొకరు చేస్తున్నారు.

ఆలోచిస్తున్న నాకు హఠాత్తుగా ఓ అనుమానం వచ్చింది. ఇంతమందిని చెడ్డవాళ్లని అనుకుంటున్నానే, మరి నేనో???... ఏమో!!! ●





"అవును, జానకి. నాకు తెలిసిన మంచి ఆరోగ్యవంతమైన కుటుంబాలన్నీ 'హార్లిక్స్' తాగుతాయి—అది పుష్టిని చేకూర్చ టానికి ప్రధాన సాధనం

అంటారు జానకియొక్క డాక్టరు గారు



'హార్లిక్స్' రిజిస్టరు కావించబడిన ట్రేడ్ మార్కు.

'హార్లిక్స్' యొక్క విశిష్టమైన ఆహార విలువ ఆయనకు తెలుసు. 'హార్లిక్స్'లో మంచి సత్తువనియ్యగల మాంసకృత్తులు, శుద్ధమైన పూర్తి మీగడగల పాల పుష్టినిచ్చే సారము, గోధుమ, మాల్టు చేయబడిన బార్లీ వంటి ప్రకృతి సిద్ధమైన పదార్థములు ఇమిడి ఉండుట కారణముగా అది సర్వ శ్రేష్టమైనది. ఉదాహరణకు, 'హార్లిక్స్' పాల యొక్క పుష్టి నిచ్చే శక్తిని రెండింతలు పెంచుతుంది.

జానకి తన కుటుంబములోని వారందరికీ ప్రతి రోజూ 'హార్లిక్స్' నిస్తుంది. దాని ప్రయోజనం కనిపిస్తూనే ఉంటుంది. వారు ఎంతో ఆరోగ్యవంతంగా, శక్తివంతంగా ఉంటారు. అది 'హార్లిక్స్' పుష్టి నుంచి వచ్చినది. కుటుంబము యొక్క పుష్టికి సంబంధించి నంతవరకు ఎవరికీ 'హార్లిక్స్'ను మించి మరొకటి తెలియదు.

'హార్లిక్స్'-మంచి పుష్టికరమైనది

ప్రశ్నోత్తరం

...కె. రామలక్ష్మి...

వి. ఆర్. డి, నిడమానూరు

ప్రేక్షకులు సినిమా పూర్తిగా చూస్తారు. 'జనగణమన' పూర్తి కాకుండానే వెళ్ళిపోవడం మంచిదంటారా?

మంచి చెడు మనం చెప్పలేం. దేశభక్తి, దేశం పట్ల గౌరవం కంటికి కనిపించేవి కావు. మన ప్రవర్తన వల్ల తెలిసేవి. అంచేత ఎవరూ నిలబడనప్పుడు మనం ఎందుకు నిలబడాలి? అనుకోనక్కర లేదు.

వేములపల్లి, తెనాలి

పాఠకులు కొందరు తమ వ్యక్తిగత సమస్యలు మీకు రాస్తూ పరిష్కార మార్గాలడుగుతారు. మీరు వాటిని తేలికగా కొట్టిపారేస్తూ పేలవమైన సమాధానా లిస్తూంటారు?

అంచేత నా రచనంటే మీకు అసహ్యం. అంతేనా? ఎవరి వ్యక్తిగత సమస్యలు వారికి చాలా ముఖ్యంగా వుండవచ్చు. ప్రతి జీవికీ ఉంటాయి. కొన్ని కొన్ని సందర్భాలలో నైనా వీటిని తోసి రాజని ముందుకి పోకపోతే— జీవితమే సాగదు— సరికదా— భారం అయిపోతుంది— లగేజీలా. మీ వ్యక్తిగత సమస్య రంగనాయకమ్మ చిరునామా, నా ప్రతి కథలూ అయితే యింకొకరిది అత్తగారూ ఆడపడుచులు— అంతేలేదా.

కె. వి. ఆర్, కాకినాడ

నా చేతిరాత బాగుండదు.

నాదీను!!

పి. జె. ఆర్, విశాఖపట్నం

ప్రజానాయకుడి హడావిడి ఏమిటి? నిజం చెప్తారా?

హడావిడి చెయ్యకుండా ఏ ప్రజానాయకుడూ వస్తాడయ్యా? పబ్లిసిటీకి పని కొస్తుంది కదా అని కొంచెం జోరుగా పత్రికల్లో గుప్పించారు. ఈ హడావిడి తలెత్తకముందు అసలు రచయిత్రి సీతాదేవి పేరు ఎత్తలేదు. తీరా సినిమా అప్పు చెప్పేసరికి 'ఇది సాహిత్య అకాడమీ బహుమతి నందిన వాసిరెడ్డి సీతాదేవి నవల' అంటూ టాంటాం చేస్తున్నారు. ఇంతకీ తన కథకీ యీ సినిమాకీ ఎంత పోలిక వున్నదీ సీతాదేవి చెప్పాలి! చూశాక మీరు చెప్పాలి!

ఎస్. ఎస్. ఎమ్, ఏటికొప్పాక

చీరలు నగలు యివ్వని వో భార్య అయినా సేవలు చెయ్యదు. ఏమంటారు?

అందానికేముంది? ఏమీ చెయ్యకుండా మీరు తిండి కూడా పెట్టరే! .... కొన్ని కొన్ని సందర్భాలలో స్త్రీలే నయం— ఎదురుచూడకుండా సేవ చేస్తారు.

వి. జి. కె, కావలి

ఆడవాళ్లను గమ్యాలుగా సృష్టించే కార్యాలిస్టులపై మీ అభిప్రాయం?

చాలా పాతకాలం వాళ్ళు!

సుబ్బ శ్రీ, కర్నూలు

జీవితం ఆచరణలోకి వచ్చేసరికి ఆదర్శాలన్నీ అబద్ధాలవుతూ వుంటాయి కదా! ఆచరణకీ అబద్ధానికీ లొంగని జీవితాదర్శం ఒకదాన్ని పేర్కొన కలరా?

అది— మామూలుగా పూవాలు ఆకాశంలోనూ కాళ్ళు నేలమీదా వుంచి బ్రతక నేర్వడం. ఆదర్శం ఆకాశాన్నంటుతున్నదేనా అయితే కనీసం మనం చిటారు కొమ్మదాకానైనా ఎగబాకడానికి ప్రయత్నిస్తాం. యిక ఆదర్శాలు అబద్ధాలయిపోతాయంటారా? అవనీయండి— వాటిస్థానే కొత్త ఆదర్శాలు అవే తలెత్తుతాయి. అసలు ఆదర్శమే లేకుండా వుండేకంటే— కుంటో గుడ్డో తప్పో—ఒప్పో ఒకటి వుండడమే మేలు.

డి. జె. ఎమ్, కాకినాడ


మీకూ సమస్యలున్నాయా?

ఏం నేను మనిషిని కానా?!

టి. టి. ఎస్, చిలకపాడు

ఆడవారిలో పెళ్లి అయినవారికి శ్రీమతి, పెళ్లికానివారిని కుమారి అని అంటూంటారు. మరి మగవారికి ఏటువంటివి వాడుతున్నట్లు లేదు.

శ్రీమతి, కుమారి కూడ ఇంగ్లీషు మిసెస్, మిస్లలే. ఇంగ్లీషులో మిస్టర్—మాస్టర్ వుంది తేడా తెలియడానికి.



డి. పి., మద్రాసు


హోటలు భోజనం ఒంటికి కట్టు దంటారు. ఇంటివంటకంటే చాల్రారుచిగా కూడా వుంటుంది. మరి ఎందుకు అలా అంటారు ?

ఏం లేదు. మనిషి మార్పు కోరుతాడు. ఎప్పుడూ ఇంటి భోజనం చేసి చేసి మొహం మొత్తిన వారికి హోటలు భోజనం విందు భోజనం అంత రుచి వుంటుంది. అదే రోజూ హోటలు తిండి తినేవారింట్లో చారూఅన్నమేవారుచిగావుంటుంది. అంతే.

(62వ పేజీ చూడండి)

విద్యార్థి

తేజోవతి



జరిగిన కథ

ఆర్థిక ఇష్టంలేకపోయినా ఎం. ఎ. లో చేరాడు విద్యార్థి. తన అన్నకూతురు లక్ష్మిని విద్యార్థి వివాహం చేసుకుని జీవితంలో స్థిరపడాలని ఆమె సంకల్పం. కాని, లక్ష్మి ఎవరినో ప్రేమిస్తున్నట్టు తెలుసుకున్న విద్యార్థి, మేనమామతో వాదం పెంచుకుని తిరిగి వచ్చేస్తాడు, జ్ఞానాంబ విద్యార్థిని బాగా ఆకర్షించింది. ఇద్దరూ బాగా చనువుగా వుంటు న్నారు. లక్ష్మిని ప్రేమించిన మధూని వెతికి పట్టుకున్నాడు విద్యార్థి. కాని, అలాంటి మోస గాణ్ణి పెళ్లిచేసుకోనంది లక్ష్మి. మధూకి బుద్ధి చెప్పి పంపించాడు విద్యార్థి.

17

ఇద్దరూ వెళ్లిపోయాక కాస్సేపు నిశ్శబ్దంగా నిలబడ్డారు విద్యార్థి లక్ష్మి... ఆతరువాత మెల్లగా 'లక్ష్మి! .. ఎందుకిలాగ చేశావు' అన్నాడు. చాలా అతృప్తిగా విద్యార్థి.

'చెప్పానుకదు బావా...నన్ను మోసం చేసినవాణ్ణి...నన్ను కరుణించి మీ పాదాల చెంత యింత చోటిస్తే చాలుస్వామీ ! అని కాళ్లమీద పడగల ఔదార్యం నాకులేదు బావా !...'

'అయితే జీవితాంతం యిలాగే మోడులాగా వుండిపోతావా లక్ష్మి ?...'

'ఆఁ...నాకథ తెలిసీ నన్ను క్షమించి, నిండుమనసుతో నన్ను ప్రేమించే విశాల హృదయంగల పురుషుడే లేకపోతే...యిలాగే వుంటానులే బావా !...' అంటుంటే లక్ష్మి కళ్లు అశ్రుసిక్తాలయినాయి.

'లక్ష్మి !...ఏడుస్తున్నావా ?' విద్యార్థి పలకరింపుతో అశ్రుధారలు కట్టాయి... పెద్దగా ఏడుస్తోంది లక్ష్మి.

విద్యార్థికి ఏమీ తోచలేదు...'లక్ష్మి!... ఎందుకు లక్ష్మి ?' దగ్గరకు తీసికొని తల నిమిరాడు...ఒక్కక్షణంసేపు విద్యార్థి గుండెల్లో తలదాచుకొని అలాగే ఏడుస్తోంది లక్ష్మి...

చెయ్యిజారిపోయిన అవకాశాన్ని తల్చుకొని బాధపడుతోంది కాబోలనుకున్నాడు విద్యార్థి...అందుకే... 'చేయిజారాక బాధపడితే ఏం ప్రయోజనం లక్ష్మి !...వూరుకో' అన్నాడు.

'అవును...చేయిజారాక బాధపడితే ఏం ప్రయోజనం ?...' గొణుక్కున్నట్టు అని అతడికి దూరంగా జరిగి నిలబడింది లక్ష్మి.

'పోనీ యిప్పుడు వెళ్లి మళ్లీ పిల్చుకు రమ్మంటావా ?'

'ఎవరినీ ?...'

'అదే...మధూను...'

'ఛీ !... మధూనా ?... వద్దుబావా వద్దు...' అంది. ఆతర్వాత మెల్లిగా... 'నేను నీకు అర్థంకానులే బావా ..' అంది.

'సరే...కాస్సేపుండు ... టాక్సీడ్రైవరు వెయిట్ చేస్తూ వుండుంటాడు... డబ్బిచ్చి యిప్పుడే వస్తాను...' అని చెప్పి పర్సు తీసికొని బయటకు వెళ్లాడు విద్యార్థి.

టాక్సీకి డబ్బులిచ్చి పంపించేసరికి మిత్రబృందం వచ్చి చుట్టుముట్టారు...

'గురూ! పిట్టను పోనిచ్చావ్...ఇంతకూ మీకివ్వాల్సిన డబ్బిచ్చాడా' అంటూ.

'ఆహా...వసూలు చేశాను' అన్నాడు విద్యార్థి.

'అయితే పదండి హోటలుకు'... అని అందరూ గొడవ చేసేసరికి అటునుండి అటే వెళ్లిపోయాడు విద్యార్థి...తిరిగి వచ్చేసరికి ఆరుగంటలు దాటింది. అతడు వచ్చేటప్పటికి లక్ష్మి వంట పూర్తిచేసి వుంచింది.

అతడు వస్తూనే 'అదేమిటి ?... నువ్వు వెళ్లలేదా?...' అన్నాడు ఆశ్చర్యంగా.

'ఇల్లు నాకు అప్పగించి వెళితే ఎలా పోను' అంది లక్ష్మి.

'తాళం చెయ్యి ఇంటివాళ్ల యింట్లో యిచ్చి వెళతావనుకున్నాను ... అయినా నేనొచ్చి చేసుకునేవాడినిగా...వంట నువ్వెందుకు చేశావు ?' అన్నాడు.

'ఏఁ నేను చెయ్యగూడదా ?'

'చెయ్యకూడదనికాదు... కాని ... పదేతే చీకటిపడింది...పద మీయింటిదగ్గర దింపేసి వస్తాను...జ్ఞానాంబగారు నీకోసం ఎదురు చూస్తూ వుంటుంది.' అన్నాడు.

'ఏమైనాసరే నేనిప్పుడు వెళ్లదల్చుకో లేదు.'

'అదేం ?' అన్నాడు నిర్ఘాంతపోతూ !

'అదంతే... నీవు త్వరగా ముఖం కడుక్కురా. అన్నంపెట్టేసి పోతాను.'

'ఇప్పుడేం అన్నం లక్ష్మి ... మావాళ్లందరితోబాటు నేనూ హోటల్లో పూరాగా టిఫిన్ తినేసి వచ్చాను.' అన్నాడు విద్యార్థి.

'అయితే నీకు ఆకలి అయ్యేదాకావుండి అన్నంపెట్టి వెళ్తాను, ఇవ్వాళ నీకు దగ్గరుండి అన్నంపెట్టాలి అంతే'

'అమ్మా ! అయితే అదేదో త్వరగా పెట్టెయ్యి. వస్తున్నాను.' అంటూ గబగబా బట్టలు మార్చుకొని ముఖప్రక్షాళన కావించి వచ్చేసరికి, కంచం సిద్ధంచేసి వడ్డించింది లక్ష్మి.

విద్యార్థి భోజనం చేస్తుండగా...

'పాపం...బావకు నేను యింకాసేపు వుంటానంటే ఎంతభయమో ... చీకటి పడేదాకా ఆడపిల్ల నీగదిలోవుంటే అప్రతిష్ఠ అనుకున్నావా ?... లేక జ్ఞానాంబ ఏమైనా అంటుందని భయపడ్డావా, బావా ?' అంది నవ్వుతూ.

'భయపడ్డానికి నేను నువ్వనుకున్నంత మంచివాడినేం కాను...కానీ!' అంటూ ఆపేసి...కాసేపున్నాక మెల్లిగా 'నేనొకటి అడుగుతాను చెపుతావా లక్ష్మి ?' అన్నాడు.

'ఏమిటది ?'

'అదే ఆవిడ...తను...జ్ఞానాంబ...నాకు లభ్యమవుతుందంటావా ?' తల వంచుకునే

అడిగాడు.

కాసేపు నిశ్శబ్దంగా వుండి... 'ఎందుకు లభ్యంకాదు? ఈ ప్రపంచంలో ప్రేమ సాధించలేనిది ఏమీలేదని నీకు తెలియదా బావా ?' అంది. తరవాత 'అయినా ఈమధ్య తనలో చాలా మార్పు వచ్చింది' అన్నది.

తింటున్నవాడల్లా ఆగి! 'మార్పు అంటే ఎట్లాంటి మార్పు ?' ఆసక్తిగా అడిగాడు.

'అంటే ఏదన్నా ప్రేమగీతాలు వింటే అలా ఆలోచిస్తూ కూచుంటోంది. పైగా అప్పుడప్పుడు నన్ను 'ప్రేమా పెళ్లి యివి తప్పనిసరి' అంటావా ?' అని అడుగు తుంది.'

'అప్పుడేమని చెప్పావు నువ్వు !' ఆతృతగా అడిగాడు విద్యార్థి.

లక్ష్మి నవ్వింది ... 'నేనా ?... ఏం చెప్పానంటే... 'అబ్బే ప్రేమా పెళ్లి యివన్నీ బోర్... హాయిగా యిలాగే ఎల్లకాలం వుండిపోదాం! అని చెప్పాను...' అంటూ కొంటెగా నవ్వింది.

'ఛీ ! అల్లరిపిల్లా వూరుకో' అన్నాడు విద్యార్థి లక్ష్మి తన్ను ఆట పట్టిస్తోందని తెల్సుకొని. ఆ తర్వాత... 'నాకో సాయం చేసి పెడతావా? నువ్వు' అన్నాడు.

'ఏమిటది ?'

'అదే...తనను...ప్లీజ్...నాక్కావాలి...తనలాంటి వాళ్లతోడు వుంటేగానీ...ఈ జీవితం ఈదలేనేమో ననిపిస్తోంది, లక్ష్మి' అన్నాడు.

'అదిచేస్తే నాకేమిస్తావు బావా !' మళ్లీ కొంటెగా అడిగింది.

'ఏమివ్వను. నువ్వు కోరుకున్నవాడిని తీసుకొస్తే వద్దు పొమ్మని తిరగ్గొట్టేవుగా ...యిక ఏమివ్వను... అయినా అడుగు' అన్నాడు.

'అయితే అడగనా ?...' అంది ఉత్సాహంగా. అంతలోనే గంభీరంగా మారి పోయి. 'వద్దులేబావా అడగను' అంది బరువుగా నిట్టూర్పు విడుస్తూ.

'అవునూ...వొండేదానివి నాకొక్కడికే వొండేవు, నీకూ్కడ వండకపోయావా ?' లక్ష్మి వేసిన పెరుగు కలుపుకుంటూ అడిగాడు విద్యార్థి.

'గట్టివాడివి బావా.. భోజనం అంతా అయిపోయాక అడిగావు. ముందే అడిగితే భాగం పెట్టాల్సి వస్తుందని భయమేసిందా ?' నిష్ఠూరంగా అంది లక్ష్మి.

'అవును ఆ ఆలోచనే రాలేదు. ఏమిటో ఏదో కబుర్లు మొదలెట్టావు. నేనడగడమే మర్చిపోయాను. అయితే అయింది ఆలశ్యం నేను లేవాక మరి కాసినిబియ్యం పడేస్తాను నువ్వుకూడా భోంచేసెయ్యి' అన్నాడు.

'మరేం వద్దుకానీ...అక్కడ జ్ఞానాంబ



గారు నాకోసం అన్నంవండి ఎదురు చూస్తూ వుంటుంది. యిక నేవెళతాను.' అన్నది లక్ష్మి ఎక్కడివక్కడ సర్ది పెడుతూ.

'నిజమే కదూ! ఆవిడ ఎదురుచూస్తూ వుంటుంది, సరే పద' అన్నాడు చెయ్యి కడుక్కుంటూ విద్యార్థి.

ఆతరువాత తలుపు తాళంపెట్టి యిద్దరూ బయలుదేరారు. గదికి వెళ్లేసరికి జ్ఞానాంబ నిజంగానే ఎదురుచూస్తోంది లక్ష్మికోసం. విద్యార్థిని చూడగానే విప్పారిన ముఖంతో లేచి వెళ్లి కుర్చీ తెచ్చివేసింది. అమ్మాయి లిద్దరూ పంచ పిట్టగోడమీద కూర్చున్నారు.

'మీ లక్ష్మి చూడండి యివాళ ఏంతపని చేసిందో ?' ఫిర్యాదు చేస్తున్నట్లుగా అన్నాడు విద్యార్థి.

'ఏం చేసింది ?!'...ఆశ్చర్యంగా అడిగింది జ్ఞానాంబ.

విద్యార్థి జరిగిందంతా చెప్పాడు.

అంతా విన్న జ్ఞానాంబ నవ్వుతూ 'మా లక్ష్మి చాలా ఎదిగిపోయారండి...భేష్! లక్ష్మిగారు మంచిపని చేశారు. ఈ ప్రపంచంలో ఒకచెంప కొట్టినపుడు రెండో చెంప చూపిస్తే, మారే మనుషులు కొందరు...ఒకచెంప కొడితే తిరిగి ఆచెంపా ఈచెంపా వాయిస్తేగానీ బుద్ధిరాని మనుషులు మరికొందరు.. ఎవరికి ఏ భాషలో చెబితే అర్ధమవుతుందో ఆ భాషలోనే చెప్పాలి.' మెచ్చుకోలుగా అంది జ్ఞానాంబ.

'కానీ తన జీవితం మాటేమిటి ? ప్రతిపురుషుడూ తను ఎన్ని ప్రణయకలాపాలు సాగించినా తన భార్యమాత్రం అలనాటి సుమతిని తలదన్నేదిగా వుండాలనుకుంటాడే' అన్నాడు విద్యార్థి.

'అబ్బ ... పోనీలే బావా ... యిందాకా చెప్పాగా...ఎవ్వరూ చేసుకోకపోతే యిలాగా వుండిపోతానని. పెళ్లిలేకపోతే బతుకు గడవదా ఏమి?'

'జీవితానికి పెళ్లి పరిపూర్ణత నిస్తుందోయ్...ఒక్క మహానుభావుడు ఏమన్నాడో తెలుసా పెళ్లి ఫిజికల్, మెంటల్, స్పిరిట్యుయల్ అండ్ సివిక్ మెట్యూరిటీకి చిహ్నం అన్నాడు...పెళ్లి సోషల్ సెక్యూరిటీ యిస్తుంది. అందులో ఈ సమాజంలో వున్న విషసర్పాలనుండి తప్పించుకోవాలంటే తాళిబొట్టు ఒక మంత్రించిన తాడు!' అన్నాడు విద్యార్థి.

జ్ఞానాంబ మాట్లాడకుండా వింటూ కూర్చుంది. లక్ష్మి జ్ఞానాంబవైపు చూడమని కంటితో సైగచేస్తూ, 'బాబోయి... యిక ఆపుబావా నీ వుపన్యాసం ... నొప్పి కున్నాంతే నీవాదన...' అంది.

'జ్ఞానాంబగారూ... నాకో సాయం చేసిపెడ్తారా?' అని అడిగాడు ఆవిడ అలోచనల కంతరాయం కలిగిస్తూ.

'ఏమిటండీ అది?'

'ఏంలేదు ... రేపు అక్టోబరుపదకొండు నుండీ యిరవైమూడువరకూ కృష్ణా పుష్కరాలు ... స్కౌటువాళ్ళు సర్వీస్‌కు రమ్మని పిలిచారు. వెళ్ళబోతున్నాను. ఈ లోపల మీకు కొన్ని పుస్తకాలు యిచ్చి వెళతాను. మీరు అందులో ముఖ్యమైన పాయింట్స్ కాపీచేసి పెట్టగలరా?'

'ఓ దాందేముంది!...కానీ మీకు క్లాసులు పోతాయేమో?...'


'అవును పోతయి ... కానీ ఏం చెయ్యగలను?...వెళ్ళకుండా వుండలేను. తర్వాత ఎవరిదగ్గరైనా నోట్సు తీసుకుంటాను లెండి. అయితే నేను ఎల్లుండి మా వూరు వెళతాను. అందుకని, 'రేపు పుస్తకాలు తెచ్చియిస్తాను. మీరు ముందా యు. ఎస్. ఎ. ఎస్. పుస్తకాలు పూర్తిచేసి అవి 'రిటన్' చెయ్యండి. ఆ సెంటరు ఎత్తేస్తా రనుకుంటున్నారు' అన్నాడు. 'సరే' నన్నది జ్ఞానాంబ.

అన్నప్రకారమే మరునాడు జ్ఞానాంబకు పుస్తకాలు తెచ్చియిచ్చి వాళ్ళవూరికి వెళ్ళాడు విద్యార్థి ... అక్కడ 'కాంప్'కు కావల్సిన 'యూనిఫాం' అవి 'కిట్'లో సర్దుకుంటుంటే, ధనమ్మగారు చూసి 'ఎక్కడిక'ని అడిగారు. విద్యార్థి తనకు పుష్కరాల డ్యూటీ పడిందని చెప్పగానే, 'నాకూ పుష్కరాల్లో స్నానం చెయ్యాలని వుంది. నేనూ వస్తాను' అన్నారావిడ.

ఆవిడ సహజంగా యిలాంటివాటికి వస్తాననే అనదు. అందుకనే పాపం పెద్దది గదా...చూడాలనుకొంటోందేమో ననుకుని రమ్మన్నాడు విద్యార్థి... పుష్కరాలు ఆఖరి రోజుల్లో అంటే, రెండురోజుల్లో ముగుస్తాయనగా వస్తానని ధనమ్మగారంటే సరేనని చెప్పి వెళ్ళిపొయ్యాడు విద్యార్థి తాడేపల్లి కాంప్‌కు.

కానీ ధనమ్మగారికి బందరులో ఒక చిన్ననాటి స్నేహితురాలు వుంది.. ఆవిడను

హరిరామ్



గూడా పుష్కరాలకు బెజవాడ కాకుండా తాడేపల్లికే రమ్మని ఆశచేత జాబు రాయించిన విషయం విద్యార్థికి తెలియదు...

కృష్ణకు బెజవాడ ఒకవైపయితే తాడేపల్లి మరోవైపు వుంది. తాడేపల్లి గుంటూరుజిల్లాలో వుంది. కనుక యిక్కడి రక్షణ ఏర్పాట్లు అన్నీ గుంటూరుజిల్లా అధికారులు చూసుకోవల్సిందే ... మహారాష్ట్రుల యింట పుట్టి తెలుగునేల మెట్టిన ఆంధ్రుల అనుంగుకోడలు కృష్ణవేణమ్మ వొడ్డులనొరసి పారుతోంది. తెలుగు మాగాణాన్ని సస్యశ్యామలంచేస్తూ, పొంగిపరవళ్ళు తొక్కుతూ, హొయలు పోతూ ప్రవహించే ఈ నదీమ తల్లిని చూస్తే ఏ తెలుగువాడి మేను పులకరించదు!...


గాజుల గలగలలతో శ్రీమంతుల యింటి చిన్నకోడలులా మురిసిపోతూ ప్రవహించే కృష్ణవేణిని చూస్తే గుండెలు గుభేలు మనవు, చేతులెత్తి మొక్కాలని అనిపిస్తుంది...అందాలన్నీ ప్రోవుచేసుకున్న ఈ నదీ సుందరిని అలా అలా చూస్తూనే వుండాలనిపిస్తుంది...

విద్యార్థి అడుగులోతు నీళ్ళల్లోకి దిగి దోసిలినిండా నీళ్ళు తీసుకున్నాడు... అతడి ఒళ్ళు పులకరించింది...ఆ దోసిలి నీళ్ళను అప్రయత్నంగా కళ్ళకద్దుకొని వదిలేశాడు... ఎక్కడి పసుపు? ... ఎక్కడి కుంకుమ... ఎక్కడిపండ్లు... ఎక్కడిపూలు ... ఏమిటీ పూజ?...అనిపించిందతడికి...

అవును తప్పేముంది? ... ఈ ప్రకృతి శక్తులు మనకు అన్నం పెడుతున్నాయి...ఈ కృష్ణవేణమ్మ పవిత్రజలంతో తెలుగునేల పునీత మవుతోంది ... తెలుగుదేశం ధాన్యాగారమైంది... అటువంటి తల్లికి కృతజ్ఞత చెప్పకోకుండా ఎలా వుండగలడు మానవుడు?...

పక్కన యిసుకలో పిండిబొమ్మలు కలిపి, ... పిండాలు కాబోలు పెట్టుకుంటున్నారు కొంతమంది. బ్రాహ్మణులు మంత్రాలు జపిస్తుండగా స్నానాలు చేస్తున్నారు మరికొందరు...నదిలో కొంతవరకూ వలలా కట్టారు. యాత్రికులకు ప్రమాదం లేకుండా...ఆ వల కవతల 'లైఫ్‌బోటు'లలో 'సీస్కౌట్లు' తిరుగుతున్నారు తప్పజారి

తాంబూలాల్ని గురించి—



బులుసు వేంకటరమణయ్య—ధర్మపథం

మనదేశంలో తాంబూలానికి ఎంతో ప్రాధాన్యం ఉన్నది. షోడశోపచార పూజలో నైవేద్యానంతరం తాంబూలం వస్తుంది. వసుపువిఘ్నేశ్వరునికి పూజ చేసినప్పుడున్నూ తక్కినవాటికి బదులుగా అక్షతలు సమర్పించినా, నైవేద్య, తాంబూలాలు మాత్రం సమర్పించవలసిందే. తిన్న ఆహారం జీర్ణం కావడానికి తాంబూలం ఆవశ్యకమని వైద్యశాస్త్రంలోనూ ఉన్నది; అనుభవంలోనూ ఉన్నది.

వివాహాదులకు వెళ్లినప్పుడు విందు భోజనం పెట్టినా, తాంబూలం ఇవ్వకపోతే అగౌరవపరచినట్లవుతుంది. భోజనం లేకుండా తాంబూలం యిచ్చినా సంతృప్తి కలుగుతుంది.

వివాహానికి నిశ్చయం చేసుకోవడాన్ని తాంబూలాలు పుచ్చుకోవడమని అంటారు. ఇది తెలుగుదేశంలో అలవాటులో ఉన్న మాట. మద్రాసు ప్రాంతంలో దీన్ని నిశ్చితార్థమంటారు. తాంబూలాలు పుచ్చుకుంటే సరి— తర్వాత ఆ నిర్ణయానికి తిరుగు ఉండదన్నమాట.

మహారాజుల సభల్లో తాంబూలం లభించినదంటే గొప్ప బిరుదాన్ని సంపాదించినకంటే ఎక్కువ మర్యాద సంపాదించినట్లు అర్థం. రాజసభల్లో రెండు తాంబూలాలు పొందడం ఎంతో గౌరవాన్ని కలిగిస్తుందని 'తాంబూలద్వయ మాసనం చ లభతే యః కాన్యకుబ్జేశ్వరాత్' మొదలైన శ్లోకాలవల్ల తెలుస్తూ ఉన్నది.

రాజుల ఆస్థానాలలో ఆస్థాన విద్వాంసులూ, కవులూ వుంటారు. ఆ రాజులు తమ కీర్తి స్థిరంగా ఉండడానికి ఆస్థానవిద్వాంసులను కవులను గ్రంథాలను రచించి తమకు కృతిగా ఇవ్వవలెనని కోరుతారు. అలా కోరేటప్పుడు కవిని సమ్మానించడంకోసం కర్పూర తాంబూలాలు ఇవ్వడం సంప్రదాయం. ప్రభువు కవులకు తాంబూలం ఇచ్చాడంటే—మాట తప్పకూడదని కవులను హెచ్చరించడమన్న మాట.

తెలుగు ప్రబంధాలు చాలా వాటిలో ప్రభువులు తమకు అంకితంగా కృతులను రచించాలని కవులను కోరినప్పుడు 'కర్పూర తాంబూలాలు' ఇవ్వడం కానవస్తుంది.

కవులనే కాకుండా తమ కార్య నిర్వహణకు పూనుకునేవారిక్కూడా తాంబూల మిచ్చే సంప్రదాయం ఉన్నది. ఇది చాలా అరుదుగా కానవస్తుంది. నన్నెచోడుని కుమారసంభవం చూడండి.

శివుని తపస్సును భంగంచేసి, అతనికి పార్వతిపయి అనురాగం కల్గించడానికి పూనుకోవాలని, ఇంద్రుడు మన్మథుణ్ణి కోరేటప్పుడు తన చేతికి తగిన పని లభించినదంటూ మన్మథుడు 'తాంబూలం ఇవ్వా'లని ఇంద్రుణ్ణి అడుగుతాడు. తాంబూలం పుచ్చుకున్నవాడు తప్పకుండా ఆ పని నెరవేర్చి తీరాలి. ఇచ్చేవాడున్నూ, అట్టి సమర్థునికే యిస్తాడు. ●

[illegible]
మారుబడ్డ పిల్లల్ని తల్లిదండ్రుల కప్పగిస్తున్న స్కౌట్స్ కొందరు. మరీ 'రష్'గావుండి త్రోసుకోకుండా, క్రమబద్ధంగా స్నానానికి పంపే స్కౌట్లు కొందరు ... వాళ్ళువాళ్ళు పెట్టుకున్న సామాను గల్లంతు కాకుండా జాగ్రత్తగా కని పెట్టి వున్నారు మరికొందరు...

'వలదాటి దూరంగా పోవద్దు' అనీ, తమ తమ 'సామాన్లు జాగ్రత్త' అని హెచ్చరికలు చేస్తున్నారు అల్లంత దూరంలో చిన్నకొండమీదున్న 'వాచ్ టవర్'నుండి చూస్తున్న స్కౌట్స్, అక్కడున్న పోలీసులు, ఏ. పి. ఆర్. ఓ.లు వరుస వరుసగా...

విద్యార్థికిదంతా చాలా తమాషాగా వుంది ... దేశంలోని పన్నెండు పెద్ద నదులకూ ఏడాదికోనది చొప్పున పుష్కరాలు... అక్కడికి దేశం నలుమూలలనుండీ ప్రజలు వచ్చి స్నానం చెయ్యడం ... భాషా కుల విభేదాలు లేకుండా అందరూ నదీస్నానం చేస్తున్నారు, భక్తితో మునకలేసి, పూజ లర్పించి వెళుతున్నారు...

ఈ పుష్కరాలకున్న పురాణగాథలేవో విద్యార్థికి తెలియవుగానీ ... జాతీయ సమైక్యతా సాధనకు యిది ఒక చక్కని మార్గం అనిపించింది ... జాతి సంస్కృతికి జీవగర్రలాంటి పన్నెండు నదులూ ఈ జాతి వారందరికీ పూజనీయమేనని చాటే ఈ పుష్కరాలకు, జాతిని సంఘటిత పర్చడమే ఆంతర్యమేమో ననిపించింది... వచ్చేపొయ్యే జనప్రవాహంతో ... జడత్వాన్ని వదిలి చైతన్యం పొందినట్లుంది ఆ వూరు వూరంతా...

ఒక ముసలి కాళ్ళముదుసలి, సరిగా కళ్ళు కనబడక, తడుముకుంటూ స్నానానికి వస్తుంటే ... ఆ అవ్వను చెయ్యూతనిచ్చి తీసుకువచ్చి స్నానఘట్టం దగ్గర వదిలాడు విద్యార్థి ... ఆవిడ నెమ్మదిగా స్నానం ముగించుకుని వస్తుంటే, చెయ్యి పట్టుకొని మెల్లిగా తీసుకెళ్ళి, బస్సు ఎక్కించమని మరొకరికి అప్పజెప్పి వచ్చాడు...

తాడేపల్లిలో కూడా ఏర్పాట్లన్నీ పెద్ద ఎత్తున జరిగాయి... అరగంట కొరగంటకూ అన్ని ప్రాంతాలనుండీ బస్సులు...విటువంటి


గోద్రెజ్ వారి క్రొత్త సమర్పణ
ఇప్పుడు బిజ్ క్రొత్త ప్యాక్
ముందు మిగతా శుభ్రపరచే
పౌడర్లన్నిటి ప్యాక్‌లు
వెలవెల బోతున్నాయి
BIZ
CLEANING POWDER
WITH SUPER DETERG
బిజ్ ఈ విశిష్టమైన మళ్ళీ
వాడదగిన ప్లాస్టిక్ ప్యాక్‌లో లభిస్తోంది!
త్వరగా నురుగునిస్తుంది, శీఘ్రంగా శుభ్రపరుస్తుంది. అమోఘమైన డిటర్జెంట్ బిజ్ మీ వంట ఇంటి సామాను, గాజు సామాను, సింకులు, వాష్ బేసిన్‌లు, కమోడుల మొదలైన వాటిని తళతళ మెరిసేటట్లు చేస్తుంది.
ప్యాక్‌ను ఒక్కసారి పరికించండి! పంచ్ చెయ్యబడిన రంధ్రాలు; ఒలిచి తీసివేయగల్గిన మూత; పరిసమానంగా చిలకరిస్తుంది. చెమ్మ ఊరకదు, తుప్పు పట్టదు. మీ షెల్ఫ్‌లో పెట్టినప్పుడు ఎంతో అందంగా కనిపిస్తుంది. మళ్ళీ మళ్ళీ వాడుకోవచ్చును కూడా.
బిజ్-గోద్రెజ్ ఉత్పాదన
BIZ
CLEANING POWDER
'5-రిఫిల్' పొలిబ్యాగ్ నుంచి ఈ మళ్ళీ మళ్ళీ వాడదగిన ప్యాక్‌ను మీరు బిజ్‌తో నింపిన ప్రతిసారి 80 పైసలు ఆదా చేసుకుంటారు! మీకు కచ్చితంగా రు. 4/- ఆదా అవుతుంది.
CMGS-41-203-TL

విద్యార్థి

అంటువ్యాధులూ వ్యాపించకుండా హెల్త్ డిపార్ట్‌మెంట్ తగిన చర్యలు తీసుకుంటోంది. ఈ హడావుడిలో ఎవరిగొడవ వారిదన్నట్లు, ఎవరికివాళ్లు, తమతమ 'స్టాల్స్' పెట్టి ప్రచారం చేసుకుంటున్నారు...

విద్యార్థి మళ్లీ వచ్చి తన పోస్టులో నిలబడ్డాడు. ఇంతలోకే వచ్చారు ధనమ్మగారూ ఆశ...వాళ్లతోబాటు మరో తల్లీ కూతురూ కూడా వచ్చారు. ఆ యింకో ఆవిడకు ధనమ్మగారి వయసే వుంటుంది. ఆవిడ కూతురుకూడా ఆశకంటె రెండేళ్లు పెద్దదయి వుంటుంది...అంతే...ధనమ్మగారు ఆశచేత స్నేహితురాలిని పుష్కరాలకు రమ్మని రాయించిన విషయం విద్యార్థికి తెలియదు...అందుకనే వీళ్లెవరా అని ఆశ్చర్యపోయ్యాడు...ధనమ్మగారు రాగానే కొడుకును పిల్చింది...విద్యార్థి తనడ్యూటీ యింకో స్కౌటుకు అప్పగించి, స్కార్ఫ్ తీసి జేబులో పెట్టుకుని వచ్చాడు.

ధనమ్మగారు కొడుకుని స్నేహితురాలికి పరిచయం చేసింది.. తర్వాత స్నేహితురాల్ని కొడుక్కి పరిచయంచేస్తూ, 'నా స్నేహితురాలు సౌభాగ్యం...ఎప్పుడో నీ చిన్నప్పుడు తీసుకెళ్లాను వీళ్లింటికి...బందరునుండి. తనూ పుష్కర స్నానానికి వచ్చింది... ఇదుగో యీ అమ్మాయి తనకూతురు... మూడోకూతురుట ... పేరేమిటన్నావ్? మాయాదేవి కదూ ... చక్కటిపేరు... చిలకలావుంది పిల్లకూడా...' అని పరిచయం చేస్తుంటే. తల్లి ఆపిల్లను మెచ్చుకుంటోందో, తనకు పరిచయం చేస్తోందో తెలియలేదు విద్యార్థికి. ఆ సౌభాగ్యంగారు తన్ను అలా ఎగాదిగా ఎందుకు చూస్తుందో, యీ పిల్ల పరిచయం చేసేటప్పుడు ఎందుకంతలా మెలికలు తిరిగి పోతోందో...ఏమీ అర్థంకాలేదు విద్యార్థికి.

పైగా బందరులో వున్నవాళ్లు బెజవాడైనా కాక యీ తాడేపల్లి స్నానానికి రావడం పిచ్చి, చాదస్తమూ ... అనుకొని, బహుశా స్నేహితురాలిని కలుసుకోడానికి వచ్చిందేమోలే అని సరిపెట్టుకున్నాడు.

ధనమ్మగారు చెప్పిన వస్తువులన్నీ కొని పట్టుకొచ్చి యిచ్చాడు...స్నానాలు చేసేటప్పుడు పక్కవాళ్ళెవరో ఫోటోలు తీసుకుంటున్నారు ... అది చూసిన ఆశ 'అన్నయ్యా మనకూ కూడా ఒకఫోటో తీస్తే రేమో అడుగుదామా?' అంది ... 'వాళ్ళు వళ్లో మన కెందుకు తీస్తారమ్మా... వుండు.' అంటూ వెళ్లి కెమెరా వున్న బ్రదర్‌స్కౌట్ నడిగి తెచ్చి ఫోటోలు తీశాడు...మాయకు కూడా తియ్యమని అడిగింది ఆశ.

మోకాలు లోతు నీళ్లల్లో తడితలతో, తడిసిన బట్టలతో వున్న మాయకు ఫోటో తీస్తుంటే, ఆ అమ్మాయి సిగ్గులో మరీమరీ కుంచించుకు పోతుంటే, తనేమన్నా పెళ్ళి చూపుల కొచ్చిన పెళ్ళికొడుకు ననుకుంటున్నదా ఏం...అంతలా భూమిలో కృంగిపోడానికీ...అంటూ చిరాకు పడ్డాడు విద్యార్థి.

స్నానాలయ్యాక అందర్నీ తీసుకుని అక్కడున్న వివిధ స్టాల్స్‌కూ తీసుకెళ్ళి చూపించాడు...తిరా బయలుదేరబోయ్యేటప్పుడు...సౌభాగ్యమ్మగారు ధనమ్మగారిని తనవెంట బందరు రమ్మని, రెండురోజులుండి పోవచ్చని పిల్చింది...ఇప్పుడెందుకులేమ్మా అని విద్యార్థి అంటున్నా విన్పించుకోకుండా ధనమ్మగారు కూడా బందరు వెళ్ళడానికే నిశ్చయించుకుంది ... పైగా పుష్కరాలు అయిపోగానే కొడుకును తనను తీసుకు వెళ్ళడానికి బందరు రమ్మని చెప్పి వెళ్లిపోయింది.

(ఇంకా ఉంది)

ఒక వారం విపరీతం

ఫాలాక్షుడు

జైల్లో ఉరేసుకున్న ఖైదీ

అ లగానతం గ్రామంలో పొన్నుస్వామి అనే ఆయనకు చెందిన వో మిల్లులోంచి అర బస్తా వేరుశనగపప్పును తస్కరించిన కారణాన్న 58 ఏళ్ళ పళని అనే ఆయనను, మరో ఖుద్దర్నీ నామక్కల్ జైలులో పెడితే, ఆ రాత్రి పళని చేతి కందిన వో తాడుతో జైలు కిటికీకి వురి పోసుకుని ప్రాణాలు వదిలేశాడట.

ఆకాశరామన్న ఉత్తరం—నూతిలో శవం

తమకు వచ్చిన వో ఆకాశ రామన్న రాసిన ఉత్తరాన్నాధారంగా తీసుకుని తిన్నగా వెళ్ళి చూస్తే వో నూతిలో శవం కసుపించిందట పోలీసులకు. ఆంధ్ర ప్రదేశ్ మడకసిర తాలూకా గుడిబండకు చెందిన హనుమక్క అనే ఆమెద టా శవం. ఆమెను ఎవరో పీకనొక్కి చంపి, అయిదు మణుగుల బరువుకల రాయితో సహా ఆ శవాన్నో గోనె సంచిలో వేసి కట్టి ఆ నూతిలో పడేశారట. దర్యాప్తులవల్ల కలిన అనుమానాలతో పోలీసులు హనుమక్క భర్త బండప్పను, మరో ముగ్గుర్నీ అరెస్టు చేశారట.

అవమానం భరించలేక ఆత్మహత్య

తమిళనాడుకు చెందిన ఇళైయాంపుత్తూరు అనే వూరిలో 30 ఏళ్ళ భాగ్యతాయి అనే ఆమె భర్త వేరే వుద్యోగరీత్యా చాలాకాలంగా వేరే వూరిలో వుండడంవల్ల ఆవిడ అదే వూరుకు చెందిన వో వ్యక్తితో రహస్య సంబంధం పెట్టుకుందట.

విషయం ఆమె మామగారికి తెలిసి, నాలుగు చీవాట్లు వేశాడట. ఈ అవమానాన్ని భరించలేక, భాగ్యతాయి తన 7 ఏళ్ళ కూతురుకు విషం పెట్టి చంపి, ఆనక తానూ తిని, ఆత్మహత్య చేసుకుందట.

కారణం తెలియని మూడు దారుణాలు

తమిళనాడుకు చెందిన శంకరర్ కోవిల్ అనే వూరిలో లక్ష్మణకోనార్ అనే 58 ఏళ్ళాయన తన పొలంలో పని చేసుకుంటుండగా ఎవరో కొందరు వెళ్ళి ఆయన తల నరికి పారేసిపోయారట. అక్కడ నుంచి ఆ వూరుకు వో మైలు దూరంలో వున్న తిరుగుప్పుదూర్ అనే వూరుకు వెళ్ళి అక్కడ మేకలు, గొర్రెలు కాసుకుంటున్న శంకరలింగం అనే 20 ఏళ్ళ కుర్రాడి తల కూడా అదే పద్ధతిలో నరికి, అంతతో ఆగక, అతని ఒళ్ళంతా కుళ్ళ పొడిచి చంపి, అక్కడ నుంచి వో పొలంలో పని చేసుకుంటున్న 60 ఏళ్ళ శివనుకోనార్ అనే ఆయన తల కూడా నరికి పోయారట. ఈ మూడు దారుణాలూ ఒకే వ్యక్తిగానీ ఒకే ముఠాకానీ చేసి వుండాలనీ నిర్ణయించి పోలీసులు యీ భయంకర హంతకుల కోసం గాలిస్తున్నారట.

బెంగుళూరు సదాశివ నగరులో వుంటున్న ఒకాయన తనిద్దరి తమ్ముళ్ళ సహాయంతో తనతో

గత రెండేళ్ళుగా సహజీవనం చేస్తున్న పుష్ప అనే అమ్మాయి మీద 12 వ తేదీ వుదయం 5—30 గంటలకు కిరసనాయిలు పోశాడట. ఆ సమయంలో ఆ అమ్మాయి నిద్రపోతువ్వడల్లా కిరసనాయిలు వాసనకు మెలకువొచ్చిందట. దాంతో బలవంతాన్న ఆమెను పట్టుకుని, మీద అగ్గిపుల్ల గీసి, పడేశారట. ఒళ్ళంతా కాలిపోయిన ఆమె చనిపోయే ముందు పోలీసులకు యీ విషయాన్ని చెప్పి, చనిపోయిందట.

అమన్‌లో క్షవర కళ్యాణం

అరబ్బు సాంప్రదాయానికి విరుద్ధంగానూ పురుష లక్షణాలకు, పురుష ప్రకృతికి విరుద్ధంగానూ యిష్టారాజ్యంగా జుట్టు గిరజాలు పెంచడం వుహించరాని నేరమని కింగ్ హుస్సేన్ అమన్‌లో అన్నారట. అంతేగాక, రోడ్ల వెంట పొడుగు జుట్టుతో తిరిగే యువకులను రక్షకభటులు పట్టుకుని, బలవంతంగా క్షవరం చేయించి మరీ వదులుతున్నారట. కొన్ని వందల మంది కుర్రాళ్ళకు అమన్‌లో యీ క్షవర కళ్యాణమహోత్సవం జరిగిందట.



జీవితంలో నిరాశ— ప్రేమికుల ఆత్మహత్య

తిరువనంతపురానికి చెందిన 23 ఏళ్ళ రహీం ద్రస్, 19 ఏళ్ళ చంద్రికాదేవి అనే యిద్దరు ప్రేమికులుగురువాయూరు వెళ్ళి అక్కడ హోటల్లో వో గది తీసుకుని వున్నారట. ఆ మర్నాడు తెల్లవారి ఎంతసేపైనా తలుపులు తెరవకపోయేసరికి యీ విషయంలో పోలీసులు జోక్యం కలుగజేసుకుని తలుపులు పగలేసి చూస్తే లోపల ఆ యిద్దరూ చనిపోయి వున్నారట. పక్కనే వారు ఖాళీచేసిన విషం సీసా, ఆ పక్క నో వుత్తరం వున్నాయట. వుత్తరంలో, 'మేము జీవితంలో నిరాశ పొందాము. కనుకనే యీ నిర్ణయాని కొచ్చాము. మా రెండు శవాలూ ఒకే చోట పాతి పెట్టండి. ఇష్టానిష్టాల్ (లేకపోతే) మా వాళ్లకు వప్పగించండి' అని వుందట.

బస్సు ప్రమాదంలో విద్యార్థి మరణం

మద్రాసు మాంబళం మహమ్మదుస్సాన్ రోడ్డు కోడంబాకం హైరోడ్డు కలిసినచోట సైకిలు రోడ్డు వారగా ఆపుకుని సైకిలు క్యారేజి మీది పుస్తకాలు సరిచేసుకుంటున్న మోహన కృష్ణయ్య అనే బియస్సీ విద్యార్థిని వో బస్సు వచ్చి గుద్దిందట. అతన్ని సర్రున తీసుకుపోయి పక్కనే వున్న వో గోడకి నొక్కిందట. ఆ నొక్కుడుకి ఆ గోడ పడిపోయి తీవ్ర ప్రమాద స్థితిలో అతన్ని ఆసుపత్రిలో చేర్చాక చనిపోయాడట.

బాడుగ అడిగిన ఆటో డ్రైవర్‌ని హత్య చేసిన ప్రయాణీకుడు

ఢిల్లీలో గురుచరణ్ సింగ్ అనే వో ఉత్సాహవంతుడు కన్నాట్‌ప్లేస్‌నుంచి ఫ్రాష్‌ఖానాకు ఆటో రిక్షాలో వెళ్ళి డబ్బు లివ్వకుండా దిగి చక్కా పోబోతుంటే ఆ రిక్షా ఆతను అదే ముక్క అడిగాడట. దాంతో గురుచరణ్ సింగ్‌కు గుర్రున కోపంవచ్చి కత్తితో పొడిచి, ఆ డ్రయివర్ని చంపి, తను అంతర్ధానమైపోయాడట.

సోఫియాలారెన్‌ని బెదిరించిన పిచ్చివాడు

రోమ్‌కు సమీపంలో అల్బానొ కొండలలో మారినోవద్ద వున్న తన యింటి తోటలో పిల్లాడిని ఒళ్లో పెట్టుకుని హాలీవుడ్ నటి సోఫియా లారెన్ కూర్చునుండగా (18 వ తేదీన) వో వ్యక్తి వో చేతిలో ఆమె ఫోటో, మరో చేతిలో గొడ్డలితో సర్రున దూసుకుంటూ వస్తూ 'నీ నాలుగేళ్ల కుర్రాణ్ణి నా కప్పగించు. లేకపోతే, అనరిచాడట. దాంతో ఆమె, ఆమె భర్త కార్లోపాంటీ తమ కొడుకుతోసహా గమ్మున వో గదిలోకి పారిపోయి దాక్కున్నారట. పనివారిచ్చిన రిపోర్టుతో పోలీసులొచ్చి ఆ పరశురాముణ్ణి పట్టుకున్నారట. అతని పేరు సేవిన్లాడో అపోలోనీ అనీ, అతనికి చిత్తభ్రమణం వుందనీ నారన్నారట—అయితే మాత్రం గొడ్డలికి చిత్తభ్రమణం ఉండదూ!

మార్క్సిస్టు వ్యక్తి హత్య

త్రిచూరులో ట్రాన్సుపోర్టు బస్టాండు సమీపంలో వున్న ఓ హోటలుముందు 35 ఏళ్ళ అలికోడన్ రాఘవన్ అనే ప్రముఖ మార్క్సిస్టు వ్యక్తి 23 వ తేదీ అర్ధరాత్రి నించునుండగా ఎవరో గుర్తు తెలీని వ్యక్తి ఆయన్ని కత్తితో పొడిచి చంపి, పారిపోయాడట.

అరబ్ దేశానికి ఎగుమతి అవుతున్న అమ్మాయిలు

భారతదేశపు కన్నెలమీద ఆరబ్‌దేశం కన్నేసిం దేనాడో. బొంబాయిని కూడలిగా చేసుకుని మన దేశంలోని ఆడపిల్లలను యీ ఆరబ్ దేశాలు తరలించే వ్యాపారం జోరుగా జరుగుతోందట. ఆంధ్ర, తమిళనాడు, మైసూరు రాష్ట్రాలకు చెందిన యవ్వనంలో వున్న అమ్మాయిలనూ, నడి వయస్సులో వున్న మహిళలనూ అరబ్బు దేశాలలో ఆయాలుగా పని మనుషులుగా, కొండొకచో అన్నిటికీ ఉపయోగపడేలావుండేలా తీసుకు పోతున్నారట. ఈ నెలలో బొంబాయినుంచి బయల్దేరిన ద్వారక అనే ఓడలో సుమారు 200 మంది అమ్మాయిలు వున్నారట. కువైట్‌కు వెళ్ళే 280 మందిలో సుమారు 184 మంది స్త్రీలున్నారని, బ్రహెయిన్‌కు వెళ్ళేవారిలో 29 మంది స్త్రీలున్నారనీ ప్రయాణ విషయాలను చూసే సంస్థ అన్నదట. ఆంధ్ర, తమిళనాడులనుంచి తీసుకుపోయే స్త్రీలలో 80 శాతం పెళ్ళయినవారేనట.

బెదిరింపు ఉత్తరాలు — క్యాషియర్ ఆత్మహత్య

'దొంగ నోట్లను మార్చడానికి సహాయం చెయ్యకపోయావో.......' అని తనను బెదిరిస్తూ ఎవరో ఉత్తరాలు రాశారని ఏలూరు స్టేట్ బ్యాంకు తాత్కాలిక క్యాషియరు నూతిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడట. ఈయన యీ విషయాన్ని బ్యాంకు ఏజంటుకు, జిల్లా కలెక్టరుకు ఉత్తరాల ద్వారా తెలియపరచారట.

విడాకులకు చిట్కా

నాసిక్‌కు చెందిన మారుతి అనే మహారాష్ట్ర యువకుడు తన భార్య ఇందుబాయికి విడాకు లివ్వాలని విశ్వప్రయత్నం చేసి, ఆమె ఒప్పనందువల్ల కుదరక, మరో మంచి పద్ధతి ఆలోచించాడట. ఈయనకు యీ సరికొత్త పద్ధతిలో తల్లీ,తమ్ముడూ చేయూత నిచ్చారట. ఆ పథకం ప్రకారం మారుతి తనతల్లిని, తమ్ముడినీ, భార్య ఇందుభాయినీ తీసుకుని సినిమాకని బయల్దేరి రైలు ఎక్కారట. రైలు బయల్దేరే వేళ్టికి ఇందుబాయిని రైల్లో వదిలేసి, వారు ముగ్గురూ ఎంచక్కా దిగిపోయారట. ఆ రైల్లో ఓ మూల నుంచున్న ముగ్గురు పెద్ద మనుష్యులామెను బొంబాయి లాక్కుపోయి ఓ పాకలో బంధించి, అదేమంటే 'మీ ఆయన దగ్గర తీన్నూ నాలుగు వేలకు కొనుక్కున్నాం' అన్నారట. వారామెను లాభానికి అమ్మడానికి ప్రయత్నాలారంభించారట. అదృష్టవశాత్తూ ఆమె ఓ ముష్టివాని సహాయంతో ఆ చెరనుంచి తప్పించుకుని పోలీసుస్టేషనుకు వెళ్ళి జరిగిందంతా చెప్తే, వారామెను నాసిక్‌లో వున్న ఆమె తల్లిదండ్రులింటికి చేర్చారట. నాసిక్‌లో మారుతి తన భార్య కనబడుటలేదని ఇరుగు పొరుగులతో చెప్పి, ఆనక పోలీసుల క్కూడా ఫిర్యాదు చేసుక్కూర్చున్నాడటెంచక్కా— దీని భావమేమి!... ఏమో !!........

హంతకుడి పరారీ

గుంటూరు జిల్లా ఇనప్పరాజిపల్లి గ్రామానికి చెందిన చెల్లా చినసుబ్బయ్యను సెప్టెంబరు 25 వ తేదీన ఎవరో హత్య చేశారట. అతన్ని చంపి, ఆయన సత్తుగారిని కూడా చంపబోతుండగా ఎవరో కొందరడ్డొస్తే ఆ హంతకుడు పరారైపోయాడట.

కోళ్ల మీద పిడుగు

కడపకు నాలుగువేళ్ళ దూరంలో వున్నబుడ్డాయపల్లె గ్రామసమీపంలో సెప్టెంబరు 27 వ తేదీన ఓ కోళ్ళ కేంద్రం మీద పిడుగు పడి, 150 కోళ్ళతోసహా ఆ కేంద్రం భస్మీపటలమైపోయిందట.

శాంతికోసం ఆత్మహత్య

హిందీ నేర్చుకోడానికి సెప్టెంబరు 18వ తేదిన వచ్చి ఢిల్లీ ఇంటర్నేషనల్ సెంటర్లో వుంటున్న అకీకోసెకెహరా అనే జపాను వనిత 26 వ తేదీన బట్టలకు నిప్పంటించుకుని, ఆత్మహత్య చేసుకున్నదట. బట్టలకు నిప్పంటుకున్నాక, ఆమె ఆ భవనం మీంచి చెంగున దూకేసిందట. ఆమె డైరీలో 'నేను భగ్నహృదయినయ్యాను. ప్రపంచానికంతా కావలసింది శాంతి. స్వేచ్ఛలేని జీవితం వ్యర్థం'. మార్క్సుడు చాలా మంచివాడే. కానీ మనుగడకు చంద్రుడు కూడా ముఖ్యం కదా' అని రాసి వుందట— అనగా ఏమి !!

పెళ్లికొడుకు హత్య?

పాండిచ్చేరి మాజీ కాంగ్రెసు మంత్రి యుస్సెఫ్ ఇస్మాయిల్ కుమారుడు 25 ఏళ్ళ మహమ్మద్ గఫేసుల్లా అనే అతనికి, పార్వీన్‌బాను అనే అమ్మాయికీ తిరుచ్చిలో సెప్టెంబరు 25వ తేదీన వివాహం అయ్యిందట. ఆ రాత్రి భార్యాభర్తలిద్దరూ తిల్లైనగర్‌లో ఓ యింట్లో వున్నారట. తెల్లారి బాత్‌రూములో పెళ్ళికొడుకు శవం వుందట. మెడ చుట్టూ ఓ పట్టు కండువా వంటిది చుట్టబడి వుందట. ఇది హత్యా, ఆత్మహత్యా అని అనుమానించి చివరికి ఆత్మహత్యేనని పోలీసు నిర్ణయించింది.

చావు తప్పించి చావు

మద్రాసులో 22 ఏళ్ళ తణికైమణి అనే నిరుద్యోగి మంగంబాకం, చెట్‌పట్ స్టేషనుల మధ్య రైలు పట్టాల మీద పరధ్యాన్నంగా నడుస్తుండగా ఎదురో రైలు వచ్చిందట. దాంతో అతను కంగారుపడి, ఆ రైలు బ్రిడ్జిమీంచి 'కూవం' నదిలోకి దూకేశాడట. ఆ నదిలో నీరులేనందున తల నేలకు కొట్టుకుని, చితికిపోయి, అతనక్కడికక్కడే చచ్చిపోయాడట.

గేయాల రచయితలకి మనవి

ఆంధ్రసచిత్రవారపత్రికకి గేయాలు పంపేవారు వీలయినంతవరకూ 15 పంక్తులు మించనివి పంపగోరుతాము.

—సంపాదకుడు.

ఒకవారం విపరీతం

ఒక అనుమానం—రెండుచావులూ

అయ్యంతాంగల్ అనే వూరికి చెందిన 25 ఏళ్ళ బత్తినరెడ్డికి 5 ఏళ్ళ క్రితం లక్ష్మి అనే ఆమెతో వివాహం అయ్యిందట. వారికి 2 న్నర ఏళ్ళ కొడుకు కూడా వున్నాడట. బత్తినరెడ్డికి క్రమేణా తన భార్య ప్రవర్తన మీద నమ్మకం పోతూ వచ్చిందట. అదే విషయం మీద వారిరువురూ చాలాసార్లు పోట్లాడుకున్నారట కూడా. వో రోజిద్దరూ కలసి గడ్డి కోసుకుని, పొలం నుంచి తిరిగి వస్తుండగా, బత్తినరెడ్డి వెనకనడుస్తున్న వాడల్లా కొడవలితో ఆమె పీకమీద రెండు వేట్లు వేశాడట. లక్ష్మి అక్కడికక్కడే రక్తపుమడుగులో గిలగిలా తన్నుకుని చనిపోయిందట. బత్తినరెడ్డి యింటికి వచ్చి ఎండ్రిను త్రాగి ఆత్మహత్య చేసుకున్నాడట.

లారీకింద ఇద్దరు హరీ

బెంగుళూరు యశ్వంతపురంలో అతి దుడుకుగా వస్తున్న వో లారీ 28వతేదీ సరైన వంపు తిరగబోయి, అంతపనీ చేయలేక, అందులో సగమే చేసి, అడ్డొచ్చిన వో ఫ్యాక్టరీ గేటుమీద విరుచుకు పడ్డదట. ఆ పాటుతో ఫ్యాక్టరీ గేటు విరిగి, అక్కడే నిలబడున్న వో యిద్దరు కుర్రాళ్ళమీద పడిందట. 15 ఏళ్ళ సత్తార్ అనే కుర్రాడు ఆపాటుకి అక్కడికక్కడే చనిపోయాడట.

రైలుముందా కుప్పిగంతులు!

23వ తేదీరాత్రి 7—30 గంటలకు పార్కు ఎలక్ట్రిక్ రైలు స్టేషను నుంచి బయలుదేరుతున్న రైలుముందో ఆసామి కుప్పించి దూకాడట. దెబ్బతో ఆయన శరీరం ఛిన్నాభిన్నమైపోయిందట. ఆయనెవరో ఎందుకలా చేశారో పోలీసులు వెతుకుతున్నారు.

ప్రశ్నావళి

(51 వపేజీ తరువాయి)

బి. ఆర్, జగిత్యాల

స్కూలుఫైనలు పరీక్ష నాల్గుసార్లు రాసి ఉత్తీర్ణుడను కాలేకపోయాను. ఇకపై నాకు అదృష్టం వుంటుందంటారా?

ఏమో. ఎవరు చెప్పకలరు (బదర్, ఐదోసారి అదృష్టం తిరగవచ్చు! ప్రయత్నించు.

ఎ.ఎస్.ఎన్.వి.కె, పార్వతీపురం

ఉత్తరాలు, కథలు, వ్యాసాలు రాసి పత్రికకు పంపేటప్పుడు — ఇండియన్ యింకునే వాడాలా?

అక్కర్లేదు. ఒక్క బొమ్మలకే వాడాలి. అవి బ్లాకు చేయించాలి కనుక—

ఆలోచించవలసిన...

(16వ పేజీ తరువాయి)

బలి

కొంతమంది ఆంధ్రనాయకుల రాజకీయ ప్రయోజనం కోసం ఏ పాపం ఎరగని వింతమందో ఆంధ్రులు ఈరోజున 'బలి' అయిపోతున్నారు. ఆంధ్రప్రదేశ్ సమగ్రత కాపాడడానికి పదవీత్యాగం చేశానన్నారు బ్రహ్మానందరెడ్డి — వారు చివరకి ఫైనాన్స్ కమీషన్ ఛైర్మన్ అయ్యారు. రాష్ట్ర సమగ్రతా పరిరక్షణే తన ధ్యేయం అన్నారు పి. వి. నరసింహారావు—తెలంగాణా ప్రాంతీయులకు విశేషావకాశాలు లభిస్తున్నాయి ఇప్పుడు.

ప్రత్యేక తెలంగాణా నినాదం గరీబీ హఠావో నినాదంలో వినిపించకుండా పోయింది. ప్రత్యేకరాష్ట్రం లేకపోయినా ప్రత్యేకరాష్ట్రం వుంటే వచ్చేలాభాలు తెలంగాణా ప్రజలకు కలుగుతున్నాయి. స్వరాష్ట్రంలో పరాయివాడయిపోయాడు ఆంధ్రుడు. ఆంధ్రుడు హైద్రాబాద్‌లో నాన్—ముల్కీ, అనగా విదేశీయుడు!

ప్రస్తుతం దేశంలో ఒకవిధమయిన ఐకమత్యం కనిపిస్తోంది. ఈ ఐకమత్యానికి ఆంధ్రప్రదేశ్‌లో విఘాతం కలగకుండా వుండడానికి ఆంధ్రప్రదేశ్‌లోని పన్నెండు జిల్లాల ఆంధ్రప్రాంతము విడిపోయి తిరిగి ఆంధ్రరాష్ట్రంగా ఏర్పడడము శ్రేయస్కరం. ఏతావాతా ఏర్పడే తెలంగాణాలో గాని, ఆంధ్రరాష్ట్రంలోగాని ఉద్యోగాలు 'సన్స్ ఆఫ్ ది సాయిల్'కి ఇవ్వాలనే ఉద్యమం బయలుదేరినా ఆ ఉద్యమం వలన ముల్కీ రూల్ వలన సంభవించిన పరిణామాలు సంభవించవు.

దేశంలో అగ్రన్యాయస్థానం నిర్ణయానికి తిరుగులేదు. ముఖ్యమంత్రి నరసింహారావు సుప్రీంకోర్టు నిర్ణయాన్ని 'తుది నిర్ణయం'గా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి న్యాయశాస్త్ర కోవిదులు. ముఖ్యమంత్రి వ్యాఖ్యకే తిరుగులేదు. ఇది ఆంధ్రులు ఆలోచించవలసిన విషయమదే.

—శ్రీ. ప్రసాద్

విచిత్రబంధం

సంధ్య (వాణిశ్రీ) అనే అమ్మాయి మాధవ్ (నాగేశ్వరరావు) అనే అబ్బాయి మీద కోపం పెట్టుకుని అతనిని ప్రేమించినట్లు నటించి అతనిని అవమానించి, అనుకోకుండా అతని చేతనే బలాత్కరింపబడి, అతని శిశువుని కని, అతని ప్రేమని ఇంతకాలం తిరస్కరించి, అష్టకష్టాలూ పడి చివరికి అతనిని వివాహం చేసుకున్న కథ అన్నపూర్ణా ఆర్ట్ పిక్చర్స్ వారి విచిత్రబంధం చిత్రానికి ఆధారం.

ఈస్ట్‌మన్ కలర్‌లో తీసిన ఈ చిత్రంలో ఎస్. వి. రంగారావు, గుమ్మడి, నాగయ్య, అల్లు రామలింగయ్య, పద్మనాభం, రాజ్ బాబు, మాస్టర్ రమేష్,



'విచిత్రబంధం'లో వాణిశ్రీ.

అంజలీదేవి, సూర్యకాంతం, రమాప్రభ, లీలారాణి, రాధాకుమారి కూడా నటించారు.

అవుట్‌డోర్ షూటింగ్ చాలా కేరళలో జరిగింది. గుమ్మడి, అల్లు రామలింగయ్య 'విలన్'ల పాత్రలు నిర్వహిస్తే, పద్మనాభం, రాజ్‌బాబు, సూర్యకాంతంలు హాస్య పాత్రలు నిర్వహించారు.

కథ యద్దనపూడి సులోచనారాణి నవల 'విజేత' అనుసరించి తయారుచేసినది. మాటలు : ఆచార్య ఆత్రేయ; సంగీతం : కె. వి. మహాదేవన్; ఛాయ : సెల్వరాజ్; కళ : జి. వి. సుబ్బారావు. దర్శకత్వం : ఆదుర్తి సుబ్బారావు; నిర్మాత : దుక్కిపాటి మధుసూదనరావు; విడుదల : అన్నపూర్ణా ఫిలింస్. — ఓ. న.

గ్రంధాలయపితామహుడు

(పుస్తకాలే లేకపోతే మన జీవితం ఎలాగ ఉంటుందో ఊహించటం కూడా కష్టం! పుస్తకాలని అందరికీ అందుబాటులో ఉండేందుకు గ్రంధాలయాలు కావాలి. నేటి ప్రపంచంలో అభివృద్ధి సాధనలలో గ్రంధాలయాలు ముఖ్యమయిన పాత్ర వహిస్తున్నాయి.

గ్రంధాలయ నిర్వహణ వట్టి 'కళ' కాదు. అదీ ఒక శాస్త్రమే. ఇటీవల చనిపోయిన ఒక భారతీయుడు శ్రీ షియాళి రామమిత్ర రంగనాధన్ 'లయిబ్రేరీ సయిన్సు' లేక గ్రంధాలయ శాస్త్రంలో ప్రపంచ ఖ్యాతి కలవారు.)

షియాళీ తంజావూరుజిల్లాలో ఒక చిన్న ఊరు. ఇదొక ప్రసిద్ధమయిన పుణ్యక్షేత్రం. శ్రీ రంగనాధన్ జన్మించారు ఇక్కడే. 12-8-1892 లో జన్మించారు.

పాఠశాల విద్యాభ్యాసం ఇక్కడే జరిగింది; మదరాసుకి వెళ్ళి అక్కడ క్రిస్టియన్ కాలేజిలో గణితశాస్త్రంలో ఎమ్.ఏ. డిగ్రీ పుచ్చుకుని 1923 దాకా గణితశాస్త్రంలో ప్రొఫెసరుగా పనిచేశారు.

ఆ తరువాత ఆయనకి గ్రంధాలయ నిర్వహణమీదకి ఆసక్తి అధికం అయి 1924 లో మదరాసు విశ్వవిద్యాలయ గ్రంధాలయానికి అధికారి (లయిబ్రేరియన్)గా నియమింపబడ్డారు. ఇది ఆయన జీవితచరిత్రలో మలుపుతిరిగినరోజు, భారత దేశం గ్రంధాలయాభివృద్ధి చరిత్రకూడా మలుపుతిరిగినరోజు. ఒక సుదినం.

లండన్

ఈ ఉద్యోగంలో చేరిన అనతికాలంలోనే ఆయన గ్రంధాలయశాస్త్రంలో ఉన్నత శిక్షణ పొందటానికని విశ్వవిద్యాలయంవారు శ్రీ రంగనాధన్‌ని లండనుకి పంపించారు. ఆయన అక్కడ 1925 దాకా ఉండి తిరిగి వచ్చారు.

1924 నుంచి 1943 దాకా శ్రీ రంగనాధన్ మదరాసు విశ్వవిద్యాలయ గ్రంధాలయానికి అధికారిగా పనిచేశారు. ఆయన హయాములో ఈ గొప్ప గ్రంధాలయంలోని పుస్తకాల వర్గీకరణం పూర్తిగా మారిపోయింది. ఎవరికి, ఎప్పుడు, ఏ విషయం గురించి ఏ గ్రంథం కావాలన్నా అతివేగంగా తెలుసుకునే సమాచార పద్ధతి అని ఆయన ప్రవేశపెట్టారు.

బెంగుళూరు

1947 లో ఢిల్లీ విశ్వవిద్యాలయం వారు ఆయనని తమ గ్రంధాలయశాఖకి అధిపతులు కమ్మని ఆహ్వానించారు. 1954 దాకా శ్రీ రంగనాధన్ ఢిల్లీలో ఉండిపోయారు. కొంతకాలం విక్రమ్ విశ్వవిద్యాలయంలో పనిచేసి, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌వారి సహాయంతో బెంగుళూరులో డాక్యుమెంటేషన్ రిసెర్చి ఎండ్ ట్రెయినింగ్ సెంటర్‌ని నెలకొల్పి దానికి జాతీయ పరిశోధనాచార్యులుగా ఉంటూ ఉండిపోయారు.

'కోలన్ క్లాసిఫికేషన్' అనే గ్రంధ వర్గీకరణ పద్ధతి ఆయన సృష్టించినదే. 'ఛెయిన్ ప్రొసీజర్' అనే గ్రంధాలయ సూచిక తయారుచేసే పద్ధతిని కూడా ఆయన తయారుచేశారు. బ్రిటన్‌లో నేడు దీనిని వాడుతున్నారు.

శ్రీ రంగనాధన్ కృషి కేవలం శాస్త్ర పరిశోధనలోనేకాక కార్యాచరణలో కూడా చెప్పలేనంత ఉంది. గ్రంధాలయశాస్త్రం యొక్క ప్రాధాన్యతని గుర్తించి దానికి సంబంధించిన శాఖలు, పరిశోధన, క్రమ శిక్షణ దేశం అంతా వ్యాపింప చేశారు.

ఆయన 60 పుస్తకాలపయిన రాశారు; 2000 పయిన వ్యాసాలు రాశారు.

దాత

శ్రీ రంగనాధన్ ఉదారులు, దాత. తమ ఆర్జనలోనుంచి లక్షరూపాయలు తమ సతీమణి శ్రీమతి శారదపేర ఒక ప్రొఫెసర్ పీఠానికి విరాళం ఇచ్చారు.

1957 లో భారతదేశం వీరికి పద్మశ్రీ బిరుదు ఇచ్చింది. విదేశ విశ్వవిద్యాలయాలు ఎన్నో గౌరవపట్టాలు ఇచ్చాయి.

నిరక్షరాస్యతని నిర్మూలించటానికి మన దేశంలో సర్వతోముఖ కృషిచేస్తున్న వారందరికీ శ్రీ షియాళి రామమిత్ర రంగనాధన్‌గారి పేరు చిరస్మరణీయం. వారి జీవితంలో సాధించినది అంతా ప్రపంచంలో వివిధ గ్రంధాలయాలద్వారా శాశ్వతమయిన చిహ్నాలుగా నిలిచిపోతాయి.

—పర్వతనేని గంగాధరరావు

(మదరాసు విశ్వవిద్యాలయంలో గ్రంథశాస్త్ర శాఖలో రీడర్.)

అవీ – ఇవీ . . .

క్లినిక్ షాంపూ

టాయిలెట్ వస్తువులను చాల నాటినించి తయారు చేసే హిందుస్థాన్ లివర్ వారు ఇప్పుడు 'క్లినిక్ షాంపూ'ను విడుదల చేశారు.

తలలో వుండే చుండ్రును పోగొట్టడానికి ఈ షాంపూ బాగా ఉపయోగిస్తుంది. శిరోజాలకు హాని కలక్కుండా తలని శుభ్రపరిచే షాంపూలలో ఈ 'క్లినిక్ షాంపూ'దే అగ్రస్థానం. కలకత్తాలోని వాలుగేళ్ళ నుండి వాడకంలో వుంది. ఇప్పుడు దక్షిణాదిలో కూడా విరివిగా దొరుకుతున్నది.

గీతాగాన ప్రవచనం

బొంబాయి ఎయిర్ ఇండియా ఆంధ్రమహిళా సంఘం ఆధ్వర్యంలో సియా గురుకుల్ వ్యవస్థాపకులు అఖిల భారత యోగసమాఖ్య సభ్యులు, యోగ విద్యా సంఘం కార్యదర్శి యోగాచార్య విద్యావిశారద శ్రీమాన్ అద్దంకి శ్రీరంగాచార్యులువారు 18-9-72నుంచి పదిరోజులు గీతాగాన ప్రవచనం చేసిన సందర్భంలో వారిని ఎయిర్ ఇండియా ఆంధ్ర మహిళా సంఘం ఘనంగా సన్మానించింది. యోగాసన తరగతులు కూడా శ్రీ ఆచార్యులవారు నిర్వహిస్తున్నారు.

కార్యదర్శి
ఎయిర్ ఇండియా ఆంధ్ర మహిళా సంఘం,
బొంబాయి

మద్రాసులో


'మరో మొహంజదారో'

కళాసాగర్ (మదరాసు) అధ్వర్యంలో సెప్టెంబరు 18న హైదరాబాదు విద్యానగర్ కల్చరల్ ఎసోసియేషన్ వారు మదరాసులోని మ్యూజిక్ ఎకాడెమీలో మరో మొహెంజోదారో నాటకాన్ని ప్రదర్శించారు.

ఈ ప్రదర్శనకి పలువురు ప్రముఖులు సినీనటీనటులు దర్శక నిర్మాతలు హాజరైనారు.

భారీ ఎత్తున విజయవంతంగా ప్రదర్శింపబడిన ఈనాటకంలో శ్రీయుతులు పి. శ్రీరామ్, జి. రామమూర్తి, జె. ఎల్. నరసింహారావు, జి. వి. సుబ్బారావు, చంద్రశేఖర్, ఇ. ఎల్. నరసింహారావు, డి. సోమేశ్వరరావు, కుమారి శ్యామల నటించారు. నటీనటులందరూ చక్కగా నటించి ప్రేక్షకుల మెప్పు నందుకున్నారు. శ్రీ ఎన్. ఆర్. నంది రాసిన ఈ నాటకానికి శ్రీ సి. శ్రీరాములు దర్శకత్వం వహించారు. సంగీతాన్ని శ్రీ మురళీమోహన్, నేపధ్యాన్ని శ్రీ మోహన్ రాజు అందించారు. (ఒ.వి.)

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press: 6 & 7, Thambu Chetty Street, Madras-1, and at Andhra Patrika Press, Mallikarjuna Rao Street, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna.



పరీక్షాపత్రాలు సంస్కరించాలి!
పరీక్షా విధానం మార్చాలి!
గీతారావు కమిటీ సిఫార్సులు
జనరల్ నాలెడ్జి
నగరంలో ఆడుతున్న సినిమాలేవి? అందు క్రొత్తవి ఎన్ని? పాతవెన్ని? డబ్బింగు ఎన్ని
మేథమెటిక్స్
30 లక్షల రూపాయలతో నిర్మించిన ఒక చిత్రం 24 కేంద్రాల్లో 3 రోజులు హౌసుఫుల్ కలెక్షన్లతో నడిస్తే — ఆ నిర్మాతకి లాభమా? నష్టమా?
హిస్టరీ
మొట్టమొదటి మూకీ చిత్రం ఏది? బెజవాడ కనకదుర్గ స్వయంగా వెళ్ళి చూసిన చిత్రం పేరేమిటి?
సైన్స్
సినిమాల్లో కన్నీళ్ళకై వాడు రసాయనక పదార్థం ఏది? ఎట్లు తయారు చేయుదురు?
గ్రామర్
ఈ పుస్తకంలోని 3 పాటలను తీసి - అందుగల ద్వంద్వార్థములు వివరించి - అర్థతాత్పర్యాలు వ్రాయునది —
సినిమా పాటలు
తెలుగు
ఆరుద్ర రామాయణానికీ సముద్రాల రామాయణానికీ గల భేదం వివరించునది!
పింగళి ఏ కాలం నాటి వాడు?

Regd. No. 4479 ANDHRA SACHITRA VARA PATRIKA.

